PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 311 | విజయవాడ, శుక్రవారం 13 జూన్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 13 June 2025 | Rs

భూములిచ్చి తీరాల్సిందే

- కుప్పం ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణ
- అధికారులు, పోలీసుల బెదిరింపుల పర్వం
- 1474 ఎకరాలు ఇచ్చేందుకు రైతుల నిరాకరణ

3

రసవత్తరంగా లార్డ్స్ టెస్ట్

- కమిన్స్‌కు ఆరు వికెట్లు - దక్షిణాఫ్రికా 132ఆలౌట్
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 144/8

10








మరుభూమిగా మారిన ప్రమాద ప్రాంతం

మృత్యు విహంగం

- గాలిలో పేలి, మెడికల్ విద్యార్థుల హాస్టల్‌పై కూలిన విమానం
- విమానంలో 242 మంది, హాస్టల్లో 50కి పైగా విద్యార్థులు
- మృతుల సంఖ్యపై రాని స్పష్టత
- చాలామంది మరణించారన్న విదేశాంగ శాఖ
- వందకు పైగా మృతదేహాలు లభ్యం



రోదిస్తున్న బంధువులు



విమానంలో ప్రయాణం చేసిన గుజరాత్ మాజీ సిఎం విజయ్‌రూపాణి

ఒకే సంఘటన... రెండు ఘోర ప్రమాదాలు.. వందలాది మరణాలు ! గుజరాత్‌లో గురువారం చోటుచేసుకున్న మాటల కందని ఈ మహా విషాదంలో దాదాపు 300 మంది మృత్యు కోరల్లో చిక్కుకున్నారు. అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి గాల్లోకి ఎగిరిన టాటాల ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ విమానం మృత్యు విహంగంగా మారింది. టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే గాలిలోనే పేలిపోయింది. మండుతున్న అగ్ని గోళంగా మారి సమీపంలోని వైద్య విద్యార్థుల హాస్టల్‌పై కుప్పకూలింది. ఆ సమయంలో విమానంలోని ట్యాంకర్లలో లక్ష లీటర్లకు పైగా ఇంధనం ఉంది. దీంతో లండన్ వెళ్లడానికి విమానమెక్కిన 230 మంది ప్రయాణీకుల ఆశలు, ఆకాంక్షలు మంటల్లో చిక్కుకుని, గాలిలో కలిసిపోయాయి. వీరిలో కొత్తగా పెళ్లయిన జంటలతో పాటు, శిశువులు, చిన్నారులున్నారు. గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపాణి కూడా ప్రయాణీకుల్లో ఒకరు. 12 మంది విమాన సిబ్బంది పరిస్థితి కూడా ఇంతే! క్రాష్ ల్యాండింగ్ చేసే సమయంగానీ, ప్యారాచూట్లతో దూకే ఎత్తుగాని లేదని చెబుతున్నారు. హాస్టల్‌లోని మెడికల్ విద్యార్థుల పరిస్థితి మరీ ఘోరం! ఉదయాన్నే కాలేజికి వెళ్లిన విద్యార్థులు పలువురు అప్పుడే మధ్యాహ్న భోజనం కోసం హాస్టల్‌కు చేరుకున్నారు. తిన్నారో లేదో తెలియదు కానీ, కన్ను మూసి తెరిచేంతలో మృత్యు విహంగపు మంటల్లోనూ, విమాన ధాటికి కుప్పకూలిన శిథిలాల్లోనూ చిక్కుకున్నారు. ప్రమాద సమయంలో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులున్నారు. నలువైపుల కమ్ముకున్న నల్లటి పొగ, శిథిలాల నుండి పైకెగిసిన దుమ్ము ధూళి! మిట్ట మధ్యాహ్నమే గాఢాంధకారం కమ్ముకున్నస్థితి! ఒక్కసారిగా మార్మోగిన ఆర్తనాదాలు... హాహాకారాలతో అక్కడికి చేరుకున్న స్థానికులకు ఏం జరుగుతోందో అర్థం కాలేదు. కొద్దిసేపటి తరువాత మాంసపు ముద్దలుగా మారిన మానవ కళేబరాలు కనిపించాయి. ప్రమాద స్థలం నుండి రాత్రి పొద్దుపోయే సమయానికి 180కిపైగా మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఎందరు మరణించారన్న విషయమై అధికారక ప్రకటన వెలువడ లేదు. సంఘటన స్థలాన్ని సందర్శించిన హోంమంత్రి అమిత్‌షా వెయ్యికిపైగా డిఎన్‌ఎ పరీక్షలు చేయాల్సిఉందని, ఆ తరువాతే మృతుల సంఖ్యపై స్పష్టత వస్తుందని ప్రకటించారు. ఈ ప్రమాదంలో రమేష్ బిశ్వాస్ అనే వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. చివరి క్షణంలో ఆయన విమానంలో నుంచి దూకేసినట్లు చెబుతున్నారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మరిన్ని వార్తలు 5,7లో..

17న పాలస్తీనా సంఘీభావ దినం

- వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూన్ 17న పాలస్తీనా సంఘీభావ దినం ప్రకటించాలని రాష్ట్రంలో తొమ్మిది వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పి.ప్రసాదు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి.బంగార్రావు, ఎస్‌యుసిఐసి నాయకులు బి.ఎస్.అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు గురువారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. గాజాలోని పాలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు. 20 నెలలకుపైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేలమందికిపైగా పాలస్తీనియన్లు మరణించారని పేర్కొన్నారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని, ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నిటినీ ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారని తెలిపారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫ్లోటీల్లాకు చెందని మాడ్‌లీన్ ఓడపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండు చేశాయి. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతకవైఖరిని అవలంభిస్తోందని, వలసవాద వ్యతిరేక సంఘీభావం, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతునిస్తూ భారత్ సుదీర్ఘకాలంగా అనసరిస్తూ వచ్చిన వలసవాద వ్యతిరేక, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే విదేశాంగ విధానం నుండి వెనక్కు తగ్గడం సిగ్గుచేటు, పాలస్తీనా ప్రయోజనాలకు ఇప్పటి వరకూ మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధవైఖరి తీసుకోవాలి. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలి. పాలస్తీనియులపై ఇజ్రాయిల్ మారణకాండ, వివక్ష, ఆక్రమనలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా 17న ప్రదర్శనలు, సంఘీభార కార్యక్రమాలు జరపాలి. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్షాలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి.

మెగా డిఎస్‌సిపై స్టేకి సుప్రీంకోర్టు నిరాకణ

- హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో మెగా డిఎస్‌సి పరీక్షల నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ప్రారంభమైన ఉపాధ్యాయ నియామక ప్రక్రియ కోసం ఉద్దేశించిన మెగా డిఎస్‌సి పరీక్షలపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు అత్యున్నత న్యాయస్థానం విముఖత చూపించింది. ఈ కేసులో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. జూన్ 16 నుంచి హైకోర్టు పున్ణ ప్రారంభమైన తరువాత అక్కడే పిటిషన్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు తెలిపింది. మెగా డిఎస్‌సి ఇప్పటికే ప్రారంభమైనందున వాటిని నిలిపివేయలేమని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షలు ప్రారంభమయ్యాయని, కోర్టులు అలాంటి కేసులపై ఎటువంటి స్టే ఇవ్వకూడదని జస్టిస్ మన్మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనల్లో మెగా డిఎస్‌సి పరీక్షకు లక్షలాది మంది ఆశావాహులు ఇప్పటికే హాజరయ్యారని, పరీక్షలు జరుగుతున్నాయని, ఈ దశలో వీటిని నిలిపివేస్తే చాలా మందికి అన్యాయం చేసినట్లు అవుతుందని, వారి ప్రాథమిక హక్కులను హరించినట్లు అవుతుందని అన్నారు.



'తల్లికి వందనం' జిఓ కాపీని చూపిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

మీడియాతో చంద్రబాబు • తల్లికి వందనం నిధులు విడుదల
ఎందరు పిల్లలున్నా అందరికీ వర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కూటమి ఎన్నికలకు ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్‌లోని కీలక హామీయైన 'తల్లికి వందనం' పథకానికి నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా, అందరికీ ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నామని, దాని కోసం రూ.10098 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 67,24,164 మందికి రూ.15 వేల చొప్పున విడుదల చేస్తున్నామని, అందులో ఒక్కొక్కరి నుండి రూ.2 వేలు చొప్పున మినహాయించి, రూ.1346 కోట్లు పాఠశాల అభివృద్ధి ఫండ్‌కు కేటాయిస్తున్నామని, మిగిలిన రూ.8745 కోట్లు విద్యార్థుల తల్లులకు అందచేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే అర్హుల జాబితాను గ్రామవార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలేమైనా ఉంటే 30వ తేది లోపు పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నిధుల విడుదల కు సంబంధించిన జిఓ కాపీని ఆయన మంత్రి నారా లోకేష్‌కు అందించారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామని వివరించారు. అన్నదాత సుఖీభవను కూడా ఈనెల 20 ఇస్తామని తెలిపారు. మత్స్యకార భరోసా రూ.10 వేల నుండి రూ.20 వేలకు పెంచడంతోపాటు అమలు చేశామన్నారు. దీపం పథకం అమలవుతుందని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ భరోసా కింద పెన్షన్లు పెంచామని, దీనివల్ల రూ.12,370 కోట్ల అదనపు భారం పడిందని వివరించారు. ఏడాదికి రూ.34 వేల కోట్లు ఇస్తున్నామని అన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా రెండుకోట్ల మందికి భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. 21 దేవాలయాల్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని సిఎం అన్నారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి,. దానిని సంక్షేమానికి ఉపమయోగిస్తామని ఎన్నికల ముందు చెప్పామని, ఇప్పుడు అదే చేస్తున్నామని అన్నారు. జనాభా పెరుగుదల అనుకున్న విధంగా జరగడం లేదని, దీనికోసం ఫ్యామిలీ మేనేజ్‌మెంట్ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు.

చేయగలనా అన్న సందేహం వచ్చింది...

గత ఐదేళ్లలో రాష్ట్రంలో పూర్తిగా విధ్వంసం జరిగిందని చెప్పారు. అందుకే, గత ఏడాది ప్రమాణ స్వీకారం ముందు ఎంత అనుభవం ఉన్నా చేయగలరా అన్న సందేహం చాలా మందితో పాటు తనకు కూడా కలిగిందని అన్నారు. ఎంతకష్టమయినా సరే చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. యువతకు ఉపాధి, కల్పన పరిశ్రమల ఏర్పాటు ద్వారా అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దీనికోసం మంత్రి లోకేష్ ఆధ్వర్యాన కమిటీ వేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 9.8 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో 94 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. జీరోపావర్టీ, ఆర్థిక అసమానతలు లేని మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంలో భాగంగా ఆడబిడ్డ నిధిని పి4కు అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. పేదల జీవితాల్లో మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం టిడిపి ఆశయమని వివరించారు.

డబుల్ ఇంజిన్ సర్కారు దూసుకుపోతోంది : లోకేష్

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు దూసుకుపోతోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. దేశీయ పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. రాష్ట్రానికి 16 శాతం పెట్టబడులు, టిసిఎస్, ఎల్‌జి, ఎన్‌టిపిసి, రిలయన్స్ వంటి సంస్థలు వచ్చాయన్నారు. మెగా డిఎస్‌సి అమలు చేస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లలో చేసిన అరాచకాలను కొనసాగించడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వాటిని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అమరావతి మహిళలపై ఇష్టారాజ్యంగా కొవ్వెక్కి మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషిస్తున్నారని, ఎక్కడికెళ్లినా రౌడీలను వెంటబెట్టుకుని వెళ్తున్నారని అన్నారు. 'అటువంటి వారిని చూస్తూ ఊరుకోం, చట్టం తనపని తాను చేసుకుపోతుంది' అరి అన్నారు. తీవ్రవాదం, ముఠా తగాదాలు, మతపరమైన ఘర్షణలను చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు.

మరో 4 రోజులు వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తర కోస్తాంధ్రను ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిషా మీదుగా సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని నుంచి ఛత్తీస్‌గఢ్, మరాఠ్వాడ, ఇంటీరియల్ కర్ణాటక వరకూ ద్రోణి విస్తరించి ఉందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. వీటి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. నేడు.. పార్వతీ పురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, బి.ఆర్ అంబే ద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కడప జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఎస్‌ఎస్ ఫార్మాలో విష వాయువు లీక్

- ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)



కుమార్ (ఫైల్) | చంద్రశేఖర్ (ఫైల్)

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో సాయి శ్రేయాస్ (ఎస్‌ఎస్) ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వ్యర్థ రసాయనాల ప్లాంట్ వద్ద బుధవారం రాత్రి విషవాయువు లీకైంది. ఈ వాయువు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. కంపెనీలో సేఫ్టీ మేనేజర్‌గా పనిచేస్తున్న తెలంగాణ వాసి పి.చంద్రశేఖర్ (32), అనకాపల్లి జిల్లా మునగపాక గ్రామానికి చెందిన శరగడం కుమార్ (24) మృతిచెందారు. హెల్పర్‌గా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన బైసాల్ పరిస్థితి విషమంగా ఉంది. అతడు విశాఖ నగరంలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రశేఖర్, కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పరవాడ సిఐ మల్లికార్జున రావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మృతులకు రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రమాద ఘటనపై విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయన్నారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : సిఐటియు

ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించి, కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కెజిహెచ్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదంపై సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సాయిబాబా శత జయంతి అధికారికంగా జరపొద్దు

- జన విజ్ఞాన వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సరికాదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ చర్య రాజ్యాంగ లౌకిక విలువలకు విరుద్ధమని, రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వ పెద్దలు ఇలా చేయడం తగదని వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్రా రామరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు నోడల్ ఏజన్సీలుగా యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖలను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పుట్టపర్తి సాయిబాబా వివాదాస్పదుడని, ఆయన విద్య, వైద్యం తాగునీరు తదితర విషయాల్లో సానుకూలమైన పేరు తెచ్చుకున్న మాట వాస్తవమేనని, కాని అంతకు మించి ఆరోపణలు ఆయనపై ఉన్నాయని తెలిపారు. ఆయన వ్యక్తిగత గదిలో ఆరుగురు హత్యకు గురయ్యారని, ఆ హత్యలు ఎందుకు జరిగాయో, వాటి వెనుక ఏమి జరిగిందో ఇంత వరకూ తేలలేదన్నారు. సాయిబాబా ప్రవచన కారుడే, కానీ ఆయన చూపే మహిమలు, హస్త లాఘవమని రుజువయ్యాయని చెప్పారు. సాయిబాబాను నమ్మేవారు, అనుచరులు ఆయన శతజయంతిని జరుపుకుంటే అది వారి ఇష్టమని, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శతజయంతిని జరపాలని కలెక్టర్లను, ప్రభుత్వ శాఖలను ఆదేశించడాన్ని జన విజ్ఞాన వేదిక వ్యతిరేకిస్తుందని అన్నారు. శాస్త్రీయ ఆలోచనలను పౌరుల్లో ప్రోత్సహించాలని, రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. ఈ విషయంలో ఇచ్చిన అధికారిక ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తొలిరోజే పాఠశాలకు తాళం

బడి మార్చొద్దంటూ మురకంబట్టు అగ్రహారం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, బూర్జ

పాఠశాలలు పున:ప్రారంభమైన తొలిరోజే చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్ మురకంబట్టు అగ్రహారంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తాళం పడింది. తమ గ్రామంలోని పాఠశాలను మూసివేసి దూరంగా ఉన్న మరో పాఠశాలకు మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం అల్లినలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను తొలగించే ప్రతిపాదనపై విద్యార్థులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్ మురకంబట్టు అగ్రహారంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మురకంబట్టులోని మండల పరిషత్ పాఠశాలకు మార్చాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉండేదని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి మరో పాఠశాలకు వెళ్ళమని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని కోరారు.



అల్లినలో స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

శ్రీకాకుళం జిల్లా అల్లినలో నిరసన

బూర్జ మండలం అల్లినలో ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల వద్ద బైఠాయించి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ.. అల్లినలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలను ఎత్తివేసి, ప్రాథమిక పాఠశాలను మాత్రమే ప్రభుత్వం కొనసాగించనుందని పేర్కొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలను ఎత్తేస్తే దూర ప్రాంతంలోని బూర్జ, పాలవలస హైస్కూళ్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పాలవలస హైస్కూల్‌కు వెళ్లాలంటే 14 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుందని తెలిపారు. బూర్జ హైస్కూల్‌కు వెళ్లాలంటే నదీ పరివాహక ప్రాంతాల నుంచి పొలం గట్ల మీదుగా పాఠశాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రయాణ సమయంలో ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.



దీక్షల్లో కూర్చున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'ఉక్కు' ప్రయివేటీకరణను విరమించే వరకూ పోరాటం

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1582వ రోజుకు చేరాయి. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి, శ్రీనివాసరాజు, పివి.రమణమూర్తి, బిఎన్.రాజు, వి.శ్రీనివాసరావు, పెద్దిరాజు, దాసరి శ్రీనివాస్, నాయుడు, సుధాకర్ కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షల టెంట్ కుప్పకూలడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యంవల్ల కూలిందా ? అసాంఘిక శక్తుల ప్రమేయం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు కార్మికుల్లో నెలకొన్నాయన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా ఉక్కు పరిరక్షణ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుంటామని ప్రధాని మోడీ పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేసే వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్లాంట్‌ను పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

16న కలెక్టరేట్ల వద్ద ధర్నా

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ జూన్ 16వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం నెలకు రూ.12 వేల లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించిందని, అంగన్వాడీ వర్కర్లకు నెలకు రూ.11,500, హెల్పర్లకు, మినీ వర్కర్లకు రూ.7వేలు గౌరవ వేతనమే ఇస్తున్నందున వీరికి తల్లికి వందనంతోపాటు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంగన్వాడీలు పేద కుటుంబాలకు చెందినవారని, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లకు వీరు సేవలందిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని జూన్ 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'దుగ్గిరాల' బాధితులకు త్వరలో పరిహారం

- నూతన వంగడాల రూపకల్పనపై దృష్టి పెట్టండి
- వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకు మంత్రి అచ్చెన్న సూచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో రైతులకు వివిధ రకాల పంటల దిగుబడి అధికంగా వచ్చేలా శాస్త్రవేత్తలు నూతన వంగడాలకు రూపకల్పన చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం జిల్లా లాంలోని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 62వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలకు అధిక దిగుబడి వచ్చేలా, పెట్టుబడి తగ్గేలా విత్తనాలను తయారు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, అధిక దిగుబడి, ఎగుమతులకు అనుకూలమైన రకాలకు సాంకేతికతను జోడించాలన్నారు. అగ్రికల్చర్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు. రైతులకు నూతన విషయాలను తెలియజేస్తేనే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించి సరికొత్త విధానంలో రైతులు, శాస్త్రవేత్తలు వ్యవసాయాన్ని చేస్తూ అధిక లాభాలను గణిస్తున్నారని అన్నారు.

భూసార పరీక్షలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రైతులు పురుగు మందుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకే విధమైన పంటను కాకుండా ఇతర పంటలపై కూడా దృష్టి సారించాలన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గతేడాది సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల పంట నష్టపోయిన పసుపు రైతులకు జూన్ నెల చివరి నాటికి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసానితో కలిసి ఆయన అధికారులతో చర్చించారు. బీమా సంస్థలను ఒప్పించామని, త్వరలో రైతులకు పరిహారం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 24 మంది ఉత్తమ రైతులకు, 16 మంది శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి, అగ్రికల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు పాల్గొన్నారు.



విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పేర్ని నానికి లభించని ఊరట

ప్రజాశక్తి, అమరావతి

మచిలీపట్నంలో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని పత్రికల్లో వచ్చిన కథనం ఆధారంగా తమను పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందంటూ వైసిపి నేత పేర్ని వెంకట రామయ్య (నాని), ఆయన కుమారుడు పేర్ని సాయి కృష్ణమూర్తి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 16కి వాయిదా పడింది. పిటిషనర్లపై కేసు నమోదు కాలేదని గుర్తు చేసింది. అపరిపక్వ దశలోనే కోర్టుకు వచ్చారని అభిప్రాయపడింది. నకిలీ పట్టాల వివరాలు అందజేయాలని రెవెన్యూశాఖను కోర్టు ఆదేశించింది. ఈలోగా పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలన్న వారి వాదనను తోసిపుచ్చుతూ జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో ఇళ్ల పట్టాలు ఇచ్చారని పత్రికల్లో కథనం రావడంపై పేర్ని నాని, ఆయన కొడుకు తరపున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదించారు. ఎస్ఐఆర్ నమోదుకు పోలీసులు సిద్ధమౌతున్నారని చెప్పారు. రాజకీయ కక్షసాధింపుతో కేసులో ఇరికించే ఆస్కారం ఉందన్నారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంపై విచారణ జరగుఉతోందని చెప్పారు.

కృష్ణా డెల్టాకు 15న సాగునీరు విడుదల

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణా డెల్టాలోని కాల్వలకు సాగునీటి విడుదల వాయిదా పడింది. ఈ నెల 10వ తేదీనే కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించినా.. కాల్వల నిర్వహణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో వాయిదా వేశారు. ముందస్తుగా నాట్లు వేయడం ద్వారా తుపాను, వరదల ప్రభావం నుంచి పంటలు తట్టుకునేలా చూడాలని ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆలస్యంగా నాట్లు వేస్తే భారీ వర్షాలు, వరదలకు పంటలు మునిగిపోతుంటాయి. దీంతో మళ్లీ పంటలు సాగు చేయాల్సి వస్తుండడంతో రైతులకు అదనపు ఖర్చు తప్పడం లేదు. ముందస్తుగా నాట్లు వేస్తే... ఇవి కొంత మేర పెరిగి వరదలను తట్టుకుంటాయి. ఈ కారణంగా ముందస్తు సాగుకే ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే, కాల్వల నిర్వహణ ఆలస్యం కావడంతో కొంత ఆలస్యంగా నీటి విడుదలకు ముహూర్తం ఖరారైంది. కష్ణా తూర్పు డెల్టాకు ఈ నెల 15న సాగునీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ కెసి డివిజన్ ఇఇ ఆర్.రవికిరణ్ తెలిపారు. ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని కాల్వలకు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేస్తారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన నీటి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు లేకపోవడంతో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను పోలవరం కాల్వకు విడుదల చేయాల్సి వచ్చింది. ఈ సీజనులో పులిచింతల ప్రాజెక్టులో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. కష్ణా నది ఎగువన నీటి పరి స్థితి ఆశాజనకంగా ఉంది. ఫలితంగా రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.

సిఎం కార్యక్రమాలన్నీ రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించతలపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వాయిదా వేశారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిఎం కార్యాలయం ప్రకటించింది. అలాగే రెన్యువబుల్ ఎనర్జీ రీజనల్ వర్కుషాపులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం విశాఖపట్నం వెళ్లాల్సి ఉండగా ఆ కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మెగా డిఎస్‌సి పరీక్షలకు 91.84 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సిలో భాగంగా ఆరవ రోజైన గురువారం నిర్వహించిన పరీక్షకు 91.84 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కన్వీనర్ ఎం.వి కృష్ణారెడ్డి తెలిపారు. గణిత పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 39,048 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 35,862 మంది హాజరయ్యారని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం 117 పరీక్షా కేంద్రాల్లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజ్) గణిత పరీక్షకు 21,825 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 20,254 (92.80శాతం) మంది హాజరయ్యారని తెలిపారు.

మధ్యాహ్నం 92 కేంద్రాల్లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజ్) గణితం, కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ మాధ్యమాల్లో గణిత బోధనకు 17,223 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 15,608 (90.62 శాతం) మంది హాజరయ్యారని వెల్లడించారు. రెండు పూటల్లో నెల్లూరు జిల్లా నుంచి అత్యధికంగా అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

'తల్లికి వందనం' జులై 5 !

- అన్ని పరిశీలనలూ పూర్తయ్యాక జమ
- ఇచ్చేది 13 వేలే
- తొలి దశలో అర్హులు 54.94 లక్షలు
- నెల ఆదాయ పరిమితి రూరల్‌లో 10 వేలు, అర్బన్‌లో 12 వేలు
- 75 శాతం హాజరు తప్పనిసరి
- వివిధ కార్పొరేషన్ల ద్వారా పంపిణీ
- ఇంకా పలు కఠిన షరతులు
- గైడ్‌లైన్స్ జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో చదువుకునే పిల్లల తల్లులకు ఆర్థిక సాయం చేసే 'తల్లికి వందనం' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు ఖరారు చేసింది. సదరు గైడ్‌లైన్స్ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే విధంగా ఉన్నాయి. జిఒఎంఎస్ నెం.26లో గైడ్‌లైన్స్, జిఒఎంఎస్ నెం.27లో పరిపాలనా విషయాలు పొందుపర్చారు. ఏడాదికి రూ.15 వేలు తల్లుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తామని ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో కూటమి పార్టీలు హామీ ఇవ్వగా తొలేడాది కాకుండా రెండవ ఏడాదిలో స్కీంను ప్రారంభించి, రూ.2 వేలు మినహాయించుకుంటున్నారు. తల్లుల అకౌంట్లలో జమ అయ్యేది రూ.13 వేలే. కట్ చేసిన రూ.2 వేలను ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం 67,27,164 మందికి సొమ్ము వేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించగా వారిలో 54,94,703 మందే ప్రాథమికంగా అర్హులుగా తేలారు. మిగతా 13 లక్షల మందిలో కొత్తగా ఫస్ట్ క్లాస్‌లో చేరే వారు, ఫస్ట్ ఇంటర్‌లో చేరేవారి లెక్కలను ఉజ్జాయింపుగా వేసి వాటిని కూడా కలిపారు. సరైన సమాచారం లేని వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. జివోలో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం గురువారం (జూన్ 12)న జాబితాలు సిద్ధం చేసి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రకటించి, అభ్యంతరాలు, విజ్ఞాపనలు స్వీకరించి, తుది జాబితాలు ప్రచురించాక, జులై 5న అర్హులకు డబ్బులు వేస్తారన్నారు. కాగా గురువారమే డబ్బు పడుతుందని ప్రభుత్వం ప్రచారం చేసింది. 'తల్లికి వందనం' లబ్ధికి పలు షరతులు విధించారు. గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి'కి నిర్ణయించిన మార్గదర్శకాలనే ఇప్పుడూ దాదాపు ఖరారు చేశారు.

ముఖ్యాంశాలు

- రూ.15 వేల సాయంలో 2 వేలు కట్ చేసుకొని 13 వేలు తల్లుల అకౌంట్లలో వేస్తారు.
- అన్ని పరిశీలనలు పూర్తయ్యాక జులై 5న అకౌంట్లలో సొమ్ము జమ చేస్తారు.
- తొలుత 54.94 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. తదుపరి 13 లక్షల మంది వివరాలను క్షుణ్ణంగా తనిఖీలు పూర్తి చేస్తారు.
- వివిధ తరగతులకు చెందిన కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు సొమ్ము జమ చేస్తారు.
- విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు పొందిన వారికి సొమ్ము పూర్తిగా ఇవ్వరు. ఆయా స్కూళ్ల మేనేజ్‌మెంట్లకు చెల్లించాల్సిన ఫీజులు ఈ సొమ్ము నుంచి మినహాయించి, మిగతావి లబ్ధిదారుల తల్లులకు అందజేస్తారు.
- కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పోస్ట్, ప్రీ స్కాలర్‌షిప్‌లు పొందుతున్న వారికి స్కాలర్‌షిప్‌ల అమౌంట్ పోను మిగతావి ఇస్తారు.
- తల్లికి వందనం లబ్ధికి కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో అయితే రూ.10 వేలు, అర్బన్‌లో 12 వేలు మించరాదు.
- ఫోర్ వీలర్ ఉండకూడదు. టాక్సి, ఆటో, ట్రాక్టర్లను మినహాయించారు.
- కరెంట్ వినియోగం 300 యూనిట్లకు మించరాదు.
- అర్బన్‌లో వెయ్యి చదరపు గజాలకు మించి ఆస్తి ఉండకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు, పది వేలకు పైన పెన్షన్ వచ్చే వారికి పథకం వర్తించదు. ఈ నిబంధన నుంచి మున్సిపల్ వర్కర్లను మినహాయించారు.
- విద్యార్థికి తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలి.
- కుటుంబానికి తప్పనిసరిగా తెల్ల రేషన్ కార్డు ఉండాలి.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే స్టూడెంట్స్‌కు తల్లికి వందనం వర్తించదు.
- ఆధార్, ఆధార్ బేస్డ్ పేమెంట్స్, ఎన్‌పిసిఐ, హౌస్‌హోల్డ్ సర్వే తప్పనిసరి.

ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీలో జాప్యాన్ని నివారిస్తాం

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించిన హెల్త్ కార్డుల జారీలో జాప్యాన్ని నివారిస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ అన్నారు. గుంటూరులో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్డుల (ఆరోగ్యశ్రీ) ద్వారా 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, వీటితోపాటు ఇప్పటి వరకు 61 లక్షల ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు కూడా రూ.5 లక్షల అదనపు ఉచిత వైద్యంతో ప్రత్యేక వైద్య కార్డులు ఇస్తున్నామని తెలిపారు. వీరు రాష్ట్రంలో 20 లక్షల మంది వరకు ఉన్నారన్నారు. చాలా మంది వృద్ధులకు ఇంకా అవగాహన లేక ఆన్‌లైన్‌లో వీటిని పొందలేకపోతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అందరికీ అవగాహన కల్పించి 70 ఏళ్లు దాటిన వారికి ప్రత్యేక హెల్త్ కార్డులు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. గత ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.2,500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత చెల్లించామని తెలిపారు. విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు కేంద్రం ఇచ్చే సబ్సిడీలతో పేద, మధ్య తరగతి కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన సోలార్ సూర్యఘర్ పథకాన్ని పేదలు ఉపయోగించుకోవాలని కోరారు. వైసిపి విధ్వంసక పాలన నుంచి రాష్ట్రం కోలుకుంటుందని, ప్రస్తుతం అభివృద్ధివైపు దూసుకుపోతోందని తెలిపారు.

కృష్ణంరాజుకు 14 రోజుల రిమాండ్

- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు
- కోర్టు వద్ద రాజధాని రైతులు, మహిళల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజుకు మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బుధవారం విశాఖలో అరెస్టు చేసిన తుళ్లూరు పోలీసులు గురువారం గుంటూరుకు తీసుకువచ్చారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. ఇరువురి తరుపున వాదనలు విన్న న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో కృష్ణంరాజును గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో ఇప్పటికే కొమ్మినేని శ్రీనివాసరావు రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసింది. కృష్ణంరాజుపై రాజధాని మహిళా నేత కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది.

వ్యాఖ్యల వెనుక లోతైన కుట్ర..! : హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ

అనుచిత వ్యాఖ్యల వెనుక లోతైన కుట్ర దాగి ఉందని హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ ఆరోపించారు. కోర్టు బయట ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... సాక్షి మీడియాను ఆసరాగా తీసుకొని రాజధానిపై కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అమరావతి రాజధానిని విధ్వంసం చేయడానికి వైసిపి వారు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.



కృష్ణంరాజును కోర్టులో హాజరుపర్చేందుకు తెస్తున్న పోలీసులు

రాజధాని రైతులు, మహిళల నిరసన

కృష్ణంరాజును మంగళగిరి కోర్టుకు తీసుకువస్తున్నారన్న సమాచారంతో రాజధానిలోని వివిధ ప్రాంతాల నుంచి జెఎసి నేతలు, మహిళలు పెద్ద ఎత్తున కోర్టుకు వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిమాండ్ అనంతరం కృష్ణంరాజును గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తున్న సమయంలో జెఎసి నాయకులు పువ్వాడ సుధాకర్, వి.మైనర్‌బాబు, మన్నెం రమేష్‌బాబు, మల్లేశ్వరి, వై.పద్మజ ఆధ్వర్యంలో అమరావతి ప్రాంత రైతులు, నేతలు మహిళలు పెద్ద ఎత్తున కోర్టు బయట నిలబడి కృష్ణంరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఐపిఒకు అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్

ముంబయి : అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకు రావాలని అదానీ గ్రూపు యోచిస్తోంది. ఐపిఒ ద్వారా 2027 నాటికి స్టాక్ ఎక్స్చేంజీలో లిస్టింగ్ చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ భారత్‌లో ఎనిమిది విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. సంస్థ తన మూలధన వ్యయ ప్రణాళికను రెట్టింపు చేసింది. గత పదేళ్లలో ఖర్చు చేయాలనుకున్న 100 బిలియన్ డాలర్లను ఇప్పుడు ఐదు నుంచి ఆరేళ్లలోనే పెట్టుబడిగా మార్చేందుకు సన్నాహాలు చేస్తోందని సమాచారం.

ఫోక్స్‌వ్యాగెన్ వర్టస్ అమ్మకాల్లో 7 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఫోక్స్‌వ్యాగెన్‌కు చెందిన వర్టస్ ప్రీమియం సెడాన్ విభాగంలో వర్టస్ గడిచిన ఏడాది కాలం అమ్మకాల్లో 7 శాతం వృద్ధిని సాధించినట్లు తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో 32 శాతం వాటాను కలిగి ఉన్నట్లు పేర్కొంది. వర్టస్‌ను ఆవిష్కరించి మూడేళ్లు అయ్యిందని ఫోక్స్‌వాగెన్ ప్యాసింజర్ కార్స్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ తెలిపారు. ఇది స్థిరమైన పనితీరును అందించే ఏకైక సెడాన్‌గా నిలుస్తోందన్నారు. 2024, 2025లో సెడాన్ వర్టస్ అమ్మకాల్లో మరింత బలోపేతం కానుందన్నారు.

ఏడాదిగా చీకటి రోజులు : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ జగన్ అంటే నమ్మకమని, చంద్రబాబు అంటే మోసమని వైసిపి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై వైసిపి ప్రచురించిన పుస్తకాన్ని గురువారం సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలన మొత్తం చీకటి రోజులేనని, రెడ్‌బుక్ పేరుతో అరాచకం చేస్తున్నారని అన్నారు. వైసిపి ప్రజల కోసం బంగారు భవిష్యత్ ఇచ్చిందని, చంద్రబాబు పాలన వాటిని ధ్వంసం చేస్తోందని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఈ పుస్తకాన్ని ఉంచుతున్నామని వివరించారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా వెన్నుపోటుదినంగా వైసిపి ఇచ్చిన పిలుపునకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున స్పందన వచ్చిందని వివరించారు. రెడ్‌బుక్ పేరుతో ఇష్టారాజ్యంగా కేసులు నమోదు చేస్తున్నారని వివరించారు. పుస్తకావిష్కరణలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, చంద్రశేఖర్, కల్యాణి, హనుమంతరావు, అరుణ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు న్యాయం జరగాలి

పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు న్యాయం జరగాలని, దరఖాస్తు చేసిన వారికి ఉచితంగా రీవాల్యుయేషన్ చేయించాలని వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేసిందని తెలిపారు.

నియంత పాలనకు ఏడాది పూర్తి : ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

చంద్రబాబు ఏడాది పాలనలో వంచన, కుట్రలు, సూపర్‌సిక్స్ పేరుతో అన్ని వర్గాలనూ మోసం చేశారని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూములిచ్చి తీరాల్సిందే

- కుప్పం ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణ
- అధికారులు, పోలీసుల బెదిరింపుల పర్వం
- 1474 ఎకరాలు ఇచ్చేందుకు రైతుల నిరాకరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు జిల్లా కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు మీ భూములు కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందే అంటూ అధికారులు బెదిరింపుల పర్వానికి తెరదీశారు. ఎకరాకు రూ.16 లక్షలు నష్టపరిహారం ఇస్తామని, ఒకవేళ భూములు ఇవ్వమని మొండికేస్తే ఆ పరిహారం కూడా ఇవ్వకుండా బలవంతంగా లాక్కుంటామని హెచ్చరించారని రైతులు పేర్కొన్నారు. తామేమీ తక్కువ కాదంటూ పోలీసులు కూడా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి మరీ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారులు ఏమైనా చేస్తారోమోనని రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలబడడంతో...మీరు ఎంత బెదిరించినా మా భూములను ఇచ్చేది లేదంటూ రైతులు తెగిసి చెబుతున్నారు. అవసరమైతే పోరుబాటకు సిద్ధమవుతామని పలువురు రైతులు పేర్కొన్నారు.

కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని,రైతులు పండించే కూరగాయలు, పూలు, పండ్లు ఎగుమతులు చేసుకోవడానికి వీలుగా ఉంటుందని భావించి 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భూమి పూజ చేశారు. అప్పట్లోనే తమ భూములు ఇచ్చేది లేదని రైతులు తిరగబడడంతో ప్రభుత్వం కొంతమేర వెనక్కి తగ్గింది. ఆ తరువాత 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత 294 ఎకరాలను సేకరించాలని ప్రయత్నించింది. రైతులు ససేమిరా అనడంతో వెనక్కి తగ్గింది. ప్రస్తుతం టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం తెరపైకి వచ్చింది. 1474 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. నిర్మాణానికి నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లోని 23 గ్రామాల రైతుల నుంచి ఈ భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించి, 70 శాతం రైతులు ఆమోదం తెలిపితేనే భూములను సేకరించాల్సి ఉంది. వ్యవసాయ కార్మికులకూ, వృత్తిదారులకూ నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని ఇటీవల


తమ పొలాలు ఇచ్చేది లేదంటూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను అడ్డుకుంటున్న రైతులు (ఫైల్)

సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అయితే స్వయానా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గంలో 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తుండటం గమనార్హం. అధికారులు అత్యుత్సాహం చూపి, పోలీసులను సైతం రైతుల ఇళ్లకు పంపి 'భూములు ఖచ్చితంగా ఇచ్చి తీరాల్సిందే' అంటూ బెదిరింపుల పర్వానికి దిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 22న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ పేరుతో ప్రాథమిక నోటీసులను సైతం జారీ చేశారు. గుట్టలు, పుట్టలు ఉన్న ఈ ప్రాంతాన్ని 40 ఏళ్లుగా చదునుచేసి కారగాయలు, పూలు, పండ్లు పండించుకుంటూ జీవనోపాధిగా మలచుకుని జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం గుండెల్లో బాకులా మారింది. భూములు ఇవ్వకపోతే అధికారులు ఏం చేస్తారోననే భయం, ఇస్తే తమ జీవనోపాధిని కోల్పోతామనే బెంగ వారిని గత రెండు నెలలుగా పట్టి పీడుస్తోంది. చిత్తూరు జిల్లా కలెక్టర్ సునిత్‌కుమార్ రైతులను పిలిపించి 'మీ భూములకు రక్షణ కల్పిస్తాం' అని భరోసా ఇచ్చారు. అయితే కలెక్టర్ చెప్పిన రెండు వారాల్లోనే మళ్లీ రెండోసారి నోటీసులను ప్రభుత్వం ఇవ్వడంతో భూములను కాపాడుకోవాలంటే 'పోరాటం' తప్పదని రైతులంతా ఒకే తాటిపైకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శాంతిపురం తహశీల్దార్ శివయ్య ఆయా భూముల వద్దకు వెళ్లగా రైతులు వారిని ముట్టడించారు. 'బలవంతపు భూసేకరణ తప్పనిసరి' అన్నట్లుగా అధికారుల తీరు ఉండటం గమనార్హం.

రైతులను నట్టేట ముంచొద్దు :
వి.వెంకటేశ్వర్లు, వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



స్థానికులకు, నిరుద్యోగులకు ఎందుకూ ఉపయోగం లేని గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్మించొద్దు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా 'ల్యాండ్' అవడానికి తప్ప స్థానికులకు ఎందుకూ ఉపయోగపడదు. రైతులు మూడు పంటలు వేసుకుని, సంతోషంగా జీవనం గడుపుతుంటే బలవంతంగా వారి భూములను లాక్కుని, వారిని నట్టేట ముంచడం భావ్యం కాదు. రైతులను రోడ్డున పడేస్తే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.


ఆసుపత్రి వద్ద మౌన దీక్ష చేపట్టిన విమ్స్ వైద్యులు

జీతాలు పెంచాలని విమ్స్ వైద్యుల మౌన దీక్ష

ప్రజాశక్తి - అరిలోవ (విశాఖపట్నం)

విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచడం లేదంటూ పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆస్పత్రి వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధుల్లో చేరి మూడేళ్లు దాటినా రూ.92 వేలు జీతానికే విధులు నిర్వహిస్తున్నామని, కాంట్రాక్టు పద్ధతిలో తమ క్యాడర్‌కే చెందిన వారు పలాస కిడ్నీ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తుంటే వారికి సుమారు రూ.1.60 లక్షలు ఇస్తున్నారని తెలిపారు. పీజీ స్టూడెంట్స్ స్టైఫండ్ తమకంటే ఎక్కువ వస్తోందన్నారు. జీతాలు పెంచి, తమ కాంట్రాక్టును రెన్యువల్ చేయాలని కోరారు. తమ ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'అనంత'లో వైసిపి నేతల అరెస్టు

- అత్యాచార బాధితురాలి పరామర్శను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో అత్యాచారానికి గురైన దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న వైసిపి నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని వైసిపి నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని గృహ నిర్బంధం, అరెస్టులు చేశారు. దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు సత్యసాయి జిల్లా వైసిపి నాయకులు గురువారం ఛలో పేరూరుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ మంత్రి మేరుగ నాగార్జున విచ్చేశారు. రాప్తాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలిసి అనంతపురం నుంచి పేరూరుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయన్ను అనంతపురం నగర శివారులోనే పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వేరొక మార్గంలో మద్దెలచెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ వైసిపి నాయకులు గంగుల భానుమతి నివాసం వద్ద ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి ఆయన్ను తీసుకొచ్చి అనంతపురం నగరంలో వదిలేశారు. మాజీ మంత్రి శింగనమల సమన్వయకర్త సాకె శైలజనాథ్ జాతీయ రహదారి మీదుగా ఎన్ఎస్‌గేటు మార్గంలో పేరూరుకు వెలుతుండగా పోలీసులు ఆపారు. పెనుకొండ నుంచి బయలుదేరిన మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను పెనుకొండ జాతీయ రహదారిపై ఆపారు. తాను పరామర్శకు వెళ్లి తీరుతానని ఆమె చెప్పడంతో పోలీసులు అరెస్టు చేసి పెనుకొండకు తరలించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపాయించామని మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి కూడా ప్రతిపక్ష పార్టీల నేతలను అనుమతించకపోవడం దారుణమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అండదండలతో ఆ నియోజకవర్గంలో రౌడీలు రెచ్చిపోతున్నారన్నారు. ఇదే నియోజకవర్గంలో కురుబ లింగమయ్యను, నారాయణరెడ్డిని హత్య చేశారని తెలిపారు. తాజాగా బాలికపై అత్యాచారం చేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు.

గోదావరిలో నాటుపడవ బోల్తా

- మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద గోదావరిలో ప్రమాదవశాత్తూ నాటు పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగుచూసింది. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురానికి చెందిన మత్స్యకారుడు ఎన్.రాంబాబు (45) బుధవారం సాయంత్రం చేపల వేటకు నాటు పడవపై వెళ్లారు. రాత్రైనా ఆయన తిరిగి రాకపోవడంతో సహచర మత్స్యకారులు గోదావరిలో గాలించగా బోటు బోల్తా పడినట్లు గుర్తించారు. పొన్నపల్లి వద్ద రాంబాబు మృతదేహం వలలో చిక్కుకుని ఉండటాన్ని గుర్తించి గురువారం వెలికితీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసత్రికి తరలించారు. రాంబాబుకు భార్య, పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని నరసాపురం ఎమ్మెల్యే నాయకర్ పరామర్శించారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- విద్యార్థిని హత్య కేసులో పోలీసుల వైఫల్యం లేదు
- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఇటీవల హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య కేసులో పోలీసు వైఫల్యం లేదని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కితాబునిచ్చారు. పైగా మహిళలు బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఉచిత సలహా ఇచ్చారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన బాలికను పరామర్శించారు. అనంతరం హత్యకు గురైన తన్మయి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు ఆర్అండ్‌బి అతిథి గృహంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తన్మయి హత్యకేసులో పోలీసులు సరైన పద్ధతిలోనే వ్యవహరించారని తెలిపారు. ఫిర్యాదు సమయంలో నిందితుడికి బదులు తల్లిదండ్రులు మరొకరి పేరు ఇవ్వడం, హత్య అనంతరం నిందితుడు నరేష్ పేరు బయటకొచ్చిందన్నారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. హత్య విషయం బయటకొచ్చాక సిఐ సరైన పద్ధతుల్లో వ్యవహరించకపోవడంతోనే చర్యలు తీసుకున్నట్లు వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో బాలికను భయపెట్టడంతో ఆమె విషయం బయటకు చెప్పలేదని, ఏడు నెలల గర్భిణి అయిన తరువాత ఆరోగ్య సమస్యలతో విషయం బయటకొచ్చిందన్నారు. ఏదైనా ఘటనలు చోటు చేసుకుంటే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.


మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ

బాధితురాలి పేరు వెల్లడించి నాలుక కరుచుకున్న ఛైర్‌పర్సన్

అత్యాచారానికి గురైన బాధితురాలి పేర్లను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ మూడు పర్యాయాలు వెల్లడించారు. పేరు వెల్లడించకూడదని మీడియా ప్రతినిధులు చెప్పిన తర్వాత ఆమె నాలుక కరుచుకున్నారు. అత్యాచారానికి గురైన వారి పేరు వెల్లడించారని గతంలో హిందూపురం మాజీ పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేసింది. మరి ఛైర్‌పర్సన్ విషయంలో ఏమి చేస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

నిరసన సెగ

దళిత, గిరిజన బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నాయకులు ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద నిరసన చేపట్టారు. ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ వాహనాన్ని చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పే ప్రయత్నం చేసినా నాయకులు వినకుండా వాహనానికి అడ్డంగా నిలబడ్డారు. పోలీసులు కలుగజేసుకుని వారిని పక్కకు తప్పించి ఆమెను ముందుకు వెళ్లేందుకు దారి చూపారు.

ఏడాది గడిచినా సూపర్ సిక్స్‌కు దిక్కులేదు

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-కడప

ఎన్నికల ప్రచార పత్రంలా చంద్రబాబు ఏడాది విజయపత్రం ఉందని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. సూపర్ సిక్స్‌కి దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. టిడిపి కూటమి పాలనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారన్నారు. కడపలోని డిసిసి కార్యాలయంలో ఆమె గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనకు ఏడాది పూర్తయిందని, ఈ ఏడాదిలో సాధించినది గొప్పలు చెప్పుకోవడమేనన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు దిక్కే లేదన్నారు. ఉచిత ప్రయాణంపై పండుగలు పేరు చెప్పి కాలయాపన చేశారని విమర్శించారు.

నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల ఊసే లేదన్నారు. రైతులను ఆదుకున్న పరిస్థితి లేదని తెలిపారు. గడిచిన ఏడాదిగా సూపర్ సిక్స్ పథకాలు మరిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పడం.. 20 లక్షల మంది విద్యార్థులను మోసం చేయడమేనని విమర్శించారు. ఏడాది కాలంలో ఇచ్చిన హామీలను మరచి సిఎం చంద్రబాబు నాయుడు సాధించిన ప్రగతి అప్పులు తీసుకోవడమేనని తెలిపారు. వెంటనే టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

కరెంట్ అఫైర్స్



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

ఉగ్రవాదంపై...

OPERATION SINDOOR

పహల్గాం దాడి వంటి ఘటనలు భారతదేశ భద్రతను పరీక్షిస్తున్నా, ప్రభుత్వం చూపాల్సింది శక్తి మాత్రమే కాదు- బాధ్యత కూడా. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు వేదికపై చర్చలు జరగకుండా మౌనంగా ఉండడం వల్ల ప్రజల విశ్వాసం దెబ్బతింది. అమెరికా వ్యాఖ్యలు, అంతర్జాతీయ రాజకీయాల ముట్టడి మధ్య మనకు రక్షణ కవచం మన రాజ్యాంగం. అందులోని లౌకిక, ప్రజాస్వామిక విలువలే మన దేశ భవిష్యత్తుకి బలమైన ఆధారం.

2025 ఏప్రిల్ 22న జమ్మూ-కాశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడి దేశాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువమంది హిందూ మతానికి చెందిన వారు. దాడిలో 20 మందికి పైగా గాయపడ్డారు. పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్ఎఫ్) ఈ దాడికి బాధ్యత వహించింది. దాడిలో మృతులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందినవారు. అలాగే నేపాల్‌కు చెందిన ఒక పర్యాటకుడు, ఒక స్థానిక ముస్లిం వ్యక్తి కూడా ఉన్నారు. ఈ దాడి భారతదేశంలో 2008 ముంబై ఉగ్రదాడి తర్వాత జరిగిన అత్యంత ఘోరమైన దాడిగా గుర్తించబడింది.

ఆపరేషన్ సిందూర్

ఈ దాడికి ప్రతిస్పందనగా, భారత ప్రభుత్వం 2025 మే 7న 'ఆపరేషన్ సిందూర్' అనే కీలక సైనిక చర్యను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర వాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా లష్కరే తోయిబా, జైష్-ఎ-మహమ్మద్ వంటి పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాద సంస్థల శిక్షణా శిబిరాలే ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ దాడిలో భారత వాయుసేన అత్యాధునిక ఆయుధాలు-రాఫెల్ యుద్ధ విమానాలు, బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు, స్కైస్ట్రైకర్ లాయిటరింగ్ మ్యూనిషన్స్ వంటివి ఉపయోగించింది. దాదాపు 23 నిమిషాల్లోనే ఈ సైనిక చర్య విజయ వంతంగా ముగిసింది. ఇది భారత సైనిక సామర్థ్యానికి ఒక నిదర్శనంగా నిలిచింది. అనేక మంది ఉగ్రవాదులు హతమయ్యారు. కొన్ని శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారత ప్రభుత్వం ఈ చర్యను ఉగ్రవాదంపై చట్టబద్ధమైన, న్యాయసమ్మతమైన ఎదురుదెబ్బగా ప్రకటించింది. ఈ చర్య భారత రాజ్యాంగం కల్పించిన భద్రతా విధానాలకు, దేశాధీశత్వానికి అనుగుణంగా జరిగింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారతదేశం తన అంతర్గత భద్రతకు సంబంధించి చురుకైన దౌత్యపరమైన, సైనిక చర్య తీసుకోవడానికి వెనుకాడదని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేసింది. ఇది కేవలం సైనిక విజయం మాత్రమే కాక, భారతదేశ దౌత్య వ్యూహాల్లో ఒక కీలక మలుపుగా నిలిచింది. పాకిస్తాన్‌పై అంతర్జాతీయ ఒత్తిడి పెరగడంతో పాటు, ఉగ్రవాదంపై గ్లోబల్ మద్దతు కూడా భారతదేశానికి వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ చర్యపై విశాల ప్రజాభిప్రాయం సమర్థనగా ఉంది. ఈ ఆపరేషన్ ద్వారా భారతదేశం ఉగ్రవాదంపై తన చిత్తశుద్ధిని, కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసింది. ఇది దేశ భద్రత, అంతర్గత సంఘీభావం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో మైలురాయిగా నిలిచింది. 'ఆపరేషన్ సిందూర్' భారతదేశ రాజ్యాంగ బలాన్ని, దేశాధీనం, ప్రజల సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు చేసే పోరాటంలో ఒక గంభీర ఘట్టంగా నిలిచింది.

కాల్పుల విరమణ విమర్శాత్మక పరిశీలన

2025 మే 12న భారత్-పాకిస్తాన్ మధ్య ప్రకటించిన కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు. ట్రంప్ చేసిన ప్రకటన భారత అంతర్గత పరిపక్వత, ఆత్మనిర్ణయాన్ని తక్కువగా అంచనా వేయడమే కాక, ఒక ప్రభావ వంతమైన అంతర్జాతీయ అంశాన్ని అమెరికన్ వాణిజ్య, రాజకీయ అజెండాలకు అనుగుణంగా తిరగ రాయాలన్న వలసపర, కేంద్రక బలాల ధోరణిని ప్రతిబింబిస్తుంది. ఆయన వ్యాఖ్యల్లో భారతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించలేదనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది 1972 సిమ్లా ఒప్పంద స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉండటమే కాక, భారత విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా అమెరికా స్వయం ప్రకటనగా చెప్పుకోవచ్చు.

అంతేకాకుండా ట్రంప్ వ్యాఖ్యలు కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయీ కరించాలన్న పాకిస్తాన్ తాపత్రయానికి మరింత బలం చేకూర్చినట్లయ్యాయి. అమెరికా ఒక మధ్యవర్తిగా కాకుండా ఆర్థిక ఒత్తిడిదారుగా, వాణిజ్య ఆధారిత రాజకీయ గణనాల చట్రంలో భారత్‌ను పెట్టేందుకు ప్రయత్నించింది. ఇది దౌత్యపరంగా అమెరికా నిరంకుశ వైఖరిని తెలియజేస్తుంది. ఒక ప్రజాస్వామ్య దేశం-ముఖ్యంగా ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ఇలా రాజకీయ ఒత్తిడికి లోనైనట్లు చిత్రీకరించడం, దాని అంతర్గత నిర్ణయాలను మానవీయతలో కాదు, మార్కెట్లో కొలిచే డాలర్ విలువగా మార్చడమే.

అయితే, భారత ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను నేరుగా ఖండించకుండా, కాల్పుల విరమణ స్వతంత్రంగా, పరస్పర సైనిక చర్చల ఫలితంగా జరిగిందని పేర్కొనడం మౌలిక విదేశాంగ నైతికతను నిలబెట్టడమే. కాక, రాజ్యాంగ ప్రామాణికతకు అనుగుణంగా వ్యవహరించడాన్ని సాక్ష్యంగా నిలబెట్టింది. ఇది రాజ్యాంగం కల్పించిన స్వాతంత్ర్యం, సమగ్రత, ప్రజాస్వామిక జవాబుదారీదనం వంటి మూల్యాల శక్తిని తేటతెల్లం చేసింది. ఇంతకీ ప్రశ్న ఏదంటే ఓ అంతర్జాతీయ సూపర్ పవర్, వాణిజ్య ఒత్తిడుల పేరుతో ఓ ప్రజాస్వామ్య రాజ్యాన్ని తన 'విజయం'గా ప్రకటించుకునే ధైర్యం ఎలా వచ్చింది. ఇది దేశాల మైత్రి కంటే ఎక్కువగా వ్యాపార లాభాలపై దృష్టి పెట్టే ఆధునిక అంతర్జాతీయ వ్యవస్థలోని శూన్యతను బహిర్గతం చేస్తుంది. పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ద్వారా ఆర్థిక మద్దతు, యుఎన్ మౌన సింహిత, అమెరికా వ్యాఖ్యలు ఇవన్నీ కలిసి ఒక కూటమిగా భారత స్వతంత్ర్యపై కత్తులాంటి ఒత్తిడిని తీసుకొస్తున్నాయి.

కూటమిగా భారత స్వతంత్రతపై కత్తులాంటి ఒత్తిడిని తీసుకు వస్తున్నాయి. కానీ ఆ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవడానికి భారత రాజ్యాంగం కల్పించిన స్వయంప్రతిపత్తి ప్రధాన ఆధారం.

రాజ్యాంగ విలువల ప్రాముఖ్యత

దేశంలో ఏర్పడే ప్రతి సంక్షోభ సమయంలో, ప్రభుత్వ చర్యలకు మార్గదర్శకంగా నిలవాల్సింది రాజ్యాంగమే. ఇది కేవలం చట్ట నిబంధనల సమాహారమే కాక, దేశ రాజకీయ చైతన్యం, నైతికత, ప్రజల విశ్వాసానికి మూలాధారం. లౌకికత, ప్రజాస్వామికత, సమగ్రత అనే రాజ్యాంగ మూల సూత్రాలు సమయానుకూలంగా జాతీయ స్ఫూర్తిని, సామూహిక బాధ్యతను కలిగించే శక్తిగా పనిచేస్తాయి. కానీ ఇటీవల దేశం ఎదుర్కొన్న ఉగ్రదాడులు, ఆపరేషన్ సిందూర్, అంతర్జాతీయ వ్యాఖ్యల సందర్భాల్లో ఈ మూల్యాలపై ప్రభుత్వ తీరు అస్పష్టంగా కనిపించింది. ప్రభుత్వం సైనిక చర్యలు చేపట్టడం దేశ భద్రత కోసం అవసరమైతేనూ, అజ్ఞానం లేదా మౌనం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. ప్రజల మధ్య పారదర్శకత లేకుండా తీసుకునే చర్యలు రాజ్యాంగ లక్ష్యాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రజాస్వామిక వ్యవస్థలో పార్లమెంట్ ప్రజల నిబద్ధతను ప్రతిబింబించేది? మాండలికత, సైనిక చర్యలపై పార్లమెంట్‌లో చర్చ జరగక పోవడం, అధికారిక ప్రకటనల లేమీ, అస్పష్ట స్పందనలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. శక్తిని ప్రదర్శించడంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి గానీ, ప్రజల సహభాగిత్యాన్ని కూడా పక్కన పెట్టకూడదు. ఇదే రాజ్యాంగ విలువల సారాంశం.

ప్రజాస్వామ్యం భద్రతకు అవరోధం కాదు, అది దేశ భద్రతను ప్రజల విశ్వాసంతో నిలబెట్టే కవచం. ప్రజల నమ్మకాన్ని పొందే భద్రతా విధానాలు స్థిరతకు మూలాధారం.


పహల్గాం దాడి లో మరణించిన వ్యక్తి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

అందువల్ల, శాంతి ప్రక్రియలు, సైనిక చర్యల న్యాయీకరణలను పార్లమెంట్లో చర్చించడం మౌలిక బాధ్యత. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నియంత్రిత రహస్య పాలన విధించడం ప్రమాదకరం. మన రాజ్యాంగం ప్రజల భాగస్వామ్యాన్ని కేంద్రంగా ఉంచి, సంఘీభావం ద్వారా సంక్షోభాలను అధిగమించే మార్గాన్ని సూచిస్తుంది. అందుకే భారత రాజ్యాంగం కల్పించిన లౌకికత, ప్రజాస్వామికత, సమగ్రత - కేవలం పుస్తక మాటలు కాదు. అవి వ్యవస్థకు జీవం, ప్రభుత్వానికి గమనదిశ, ప్రజలకు భద్రత. ఈ విలువల ఆధారంగా తీసుకునే ప్రతి చర్య ఉదాహరణకు ఉగ్రవాదంపై కఠిన వైఖరి అయినా, పారదర్శక ప్రకటనలతో - దేశ విశ్వాసంతో ముందుకు సాగుతుంది. దేశ భద్రతా చర్యలతో పాటు ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడం అవసరం. ఈ సమతుల్య వైఖరితోనే రాజ్యాంగాన్ని కాపాడి దేశాన్ని రక్షించగలం.

ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో పాలకవర్గం మరింత పారదర్శకతతో, ప్రజలతో నిజాయతీతో కమ్యూనికేషన్ చేయాలి. సైనిక చర్యలు తక్షణ ప్రభావం చూపొచ్చు. కానీ ఆ చర్యలకు తర్వాత జరిగే చర్చలు, వివరణలు, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంచుతుంది. సైనిక విజయాలు తాత్కాలిక సంతృప్తిని కల్గించవు. కానీ నిరంతర సామాజిక విశ్వాసాన్ని సృష్టించడంలో పారదర్శకత, సమగ్ర చర్చలు కీలకం. భారతదేశం విస్తృతమైన భిన్నతల దేశం. ఇక్కడ అనేక మతాలు, భాషలు, సాంస్కృతిక వర్గాల మధ్య ఐక్యతను రాజ్యాంగం ద్వారా నిలబెట్టాం. ఈ సమగ్రత రాజ్యాంగం అందించిన సమాన హక్కులు, స్వేచ్ఛలు, బాధ్యతల సమతౌల్యంతో సాధ్యం.

ఈ సమగ్రతను దేశీయ భద్రతకు మాత్రమే కాక, అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ఉద్దేశ్యాలను స్పష్టం చేయడంలో కూడా రాజ్యాంగం జీవంగా నిలబడాలి. 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని కేవలం సైనిక స్ఫూర్తిగా కాక, రాజ్యాంగానికి ప్రగాఢమైన, సమాజానికి బలమైన నిధిగా కూడా భావించాలి. ఇది భారత సమాజానికి ఆత్మవిశ్వాసాన్ని కలిగించగల నైతిక బలాన్ని చాటే ఘట్టంగా చరిత్రలో నిలిచి పోతుంది.

ధైర్యానికి, నైపుణ్యానికి మరో రూపం

పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత ప్రభుత్వం ఇచ్చిన ధీటైన ప్రతిస్పందనగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాగిన యుద్ధవిహారం, కేవలం సైనిక విజయం మాత్రమే కాదు అది భారత సాయుధ బలగాల్లో మహిళా నాయకత్వ వికాసానికి ప్రత్యక్ష నిరూపణగా నిలిచింది.

ఈ ఆపరేషన్ అనంతరం మే నెలలో జరిగిన అధికారిక మీడియా సమావేశంలో, ఇద్దరు మహిళా అధికారులు కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ప్రధానంగా పాల్గొని, దేశం అంతటా మహిళల సామర్థ్యానికి ప్రతీకలుగా నిలిచారు.

ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక కౌంటర్ టెర్రరిజం దాడి కాదు. ఇది భారత సాయుధ బలగాల్లో మారుతున్న సామాజిక శక్తుల చిహ్నం. కల్నల్ ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాత్ర ద్వారా మహిళల సమర్థతను ప్రపంచం చూసింది. ఈ రోజులు రాబోయే తరాల సైనిక మహిళల కోసం ఒక కొత్త చరిత్ర ప్రారంభం.

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

భారత వైమానిక దళంలో హెలికాప్టర్ పైలెట్‌గా సేవలందిస్తున్న వ్యోమికా సింగ్, ఆపరేషన్ సింధూర్‌లో ఎయిర్ సపోర్ట్, టార్గెట్ అటాక్ కోఆర్డినేషన్ వంటి కీలక రంగాల్లో నైపుణ్యాన్ని చాటారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతుండగా, భారత వైమానిక దళం ప్రెసైజన్ స్ట్రైక్స్ ఎలా నిర్వహించిందో, టెర్రరిస్ట్ శిబిరాల పటిష్టత ఎలాంటి వరుస దాడులతో కూలిపోయిందో సమగ్రంగా వివరించారు. ఆమె మాట్లాడుతూ, "భారతదేశ భద్రతను తక్కువగా అంచనా వేయాలని పాకిస్తాన్ ఆలోచిస్తే, అది తీవ్రమైన పొరపాటు అవుతుంది. దేశ ప్రజలను, సైనికులను తృణంగా చూడగలిగే దిమ్మతి మరలకుండా ఉండదు." అని స్పష్టం చేశారు.



కల్నల్ సోఫియా ఖురేషి

భారత సైన్యంలో సిగ్నల్స్ కార్ప్స్‌కు చెందిన కల్నల్ సోఫియా ఖురేషి, గతంలో జార్జియాలో జరిగిన మల్టీనేషన్ వ్యాయామంలో భారత బృందానికి నాయకత్వం వహించిన తొలి మహిళ అనే ఘనతను సొంతం చేసుకున్న అధికారి. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో సైటెలైట్ కమ్యూనికేషన్, రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌మిషన్, డిజిటల్ వాల్‌ఫేర్ విభాగాల మధ్య సమన్వయం చేశారు. ఆమె మీడియా సమావేశంలో ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రెసైజన్ దాడుల వీడియోలు, టెక్నికల్ రీరిపోర్టులు విడుదల చేయడమేకాక, భారత సైన్యం టెక్నాలజీ, నైపుణ్యం పరంగా ఎన్ని మెట్లు ఎక్కిందో స్పష్టంగా ప్రజలకు వివరించారు. ఆమె ప్రసంగంలో గల స్థైర్యం, వ్యవస్థితి, సాంకేతిక స్పష్టత ఒక మహిళా అధికారి ఎలా శాసనాత్మక నైతికతతో దేశ రక్షణ వ్యవస్థలో పని చేస్తుందో చూపించింది.

సంపాదకీయం

ఘోర ప్రమాదం!

గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఎయిరిండియా విమానం కుప్పకూలి, అందులోని ప్రయాణికులు, సిబ్బంది; కూలిన ప్రాంతంలో ఉన్న వైద్య విద్యార్థులూ దుర్మరణం చెందటం అత్యంత విషాదకరం! లండన్‌కు బయల్దేరిన ఈ విమానం రన్ వే నుంచి లేచిన కొద్ది నిమిషాల్లోనే ప్రమాదంలో చిక్కుకోవడం, సాయం కోసం పైలట్లు అత్యవసర కాల్ ఇవ్వడం, తరువాతి కొద్ది క్షణాల్లోనే జనావాసాలపై కూలిపోవడం జరిగిపోయింది! ఈ ఘోర ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సహా వందల మంది దుర్మరణం చెందారు. రమేష్ బిశ్వాస్ అనే ప్రయాణికుడు ఒక్కరే ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో విమానంలో ఇద్దరు పైలట్లు, పది మంది సిబ్బంది సహా 242 మంది ఉన్నారు. విమానం జిజె వైద్య కళాశాల హాస్టల్‌పై కుప్పకూలటంతో- భవనం ధ్వంసమై ఐదుగురు మెడికల్ విద్యార్థులు మృతి చెందారు. 20 మంది దాకా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2020లో కోజికోడ్ ఎయిర్‌పోర్టులో ల్యాండవుతూ భారీ వర్షం కారణంగా అదుపు తప్పి చోటు చేసుకున్న బోయింగ్ 737 ప్రమాదం తరువాత- మనదేశంలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదాల్లో ఇదే పెద్దది.

ప్రభుత్వ రంగాన సాగాల్సిన ప్రజా రవాణా వ్యవస్థలు కార్పొరేటుపరం అయ్యాక- అవి లాభాలే ప్రధానంగా నడుస్తాయి. గతేడాది జూన్, డిసెంబరు నెలల్లో ఈ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటి పూర్తి నివారణ జరక్కపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలి. సమస్యలు తలెత్తినా సరైన చర్యలు తీసుకోని నిర్లక్ష్యమే నిజమైతే అది క్షమించరాని నేరం అవుతుంది. విమాన ప్రమాదాల్లో ప్రాణనష్టం తీవ్రంగా ఉండటానికి - ఎత్తు నుంచి కూలిపోవడం కన్నా కూడా అది మంటల్లో కాలిపోవటమే ప్రధాన కారణం. విమానాల్లో వాడే ఇంధనం అత్యధిక దహన శక్తిని కలిగి ఉంటుంది. అహ్మదాబాద్‌లో కూలిపోయిన బోయింగ్ స్మార్ట్ లైనర్ విమానంలో లక్షా 25 వేల లీటర్ల ఇంధనం ఉందని చెబుతున్నారు. 625 అడుగుల ఎత్తులో ఉండగా ఎటిసితో అనుసంధానం కోల్పోయిన ఈ విమానం - వేగంగా ల్యాండు అవుతున్నట్టుగా జనావాసాల మీద కూలిపోయింది. ఆ మరుక్షణమే నల్లని పొగతో కూడిన మంటలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. పరుగున వెళ్లి చూసిన స్థానికులను మంటల మధ్య కుప్పలుగా ఉన్న విమాన శకలాలు, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాల దృశ్యాలూ తీవ్రంగా కలిచివేశాయి. ఆర్నెల్ల క్రితమే వివాహమై లండన్‌లో ఉన్న భర్త దగ్గరకు ఎన్నో ఆశలతో ప్రయాణమైన రాజస్థాన్ యువతి ఖుస్బూ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. గమ్యం చేరకుండానే గాల్లో కలిసిపోయిన ప్రయాణికుల విషాదం వెనుక ఇలాంటి హృదయ విదారక కథనాలు ఎన్నో!

ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా సురక్షితంగా ఉండేందుకు విమానాల్లో ఇంజన్లు సహా అన్ని నిర్వహణ వ్యవస్థలూ రెండేసి అందుబాట్లో ఉంటాయి. టేకాప్ కావటానికి ముందు పూర్తి స్థాయి తనిఖీలు జరుగుతాయి. అన్ని స్థాయిల్లోనూ ఆమోదం ఉంటేనే ప్రయాణానికి అనుమతి లభిస్తుంది. ఇన్ని భద్రతా అంచెల తరువాత కూడా ప్రమాదం జరిగిందంటే- దాని వెనుక ఉన్న కారణాలు ఏమిటో దర్యాప్తులో తేలాలి. గతేడాది జూన్, డిసెంబరు నెలల్లో ఈ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటి పూర్తి నివారణ జరక్కపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పక్షులు ఢీకొనటం వల్ల ఇంజన్లు రెండూ విఫలమై ఉండొచ్చని మరికొందరు విమానయాన నిపుణులు అంటున్నారు. సమగ్ర దర్యాప్తుతోనే అసలు కారణాలు తేలతాయి. ఆలోగా మృతుల కుటుంబాలకు దన్నుగా నిలవడం, క్షతగాత్రులైన విద్యార్థులకు, స్థానికులకు పూర్తి స్థాయి వైద్యం అందించటం; ధ్వంసమైన జనావాసాలను పునర్నిర్మించటం వంటి చర్యలను ప్రభుత్వం సత్వరంగా, బాధ్యతాయుతంగా చేపట్టాలి. చాలా మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నందున డిఎన్ఎ పరీక్షలు కీలకంగా మారతాయి. కొద్దిపాటి జాప్యం కూడా లేకుండా గుర్తింపు ప్రక్రియను వేగంగా నిర్వహించి, మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి.

సందర్భం

నేడు ఇ.ఎం.ఎస్ జయంతి



సాధారణ ప్రజానీకానికి మతమంటే ఏమిటో తెలియదు. వాళ్ళకు దేవుడొక్కడే. జీవితావసరాలే ఆ దేవుడు.

- ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

జననం: 13.6.1909

మరణం: 19.3.1998

వియత్నాం పునరేకీకరణకు 50 ఏళ్ళు

స్మృతి



ఆర్. అరుణ్ కుమార్

ఈ ఏడాది ఏప్రిల్ 30న వియత్నాం జాతీయ పునరేకీకరణ 50వ వార్షికోత్సవాలను జరుపుకుంది. 1975 ఏప్రిల్ 30న అమెరికన్ సామ్రాజ్యవాదం ఓడిపోయి వియత్నాం నుండి పూర్తిగా వైదొలగింది. వియత్నాం పునరేకీకరణ కోసం, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం 30 సంవత్సరాలపాటు పట్టు విడవకుండా సాగించిన పోరాట ఫలితమది. ఆ గడ్డ మీద దాదాపు ఒక శతాబ్దం పాటు సాగిన వలస పాలనకు ముగింపు పలికి జాతీయ స్వాతంత్ర్యం సోషలిజం నిర్మించే ఒక కొత్త యుగానికి ఆ పోరాటం తెర తీసింది.

సైగాన్ నగరం (ప్రస్తుతం హోచిమిన్ నగరం) విముక్తి చెందడం అనేది అమెరికాకు సైనికపరంగా ఓటమి మాత్రమే కాదు. అది కమ్యూనిస్టులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగించిన జాతీయ విముక్తి పోరాటానికి సంకేతంగా నిలుస్తుంది. దక్షిణ వియత్నాంలో అమెరికా చేతుల్లోని కీలుబొమ్మ ప్రభుత్వం మొత్తంగా కూలిపోయింది ఆ రోజునే. వియత్నాంలోని శ్రామిక ప్రజలు, రైతాంగం, అక్కడి ఫ్యూడల్-పెట్టుబడిదారీ ప్రభుత్వ దోపిడీకి వ్యతిరేకంగా, విదేశీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగించిన విప్లవ పోరాటం ఈ వియత్నాం యుద్ధం. సోషలిస్టు పాలన కింద మొత్తం వియత్నాం మళ్ళీ ఐక్యం కావడం అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఒక నిర్ణయాత్మక విఘాతం.

చారిత్రిక నేపథ్యం

వియత్నాం ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో 1887 నుంచి 1954 దాకా కొనసాగింది. ఆ ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు స్థానిక భూస్వాములు అండగా నిలిచారు. ఆ దన్నుతో అక్కడినుండి ఫ్రాన్స్ రబ్బరు, ధాన్యం, ఖనిజాలను కొల్లగొట్టింది. హోచిమిన్ నాయకత్వంలో వియత్ మిన్హ్ (వియత్నాం స్వాతంత్ర్యం కోసం ఏర్పడిన లీగ్) అణగారిన రైతాంగాన్ని సమీకరించింది. గొప్ప యోధుడుగా చరిత్ర ప్రసిద్ధికెక్కిన జనరల్ వో ఎన్‌గుయెన్ నాయకత్వంలో దీన్ బీన్ ఫు వద్ద జరిగిన యుద్ధంలో వియత్ మిన్హ్ విజయం సాధించింది. ఆ యుద్ధంలో ఫ్రెంచి సైన్యాలు ఓడిపోయి వియత్నాం నుండి వైదొలగాయి.

వియత్ మిన్హ్ విజయం అనంతరం, కమ్యూనిస్టు శక్తులు అక్కడ బలపడుతున్నాయని, వాటి ప్రభావం ప్రజలపై బలంగా పడుతోందని గాభరా పడిన అమెరికా తన హీనమైన పాత్రను పోషించడం మొదలుపెట్టింది. వియత్నాంను రెండుగా చీల్చింది. ఉత్తర వియత్నాం కమ్యూనిస్టుల నాయకత్వంలోను, దక్షిణ వియత్నాం (దీనినే రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం అనేవారు) అమెరికా పెత్తనంలో నడిచే రాజ్యంగాను వియత్నాం చీలిపోయింది. 1956 నాటికల్లా వియత్నాంను మొత్తం ఏకం చేస్తానని అమెరికా హామీ ఇచ్చింది. కాని ఆ హామీని ఉల్లంఘించి దక్షిణ వియత్నాంలో తన కీలుబొమ్మ అయిన ఎన్గో దిన్‌దీన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం భూస్వాములకు, వారి ఫ్యూడల్ అణచివేతకు పూర్తి మద్దతునిస్తూ రైతాంగాన్ని అణగదొక్కసాగింది.



> **"మన పార్టీ యావత్తూ, మన ప్రజలు యావన్మందీ ఐక్యమై ఒక శాంతియుత, సమైక్య, స్వతంత్ర, ప్రజాస్వామిక, సుసంపన్న వియత్నాంను నిర్మించాలి. ప్రపంచ విప్లవ సాధన కర్తవ్యానికి గొప్ప అండదండలు అందించగలగాలి".**

హోచిమిన్ నాయకత్వం లోని వియత్ మిన్హ్ దేశాన్ని మళ్ళీ ఒక్కటిగా చేయడం కోసం, అమెరికన్ సామ్రాజ్యవాదం అండదండలతో సాగుతున్న ఫ్యూడల్-పెట్టుబడిదారీ దోపిడీని అంతం చేయడం కోసం పని చేసింది. ఇందుకోసం ఒకే సమయంలో రెండు రకాల వ్యూహాత్మక కర్తవ్యాలను చేపట్టాలని నిర్ణయించింది. "ఉత్తర భాగంలో సోషలిస్టు విప్లవాన్ని నిర్మించడం, దక్షిణ భాగంలో ప్రజల జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని సాధించడం, అందుకోసం ఆక్రమణదారుల్ని తరిమేసేవరకూ పట్టుదలగా పోరాడడం" అనేవే ఆ రెండు కర్తవ్యాలూ.

దేశంలో 50 శాతం భూమి కేవలం 2 శాతం భూస్వాముల చేతుల్లో ఉంది. ఆ భూమిపైనే తమ మనుగడ కోసం ఆధారపడిన రైతాంగాన్ని ఈ రెండు శాతం భూస్వాములు దోపిడీ చేస్తున్నారు. ఆ రైతుల్ని సంఘటితం చేయడం ముఖ్యమైన కర్తవ్యంగా మారింది. జాతీయ విముక్తి సంఘటనను కమ్యూనిస్టు పార్టీ ఏర్పరచింది. దాని ఆధ్వర్యంలో పాలక వర్గాలకు, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. భూస్వామ్య విధానం రద్దు, దున్నేవానికే భూమి, సామ్రాజ్యవాదుల్ని దేశం నుండి వెళ్ళగొట్టడం అనే నినాదాలతో రైతాంగాన్ని కదిలించింది.

> **"2030 నాటికి ఉన్నత మధ్యతరగతి స్థాయి ఆదాయాలు అందరికీ వచ్చే విధంగా, ఆధునిక పరిశ్రమలు ఏర్పడే విధంగా మనం ఎదగాలి. 2045 నాటికి అభివృద్ధి చెందిన, ఉన్నతాదాయాలు గల, సోషలిస్టు లక్ష్యం దిశగా సాగే సమాజంగా రూపొందాలి."**

గ్రామీణ ప్రాంతాల్లో ఈ పోరాటం సాగుతూన్నప్పుడే. పట్టణాల్లో అప్పుడప్పుడే రూపొందుతున్న కార్మికవర్గాన్ని కూడా కమ్యూనిస్టులు సంఘటితం చేశారు. సైగాన్ లోని కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి, దాని చుట్టూ అప్పుడే ఆవిర్భవిస్తున్న మధ్య తరగతిని సమీకరించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో కూడా కమ్యూనిస్టులు తమకు మద్దతుగా పునాదిని నిర్మించుకోగలిగారు. ఆ కాలంలో పలు నిరసన ఉద్యమాలు పట్టణాల్లో ఆ కారణంగానే నిర్వహించగలిగారు. 1968లో ట్రెట్ వద్ద చేసిన ఎదురుదాడి, గ్రామీణ సైగాన్ వద్ద ఉన్న 'కు చి' సొరంగాల వద్ద సాగిన గెరిల్లా పోరాటాలు సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య పెత్తందార్లను నిర్ణయాత్మకంగా దెబ్బ తీశాయి. ఈ పోరాటాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంఘటనలు.

అమెరికాకు వ్యతిరేకంగా వియత్నాం పోరాటానికి మద్దతుగా అంతర్జాతీయంగా సంఘీభావం వెల్లువెత్తింది. ఇది అమెరికన్ సామ్రాజ్యవాదం ఓటమిలో ఒక కీలక పాత్ర పోషించింది. తమ స్వంత ప్రభుత్వాన్నే ధిక్కరిస్తూ అమెరికాలోని అనేకమంది అభ్యుదయవాదులు వియత్నాం ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. మన దేశంతోబాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో సాగిన సంఘీభావ ఉద్యమాలు పోరాటంలో ఉన్న వియత్నాం ప్రజల పోరాట స్ఫూర్తిని మరింత పెంచాయి.

అటు సోవియట్ యూనియన్, ఇటు చైనా వియత్నాం పోరాటానికి అందించిన సహాయం మరువరానిది. ఈ అంశాలన్నీ తోడై చివరికి అమెరికన్ సామ్రాజ్యవాదం ఓటమికి, దాని కీలుబొమ్మ ప్రభుత్వం దక్షిణ వియత్నాంలో పతనం అవడానికి దారి తీశాయి. సైగాన్ లోని అమెరికన్ రాయబార కార్యాలయ భవనం పైన ఆ సిబ్బందిని ఖాళీ చేయించడానికి దిగుతున్న హెలికాప్టర్ల చిత్రాలు సైగాన్ పతనానికి గుర్తులుగా నిలుస్తాయి.

సోషలిస్టు వియత్నాం

కమ్యూనిస్టుల నేతృత్వంలో వియత్నాం మళ్ళీ ఏకం అయిన సంఘటనను ప్రత్యక్షంగా చూసేందుకు అప్పటికి హోచిమిన్ జీవించిలేరు. ఆయనకు ప్రజలమీద అపారమైన విశ్వాసం ఉండేది. "అది ఎంత కష్టతరమైనా, ఎన్ని అవాంతరాలను ఎదుర్కోవలసి వచ్చినా, మా ప్రజలు తప్పకుండా గెలుస్తారు. మా నేల మళ్ళీ ఏకం ఔతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాల దేశభక్తులందరూ ఒకే గొడుగు కింద మళ్ళీ ఐక్యం అవుతారు" అని హోచిమిన్ ప్రకటించారు.

'హో మామ' అని ప్రజలు ఆప్యాయంగా పిలుచుకునే హోచిమిన్ తన అంతిమ కోర్కెను ఈ విధంగా ప్రకటించాడు. "మన పార్టీ యావత్తూ, మన ప్రజలు యావన్మందీ ఐక్యమై ఒక శాంతియుత, సమైక్య, స్వతంత్ర, ప్రజాస్వామిక, సుసంపన్న వియత్నాంను నిర్మించాలి. ప్రపంచ విప్లవ సాధన కర్తవ్యానికి గొప్ప అండదండలు అందించగలగాలి".

వియత్నాం ఏకీకరణ అనంతరం ఏర్పడిన సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం ముందు, కమ్యూనిస్ట్ పార్టీ ముందు అనేక కష్టతరమైన సవాళ్ళు ఎదురయ్యాయి. శతాబ్దాల పాటు వలసపాలకుల అణచివేతకు, ఆర్థిక వెనుకబాటుతనానికి ఆ దేశం బలైంది. అమెరికా విధించిన ఆంక్షలు 1994 వరకూ కొనసాగాయి. ఆంక్షలతోబాటు మరిఏ ఇతర దేశమూ వియత్నాంకు సహాయాన్ని అందించకుండా అమెరికా అనేక కుట్రలు పన్నింది. ఈ కష్టకాలంలో సోవియట్ యూనియన్ సోషలిస్టు వ్యవస్థ కొనసాగినంతకాలం వియత్నాంకు తోడుగా నిలిచింది.

యాభై సంవత్సరాల పునరేకీకరణ నాటికి వియత్నాం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా ఉంది. యుద్ధాలతో చితికిపోయి, దిగ్బంధనాలతో, ఆంక్షలతో సతమతమౌతూ, వెనుకబడిపోయిన స్థితి నుండి నేటికి గణనీయమైన పురోగతి సాధించింది. వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ పాలనలో ఆ దేశం సాధించిన అభివృద్ధిని సూచించే కొన్ని గణాంకాలు చూడండి: 1993 నాటికి ఆ దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 58 శాతం. 2024 నాటికి వారు 1.93 శాతానికి తగ్గిపోయారు! ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో అగ్రశ్రేణిలో ఉన్న 15 దేశాల్లో వియత్నాం ఒకటి. ఇప్పుడు వియత్నాం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదిగింది. ఉన్నత మధ్య తరగతి స్థాయికి దాదాపు పెరిగింది.

దేశాన్ని అభివృద్ధి పంథాలో మరింత ముందుకు నడిపించడానికి, ప్రగతి సాధించడానికి వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ కృతనిశ్చయంతో ఉంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టో లామ్ ఇలా ప్రకటించారు:నేటి వియత్నాం కన్నా పది రెట్లు మెరుగైన వియత్నాం ను నిర్మించడానికి మనం ఉత్పత్తి శక్తులన్నింటినీ పూర్తిగా విముక్తి చేయాలి. అన్ని వనరులనూ పూర్తిగా వినియోగించాలి. మనకున్న బలాన్ని యావత్తూ వినియోగించాలి. మనలో నిబిడీకృతంగా ఉన్న శక్తులన్నింటినీ వెలికి తేవాలి. అప్పుడే సామాజిక-ఆర్థిక అభివృద్ధి సాధించగలం. 2025లో కనీసం 8 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలి. 2026-2030 మధ్య కాలంలో రెండంకెల వృద్ధిరేటు సాధించాలి. 2030 నాటికి ఉన్నత మధ్యతరగతి స్థాయి ఆదాయాలు అందరికీ వచ్చే విధంగా, ఆధునిక పరిశ్రమలు ఏర్పడే విధంగా మనం ఎదగాలి. 2045 నాటికి అభివృద్ధి చెందిన, ఉన్నతాదాయాలు గల, సోషలిస్టు లక్ష్యం దిశగా సాగే సమాజంగా రూపొందాలి."

> **1993 నాటికి ఆ దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 58 శాతం. 2024 నాటికి వారు 1.93 శాతానికి తగ్గిపోయారు! ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో అగ్రశ్రేణిలో ఉన్న 15 దేశాల్లో వియత్నాం ఒకటి. ఇప్పుడు వియత్నాం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదిగింది. ఉన్నత మధ్య తరగతి స్థాయికి దాదాపు పెరిగింది.**

ఈ లక్ష్యాలు సాధించడం కోసం పార్టీ హోచిమిన్ వేసిన బాటకు పునరంకితమౌతూ, అవినీతి, అంతరాలు, అసమానతలను తొలగించాలని లక్ష్యం చేసుకుంది. నిరంకుశ అధికార యంత్రాంగాన్ని లేకుండా చేసి సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టింది. 64 నుంచి రాష్ట్రాలను 34కు తగ్గించింది. జిల్లా స్థాయి అధికార యంత్రాంగం కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు ఆలస్యం అవుతున్న కారణంగా దానిని రద్దు చేసి నేరుగా ప్రాథమిక స్థాయి పాలనను బలోపేతం చేసింది. ఆ ప్రాథమిక స్థాయి పాలన ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మార్పులు చేసింది.

ప్రజలకు ప్రయోజనాలు కలిగించేందుకు మరింత ఎక్కువ ధనం అందుబాటులోకి తేవడానికి, 12వ తరగతి వరకూ పిల్లలందరికీ ఉచిత విద్య, పౌరులందరికీ ఉచిత వైద్య సంరక్షణ అందించడానికి చర్యలు తీసుకుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి వీలుగా ఉండే విధానాలను చేపడుతోంది.


అన్నింటికీ ప్రజలే మూలం అన్నది వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ బలంగా నమ్ముతోంది. ఆ ప్రజల్లోని సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందే విధంగా 2021-2025 కాలపు పంచవర్ష ప్రణాళిక సామాజిక-ఆర్థిక లక్ష్యాలను అందుకుని, 2026లో జరగబోయే పార్టీ మహాసభకు సమాయత్తం ఔతోంది.

ఈ చారిత్రాత్మక సందర్భంలో మనమంతా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వియత్నాంకు, వియత్నాం ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, సోషలిజాన్ని నిర్మించే వారి ప్రయత్నాలు జయప్రదం కావాలని కోరుకుందాం.

(స్వేచ్ఛానుసరణ)

సెటైర్

టింగ్.. టంగ్.. ట్రంగ్!



కాంతమ్మ గారు మకాం హైదరాబాద్‌కు మార్చడంతో... పనిమనిషి పారిజాతం కొత్త ఇల్లు వెదుక్కోక తప్పలేదు. జీతభత్యాలు, రవాణా సదుపాయాలు, పని వేళలు సరిపోయే ఇంటి కోసం పట్టణమంతా తిరిగింది. చివరికి ఒక రిటైర్డ్ ప్రథమ శ్రేణి ప్రభుత్వ ఉన్నతాధికారి ఇంట్లో పనికి ఒప్పుకుంది.

మొదటి రోజు ఉదయం పారిజాతం పనికి వెళ్ళింది. పాత్రలు కడిగేటప్పుడు ఒక పెద్ద స్టీలు పాత్ర 'టింగ్' మని పెద్ద శబ్దం చేస్తూ కింద పడింది. రిటైర్డ్ అధికారి భార్య అనసూయ మేడం పడక గది నుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది.

"అంత పెద్ద శబ్దాలు చేస్తే సార్ నిద్ర చెడుతుంది. శబ్దం రాకుండా కడుగు. మా సార్ కి నిద్రా భంగమైతే ఆయనలోని 'అపరిచితుడు' లేస్తాడు. ఆ బాధలు నేను పడలేను" అని హెచ్చరించింది.

"తప్పయిపోయింది మేడం..." అని చెప్పి తన పని తాను చేసుకుని వెళ్ళింది పారిజాతం.

రెండవరోజు ఉదయం ఇల్లంతా ఊడ్చి, పాత్రలు కడిగి ఎత్తి పెడుతోంది.

అదే సమయంలో కిటికీ దగ్గర హఠాత్తుగా కనిపించిన పెంపుడు నల్ల పిల్లిని చూసి బెదిరింది. అప్పుడు పొరపాటుగా ఒక చిన్న పాత్ర ఆమె చేతి నుంచి జారి 'టంగ్' మని నేల మీద పడింది.

శబ్దం విని గబగబా వచ్చిన మేడం "జాగ్రత్త పారిజాతం... చింత లేనోడు సంతలో అయినా నిద్ర పోతాడని చెబుతారు. కానీ మా సార్ చింత ఉన్నవాడు కదా. శబ్దం రాకుండా పని చేసుకుపో" అని చెప్పింది.

పిల్లిని చూసి భయపడినానని చెబితే మేడం తిట్ల దండకం ఎత్తుకుంటుందేమోనని "ఇకపై జాగ్రత్తగా ఉంటాను మేడం" అని చెప్పి తప్పించుకుంది.

మూడవరోజు ఉదయం ఏ మాత్రం శబ్దం రాకుండా పాత్రలు కడుగుతోంది పారిజాతం. అయినా పొరపాటుగా చేతిలోని స్పూను జారి గిరగిర తిరుగుతూ 'ట్రంగ్'మని నేల మీద పడింది.

'ఏమిటా శబ్దం?" అని అప్పుడే నిద్ర లేచిన సింహం లాగా... లేచి పంచె ఎగగట్టబోయాడు రిటైర్డ్ అధికారి.

"అది పాత్రల శబ్దం లెండి, మీరు పడుకోండి" అని సర్ది చెప్పిన మేడం సరసరమని వంట గదిలోకి వచ్చింది.

"పారిజాతం..!ఎన్నిసార్లు చెప్పాలి నీకు...! సార్‌కి 'టింగ్.. టంగ్..ట్రంగ్!' శబ్దాలు వింటే ఉలిక్కిపడతారు. ఆపైన కంటి మీద రెప్ప వేయరు...అందుకనే నీకు చెప్పింది, శబ్దం రాకుండా పాత్రలు కడగమని" అని గొంతు పెంచి చెప్పింది మేడం.

అమాయకంగా అడిగింది పారిజాతం "ఎందుకు ఆ శబ్దాలు అంటేనే సార్‌కు ఉలికిపాటు మేడం?" అని.

చీర కొంగు నడుముకు చుట్టిన మేడం వయ్యారంగా చేతులు తిప్పుతూ "మా ఒక్కగానొక్క కొడుకును అగ్ర రాజ్యమైన అమెరికా పంపాము. ఆ దేశపు 'పెద్ద సార్' రోజుకో నిర్ణయం తీసుకుంటున్నాడట. కొడుకు భవిష్యత్తు ఏమవుతుందోనని మా సార్‌కు దిగులు పట్టుకుంది. పొరపాటుగా అలాంటి శబ్దాలు వినపడితే మామీదకు ఎగిరెగిరి దుముకుతున్నాడు. అలసిపోయాక తనని తాను తిట్టుకుంటాడు. గంటల కొద్దీ శూన్యంలోకి చూస్తూ ఉండిపోతున్నాడు" అని చెప్పింది.

పారిజాతం తన కళ్ళను గుండ్రంగా తిప్పుతూ "నిజమే మేడం...మా ఇంటాయన కూడా అంతే... ఇరవై నాలుగ్గంటలూ టీవీ కే అతుక్కుపోయి ఉంటాడు. ఎప్పుడు ఏమి చెబుతాడో ఆ పెద్దాయన అని ఆందోళన పడుతూ ఉంటాడు" బాధగా చెప్పింది.

ప్రశ్నగా మారిన ముఖం పెట్టిన మేడం "ఆ పెద్దాయన నిర్ణయాలతో మీకేం పని?" అని అడిగింది.

"మా చిన్నోడిని అమెరికా పంపుదామని అనుకున్నాం మేడం" అని బదులిచ్చి ఇంటి పనుల్లో తల దూర్చింది పారిజాతం.

ఒకేసారి మూడు విమానాలు తన తలపైన సర్రుసర్రున వెళ్ళినట్లు అనిపించింది మేడంకి.

- ఆర్.సి. కృష్ణస్వామి రాజు
సెల్ : 9393662821

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

అభిప్రాయం

గ్లైఫోసేట్ గడ్డినీ, జీవులనూ చంపుతుంది



> **కొన్ని చోట్ల నిషేధం వున్నా, పరిమితులు వున్నా యథేచ్ఛగా వాడుతున్న గ్లైఫోసేట్ అనే కలుపు నివారణ మందు ప్రమాదకరమైనది. ఇది వాడిన భూమిలో జీవం మిగలదు. ఇది ఉన్న చోట మట్టి శ్వాస తీసుకోలేదు, పంటల మీద పడితే మాడిపోతాయి, అది వాడిన గడ్డిని తినే మూగ జీవాలు మృత్యువాత పడతాయి, రైతులు, ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడతారు.**

భూమిలో జీవాన్ని హరించేది కలుపు కాదు, కలుపును చంపుతున్న మానవ చర్యలే. కొన్ని చోట్ల నిషేధం వున్నా, పరిమితులు వున్నా యథేచ్ఛగా వాడుతున్న గ్లైఫోసేట్ అనే కలుపు నివారణ మందు ప్రమాదకరమైనది. ఇది వాడిన భూమిలో జీవం మిగలదు. ఇది ఉన్న చోట మట్టి శ్వాస తీసుకోలేదు, పంటల మీద పడితే మాడిపోతాయి, అది వాడిన గడ్డిని తినే మూగ జీవాలు మృత్యువాత పడతాయి, రైతులు, ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడతారు.

గ్లైఫోసేట్ అనేది ఒక బ్రాడ్-స్పెక్ట్రం కలుపు నివారణ మందు. దీన్ని అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ మొదటిసారిగా 1970లో "రౌండప్" అనే బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. ఇది మొక్కలలోని "ఈ పి స్ పి సింతసిసే" అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి మొక్కల పెరుగుదల నిలిపివేస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు మొక్కల కోసం వాడతారన్నప్పటికీ, ఇది పంట మొక్కలు, మట్టి జీవులపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

రైతులు కూలీల ఖర్చు తగ్గించుకునేందుకు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కానీ దీని వలన వారు కలుపును చంపుతున్నట్టు కనిపించినా, భవిష్యత్తులో ఆరోగ్య ఖర్చులు, భూమి నష్టాలు, దిగుబడి తగ్గుదల వంటివి మరింత నష్టం తెస్తున్నాయి. 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధ్యయన ప్రకారం, గ్లైఫోసేట్ పిచికారి చేయడమే కారణంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్రంగా అనారోగ్యానికి గురవుతున్నారు. ఎయిమ్స్ నివేదిక ప్రకారం గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల అభివృద్ధిలో లోపాలు 18 శాతం పెరిగాయి.

దీని వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి, హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది.

ఈ "హెర్బిసైడ్ వినియోగం ఎక్కువగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి." అని యునైటెడ్ నేషన్స్ ఐ పి పి సి 2022 నివేదిక పేర్కొన్నది.

మన దేశంలో గ్లైఫోసేట్ అనధికారికంగా "తీవ్రంగా ప్రమాదకరమైన రసాయనం"గా గుర్తించినా, ఇప్పటికీ ఇది గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా లభిస్తోంది. 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం పాక్షిక నిషేధాన్ని ప్రకటించినా, అది కేవలం నామమాత్రమే. వ్యవసాయ శాఖకి చెందినవారే దీని వినియోగాన్ని ప్రోత్సహించడం శోచనీయం.

శ్రీలంకలో 2015లో గ్లైఫోసేట్‌పై నిషేధం విధించారు. సి కె డి యూ (క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్) పెరగడంతో నిషేధం విధించారు కానీ అది ఎంతో కాలం కొనసాగలేదు. జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు 2025 లోపే గ్లైఫోసేట్ నిషేధానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. అమెరికాలో గ్లైఫోసేట్‌కి సంబంధించి ఇప్పటివరకు లక్షకు పైగా కేసులు దాఖలయ్యాయి. ఫుడ్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ గ్లైఫోసేట్ అవశేషాలు ఆహార పదార్థాల్లో మించిపోతున్నాయని కెనడా హెచ్చరికలు జారీ చేసింది. కానీ ఈ నిషేధాలు అన్నీ ఎంతో కాలం కొనసాగలేదు. మళ్ళీ దాని వాడకం ఆయా దేశాల్లో యథేచ్ఛగా పెరిగింది.

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అప్పట్లో 60 రోజుల తాత్కాలిక నిషేధం విధించినా మార్కెట్లలో బహిరంగంగా గ్లైఫోసేట్ లభిస్తోంది. రాష్ట్రాలకు శాశ్వత నిషేధానికి అధికారం లేకపోవడమే దానికి ప్రధాన కారణం. కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు మాత్రం రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధం అమలు చేయగలిగాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ)కు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ పర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ 2015లో గ్లైఫోసేట్‌ను "ప్రాబబుల్ హ్యూమన్ కార్సిజెన్ (గ్రూప్ 2ఏ)"గా ప్రకటించింది. ఇది క్యాన్సర్, గర్భస్థ శిశువులలో లోపాలు, నాడీ వ్యవస్థ లోపాలు, శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు, అలర్జీలు, మూత్రపిండాలు-కాలేయ సమస్యలు వంటి తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది.

విష పదార్థాన్ని తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ అంటూ విక్రయించడం రైతుల ఆర్థిక, శారీరక జీవితాలను చీకట్లోకి నెట్టివేస్తోంది. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు రైతుల అభివృద్ధికి మార్గం చూపించాల్సిన బాధ్యత నుండి తప్పుకుని కార్పొరేట్ కంపెనీల వ్యాపార స్వార్థాలకు వదిలేస్తున్నారు.

రైతు బతికుండాలంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్ పంటల భద్రత కోసం గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం పాడాలి! ఇప్పటికైనా రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర పాలకులు, శాస్త్రవేత్తలు కలసి జీవరక్షణ యజ్ఞం ప్రారంభించాలి. రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. విపత్తులను నివారించే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. గ్లైఫోసేట్‌పై అవగాహనా ప్రచారాలు గ్రామ స్థాయిలో నిర్వహించాలి.



- జి. అజయ్ కుమార్, వ్యవసాయ నిపుణులు.

మాటలు రావట్లేదు

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా కలత చెందానని తెలిపారు. "ఇది హృదయ విదారకర ఘటన. దీనిపై మాటలు రావట్లేదు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుంది" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా.. ప్రధాని మోడీ

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా. "ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదం. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా".

హృదయం ముక్కలైంది... : రాహుల్‌గాంధీ

"విమాన ప్రమాదం వార్త వినగానే హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణనాతీతం. ఈ క్లిష్ట సమయంలో ప్రతి క్షణం, ప్రతి క్షణం విలువైనదే. సహాయకచర్యలు వేగంగా జరగాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సాయం చేయడానికైనా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి"

.ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రమాదంపై ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. విమాన ప్రమాదంపై జర్మనీ విదేశాంగ మంత్రి జోహన్ వాడేఫుల్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నట్టు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విమాన ప్రమాదంపై భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ విచారం వ్యక్తం చేశారు. ప్రయాణికుల కుటంబాలకు సంఘీభావం ప్రకటించారు. విమాన ఘటనపై ఫ్రాన్స్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నట్టు భారతదేశంలోని ఫ్రెంచ్ రాయబారి థియరీ మాథౌ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బాధిత కుటుంబాలకు, సన్నిహితులకు భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ సానుభూతి తెలిపారు. ఈ విషాదకర ఘటన కలచివేసిందని పేర్కొన్నారు. బ్రిటన్ ప్రభుత్వం కూడా ఘోరప్రమాదంపై స్పందించింది. పలు దేశాల అధ్యక్షులు, ప్రధానులు తమ ప్రగాఢ సంతాపాలు, సానుభూతి తెలిపారు.

ఇయు : అత్యంత హృదయవిదారకమైన ఈ ప్రమాదం గురించి తెలియగానే మనస్సు కలిచివేసింది. బాధితులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు యురోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా పేర్కొన్నారు.

మాల్దీవులు : భారత్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తెలిపారు. ఈ సమయంలో భారత ప్రజలకు, ప్రభుత్వానికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

మలేసియా : ఈ సమయంలో బాధితుల కోసమే తాము ప్రార్థిస్తున్నామని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం వ్యాఖ్యానించారు. భారత్ విచారాన్ని తాము పంచుకుంటున్నామని, పూర్తి బాసటగా నిలుస్తామని చెప్పారు.

జెలెన్‌స్కీ : భారత్‌లో జరిగిన విమాన ప్రమాదం తీవ్ర ఆందోళన కలిగించింది. భారతీయులతోపాటు బ్రిటన్ సహా పలు దేశాల పౌరులు కూడా మరణించడంపై చింతిస్తున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రచండ : జరిగిన విషాదంతో తన మనస్సు కలతచెందిందని నేపాల్ మాజీ ప్రధాని ప్రచండ పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో తన ఆలోచనలన్నీ బాధితుల చుట్టూ పరిభ్రమిస్తున్నాయన్నారు.



లాస్ట్ సెల్ఫీ

ఈ ఫోటోలో కనపడుతున్నది ప్రతీక్‌జోషి కుటుంబం. ఆయన ఆరు సంవత్సరాలుగా లండన్‌లో సాఫ్ట్‌వేర్ నిపుణులుగా పనిచేస్తున్నారు. ఆయన భార్య కోమివ్యాస్ వైద్య నిపుణురాలు. ముగ్గురు పిల్లలతో ఆమె మనదేశంలోనే ఉంటున్నారు. పిల్లల మంచి భవిష్యత్ కోసం లండన్‌కే వెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా రెండు రోజుల క్రితం ప్రతీక్‌జోషి లండన్ నుండి వచ్చారు. భార్య , పిల్లలను తీసుకుని గురువారం అహ్మదాబాద్ నుండి ఎయిర్ ఇండియా విమానంలో లండన్‌కు బయలుదేరారు. విమానంలో కూర్చున్న తరువాత ఆనందంగా సెల్ఫీ తీసి తమ బంధుమిత్రులకు పంపారు. అదే చివరి సెల్ఫీగా మారింది. ఆ తరువాత కొన్ని నిమిషాల్లోనే ఘోర విమాన ప్రమాదంలో చిక్కుకున్నారు.

నవ వధువు మృతి?



రాజస్థాన్‌కు చెందిన ఖుష్బూకు ఇటీవల వివాహమైంది. లండన్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న తన భర్తను కలిసేందుకు విమానంలో ప్రయాణిస్తున్న ఆమె జాడ ప్రమాదం అనంతరం తెలియలేదు. ఆమె మరణించి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

విమానం కూలటానికి కారణాలేంటి?



ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి గల కారణాలేంటనే చర్చ నడుస్తోంది. విమానయాన నిపుణులు ప్రమాదానికి గల కారణాలను అంచనా వేస్తున్నారు విమానయాన నిపుణుడు డాక్టర్ వందన సింగ్ మాట్లాడుతూ.. విమానం టేకాఫ్ అయినప్పుడు, ఆ విమానం గరిష్ట ఇంధనంతో ఎగురుతుంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి గల కారణాన్ని ఇప్పుడే కచ్చితంగా చెప్పలేం. ఫ్లైట్ డేటా రికార్డర్ మాత్రమే దాని సమాచారం స్పష్టత వస్తుంది. విమానం కూలిపోవడానికి కొన్ని కారణాలు ఉన్నాయి.

విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోవడానికి ఒక ముఖ్యమైన కారణం లోడ్ కారకం కావచ్చు అని వందన సింగ్ అన్నారు. వాస్తవానికి లోడ్ కారకం యొక్క తప్పు లెక్కింపు తరచుగా ప్రమాదానికి కారణం అవుతుంది. ఏదైనా విమానంలో ఉంచిన బరువు యొక్క సరైన నిష్పత్తి లోడ్ కారకం అని అంటారు. ఇది విమానం యొక్క నిర్మాణం ఆధారంగా నిర్ణయించబడుతుంది. విమానంలో ముందు, వెనుక ప్రయాణికులను కూర్చోబెట్టడం ద్వారా ఇది నిర్ణయించబడుతుంది. తద్వారా ఒత్తిడిని నియంత్రించవచ్చు.

హాస్టల్‌భవనంలో ఇరుక్కుపోయిన విమాన చక్రం

విమానంలోని ఒక చక్రం ఒక భవనంలో ఇరుక్కుపోయింది. అటువంటి పరిస్థితిలో బరువును తప్పుగా లెక్కించడం వల్ల ఈ ప్రమాదం జరగవచ్చని చెప్పవచ్చు.

రెండవ కారణం

ల్యాండింగ్ గేర్ సరిగ్గా మూసివేయబ డకపోవచ్చు అని వందన సింగ్ అన్నారు. టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో రన్‌వేతో సంబంధంలోకి వచ్చినప్పుడు మొత్తం బరువును నిర్వహించడానికి, గతి శక్తిని గ్రహించడానికి రూపొందించబడిన ఏదైనా విమానంలో ల్యాండింగ్ గేర్ కీలకమైన భాగం. విమానం చక్రాలు బయటకు వచ్చే, విమానం రన్‌వేపై కదులుతున్న భాగం ఇదే. ఈ రెండు కారణాలేనా.. లేక వేరేమైనా కారణాలు ఉన్నాయన్న కోణంలో విమానయాన శాఖ దర్యాప్తు చేయాల్సిన అవసరమున్నదని విమాన యాన నిపుణులు పేర్కొంటున్నారు.

మరింత సమాచారం కోసం వెయిటింగ్

బోయింగ్ వెల్లడి

అహ్మదాబాద్: గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికల గురించి తమకు తెలుసని బోయింగ్ తెలిపింది. ప్రమాదంపై మరింత సమాచారం సేకరించేం దుకు కృషి చేస్తున్నట్టు తెలిపింది. ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు పడిపోయిన నేపథ్యంలో బోయింగ్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

ఎయిర్‌షో ప్రారంభానికి ముందు!

త్వరలో పారిస్ ఎయిర్‌షో ప్రారంభం కానుంది. ఈ ఏవియేషన్ ఎక్స్‌పోలో బోయింగ్ సహా దాని ప్రధాన ప్రత్యర్థి అయిన ఎయిర్‌బస్ తమ విమానాలను ప్రదర్శించనున్నాయి. వీటిని చూసే ఈ కంపెనీలకు ఆర్డర్లు పెరగడం లేదా తరగడం జరుగుతుంది. సరిగ్గా ఈ పారిస్ షో ప్రారంభం కావడానికి కొద్ది రోజుల ముందే బోయింగ్ విమానం ప్రమాదానికి గురికావడం గమనార్హం.

దెబ్బ మీద దెబ్బ

దాదాపు ఆరేళ్ల కిందట బోయింగ్ చెందిన లయన్ ఎయిర్ ఫ్లైట్ 610 (బోయింగ్ 737 మ్యాక్స్ 8) జకార్తా నుంచి టేకాఫ్ అయిన 5 నిమిషాల్లోనే ఇండోనేషియా తీరంలోని జావా సముద్రంలో కూలిపోయింది. ఆ విమాన ప్రమాదంలో 189 మంది మరణించారు.

ఇది జరిగిన ఐదు నెలల తరువాత ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 302 (బోయింగ్ 737 మ్యాక్స్ 8) అడిస్ అబాబా నుంచి టేకాఫ్ అయిన తరువాత కూలిపోయింది. ఈ ప్రమాదంలో 157 మంది మరణించారు. వీటి నుంచి రికవరీ అయ్యే దశలో బోయింగ్ ఉండగా, ఇప్పుడు ఇండియాలో మరో ప్రమాదం జరిగింది.

గుజరాత్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన నేపథ్యంలో యూఎస్ ట్రేడింగ్ ప్రారంభం కావడానికి ముందే బోయింగ్ కంపెనీ షేర్లు 9 శాతం వరకు పడిపోయాయి.

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ఎయిర్ ఇండియా యాజమాన్యమైన టాటా గ్రూప్ ప్రకటించింది. గాయపడిన వారి వైద్యఖర్చులను తామే భర్తిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచంలోనే తొలి బోయింగ్ 787 విమాన ప్రమాదమిది !

దర్యాప్తు చేపట్టనున్న ఎఎఐబి

అహ్మదాబాద్ : అమెరికాకు చెందిన విమాన నిర్మాణ సంస్థ బోయింగ్ రూపొందించిన వైడ్ బాడీ మోడల్స్‌లో 787-8 డ్రీమ్‌లైనర్ ఒకటి. అంతర్జాతీయంగా చూసినట్లైతే బోయింగ్ 787 కూలిపోయిన ఘటన ఇదే మొదటిది. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో గత నాలుగు దశాబ్దాల్లో మొట్టమొదటి వైడ్‌బాడీ విమాన ప్రమాదం కూడా ఇదే. 1985 జూన్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్747 కనిష్క విమానంపై బాంబు దాడి జరిగింది.

కాగా ఈ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) దర్యాప్తు చేస్తుంది. ఇది పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేస్తుంది. సాధారణంగా భారత గగనతలంలో జరిగే అన్ని తీవ్రమైన విమాన ప్రమాదాలపై ఎఎఐబి దర్యాప్తు చేపడుతుంది. ప్రమాదం జరిగిన ఏడాదిలోగా దర్యాప్తు నివేదికను అందచేస్తుందని భావిస్తున్నారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఎఎఐబి ఉన్నతాధికారులు అహ్మదాబాద్ బయలుదేరి వెళ్ళారు.

తొలి సాక్ష్యాధారాలు

సహాయ కార్యకలాపాలు ముగిసిన వెంటనే ఎఎఐబి రంగంలోకి దిగుతుంది. ప్రమాద స్థలి ప్రాంతాన్ని చుట్టుముట్టి సాక్ష్యాధారాలను ముఖ్యంగా త్వరగా నశించిపోయేవాటిని, తర్వాత కాలానికి అందుబాటులో వుండని వాటిని సేకరిస్తుంది. ఇలాంటి వాటిలో పేలుడు ధాటికి ఆ ప్రాంతాలు, భవనాలపై గల ప్రభావం, శిధిలాల నమోదు, ప్రమాద స్థలి ఫోటోలు, వీడియోలు, శిధిలమైన భాగాలు, ప్రాధమికమైన శిధిలాల పరిశీలన, సాక్షుల ఇంటర్వ్యూలు, జిపిఎస్ పరికరాలు, అక్కడ అందుబాటులో వుండే సిపిటివి ఫుటేజ్ వంటివి సేకరిస్తారు. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్‌లతో సహా కీలకమైన భాగాలను, ఇతర సాక్ష్యాధారాలను సేకరించి, వాటిపై పరిశీలన, విశ్లేషణ జరుపుతారు. ఎటిసి, రాడార్ స్టేషన్లు, వాతావరణ రికార్డులకు సంబంధించిన డేటాను కూడా సేకరిస్తారు. విమానాశ్రయం నుండి ఎయిర్‌లైన్స్ నుండి ఇతర సంబంధిత పక్షాల నుండి తీసుకోవాల్సిన సమాచారం ఏదైనా వుంటే వాటినికూడా సేకరిస్తారు. మూడు నుండి ఐదు రోజుల పాటు ప్రాథమిక సాక్ష్యాధారాలను సేకరించిన తర్వాత దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తారు. బోయింగ్ సంస్థ నుండి కూడా అవసరమైన సాయం తీసుకుంటారు. దేశ విదేశాల నుండి ప్రత్యేక నిపుణులను కూడా ఈ బృందంలోకి తీసుకుంటారు.

ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా: సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మాసిటీలోని ఎస్ఎస్ ఫార్మా కంపెనీలో విషవాయువులు లీకై మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతం నుంచి పలుమార్లు విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో ఇటువంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నాయని తెలిపారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షల్లో 76.14 శాతం ఉత్తీర్ణత

- ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 76.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పాఠశాల విద్యా శాఖ వెల్లడించింది. ఈ పరీక్షల్లోను బాలురు కంటే బాలికలే అధిక శాతంలో ఉత్తీర్ణులయ్యారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ www.results.bse.ap.gov.inలో తెలుసుకోవచ్చని, అదేవిధంగా మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కు హాయ్ అని వాట్సాప్ చేసే వారి వివరాలను అందించి ఫలితాలు పొందవచ్చన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు 1,42,576 మంది దరఖాస్తు చేసుకోగా, 1,23,477 మంది హాజరయ్యారు, 94,017 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బాలికలు 80.10 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 73.55 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రకాశం జిల్లా అత్యధికంగా 98.24 శాతం ఉత్తీర్ణత సాధించగా, పశ్చిమ గోదావరి అత్యల్పంగా 50.24 శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. అభ్యర్థులకు మార్కుల లిస్టులు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అందజేస్తారన్నారు. వ్యక్తిగతంగా పరీక్షలు రాసిన అభ్యర్థులు https://results.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి మార్కుల లిస్టులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 19వ తేదీ రాత్రి 11 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల

- సొంత మండలంలో పోస్టింగ్ వద్దు
- ఐదేళ్లు దాటితే బదిలీ తప్పని సరి
- ఐదేళ్లలోపు కోరుకున్న వారికే బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో సచివాలయాల ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్లు పని పూర్తి చేసిన ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీ చేయాలని, ఐదేళ్లలోపు పని చేస్తున్న ఉద్యోగులు కోరితేనే బదిలీ చేయాలని వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు ఈ నెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. 30వ తేదీ అనంతరం తదుపరి ఉత్తర్వులు అందే వరకూ బదిలీలు అనుమతించబడవని పేర్కొన్నారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా సచివాలయాల్లో నిర్దేశిత పోస్టులకు మించి ఎవరైనా అధికంగా ఉంటే, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ వారు ఆయా సచివాలయాల్లోనే పని చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన అనంతరం జూలై 10వ తేదీలోపు హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు, మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. వారు కోరుకుంటే మాత్రమే బదిలీకి అవకాశం కల్పిస్తారు. భార్య, భర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులైతే వారు ఒకే ప్రాంతంలో లేక ఒకరికి సమీపంలోని ప్రాంతంలో మరొకరికి పోస్టింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. నోటిఫై చేసిన ఏజెన్సీలోని సచివాలయాల్లో ఖాళీలను ఇతర పోస్టుల కంటే ముందు భర్తీ చేయనున్నారు. ఏజెన్సీ ప్రాంత సచివాలయాల నుంచి బదిలీ అయిన ఉద్యోగి స్థానంలో మరొకరిని నియమించినట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గిరిజనేతర ప్రాంతం నుంచి గిరిజన ప్రాంతంలోని నియమింపబడిన ఉద్యోగులు నిర్దేశిత గడువులోగా రిపోర్ట్ చేయాలని, లేని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ ఉన్న బకాయిలను చెల్లించకుండా ఏ ఉద్యోగిని రిలీవ్ చేయకూడదని స్పష్టం చేశారు.

బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చేది వీరికి..

దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు (వారు కోరితేనే), మానసిక వికలాంగులైన పిల్లలు కలిగి ఉండి, సంబంధిత వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రాంతానికి బదిలీ కోరుకునే ఉద్యోగులకు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పని చేసిన వారికి ఈ బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు. 40 శాతం లేక అంతకంటే ఎక్కువ వైకల్యం ఉందని ధృవీకరింపబడిన ఉద్యోగులకు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ ఆపరేషన్లు, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి, మొదలైన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, వైద్య కారణాలతో బదిలీ కోరుకునే ఉద్యోగులకు వారికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు. కారుణ్య నియామకాల్లో నియమించిన వితంతువులైన మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

తీరంలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు

- ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యకారులు తీర ప్రాంతంలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో మత్స్యకారులను బెదిరించి 94 సర్వే నెంబరులోని వంద ఎకరాల భూమిని అమ్ముకున్నారని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సముద్ర తీరంలో తుపానులు, పెను గాలులు వీచినప్పుడు సాంప్రదాయ వలలు, నావలు, తెప్పలు కొట్టుకుపోయి నష్టపోతున్నట్లు చెప్పారు. వేటకు అవసరమైన పరికరాలు, సామాగ్రి కొనుగోలుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీతో కూడిన రుణ సహాయం అందడం లేదన్నారు. మత్స్యకారులు తీర ప్రాంతంలో సాగు చేసుకుంటున్న చెరువులకు సబ్సిడీ విద్యుత్ అందించడం లేదని తెలిపారు. భూములను ఆక్వా జోన్లలో చేర్చకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. గతంలో తెల్లకార్డుదారులకు ఇళ్లు నిర్మించుకుంటే కేంద్రం నుంచి రూ.60 వేలు ఉచితంగా చెల్లించేవారని, ఈ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. కొత్తగా కొనుగోలు చేసిన మోటరైజ్డ్ బోట్లను ఆన్‌లైన్ చేయకుండా అధికారులు జాప్యం చేయడంతో ప్రభుత్వం నుంచి వేట నిషేద భృతిని కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పెన్షన్ ఇవ్వాలని, మత్స్యశాఖ అధికారులు మత్స్యకార సొసైటీ సభ్యులతో అవగాహనా సదస్సులు నిర్వహించాలని కోరారు. సొసైటీ పరిధిలో ఉన్న పంచాయతీ చెరువులను నామమాత్రపు లీజుకు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర, నదీ జలాల్లో ఉన్న మత్స్య జాతులను పరిరక్షించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించేలా చర్యలు చేపట్టాలని కోరారు. తీర ప్రాంత పరిశ్రమల్లో వస్తున్న వ్యర్థాలను నేరుగా సముద్ర జలాల్లోకి వదల కుండా శుద్ధి చేసిన అనంతరమే వదిలేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

గంజాయి వ్యాపారి ఆస్తులు సీజ్

ప్రజాశక్తి-కంటోన్మెంట్ (విజయనగరం జిల్లా)

గంజాయి కేసులో అరెస్టయిన ఒడిశాకు చెందిన పతిఖిల అలియాస్ గురుకు చెందిన రూ.42.70 లక్షల ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లుగా విజయనగరం జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం బసుపుట్ గ్రామానికి చెందిన పతి ఖిల ఆదేశాలతో ఇద్దరు వ్యక్తులు 200 కిలోల గంజాయిని గతేడాది అక్టోబరు 6న తరలిస్తూ విజయనగరం జిల్లా శృంగవరపుకోట పట్టణం పందిరప్పన్న జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడిగా పతి ఖిలను శృంగవరపుకోట పోలీసులు గుర్తించి, అదే నెల పదో తేదీన అరెస్టు చేశారు. విశాఖలోని సెంట్రల్ జైలుకు రిమాండు నిమిత్తం తరలించారరు. విచారణలో నిందితుడు పతి ఖిల కొన్నేళ్లుగా గంజాయి రవాణా చేస్తూ రూ.42.70 లక్షలు విలువైన స్థిర, చరాస్తులను సంపాదించినట్లుగా గుర్తించారు. ఇటీవల ప్రభుత్వం గంజాయి రవాణాను నియంత్రించడంలో భాగంగా గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. పతి ఖిల.. సోబాపుట్లో రూ.40 లక్షల విలువైన 10 సెంట్ల స్థలంలో ఇంటిని నిర్మించినట్లుగా గుర్తించారు. రూ.1.50 లక్షల విలువైన ఆటో, రూ.1.20 లక్షల విలువైన బైక్‌ను కొనుగోలు చేసినట్లుగా గుర్తించారు. సునాబెడలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు ఖాతాకు ఏప్రిల్ 21, 2023న రూ.38,28,816 నగదు జమైనట్లుగా తేల్చారు. ఇవికాకుండా గంజాయి వ్యాపారుల నుండి పతి ఖిల బ్యాంకు ఖాతాకు పలుమార్లు రూ.6.87 లక్షల నగదు జమైనట్లు నిర్ధారించారు. నగదు బదిలీ చేసిన వ్యక్తులు కూడా గంజాయి వ్యాపారాలు సాగిస్తూ, పోలీసులకు పట్టుబడిన వారేనని, వారిపై కూడా రాజస్థాన్, మహారాష్ట్ర, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో పతి ఖిల సంపాదించిన అక్రమ ఆస్తుల విలువ రూ.42.70 లక్షలు ఉంటుందని, నిందితుడి అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్లుగా నోటీసులు కూడా జారీ చేశామని ఎస్పి తెలిపారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేసిన ఎఎస్పి సౌమ్యలత, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, ఇతర పోలీసు అధికారులను ఎస్పి అభినందించారు.

పశ్చిమ బెంగాల్‌లో మతఘర్షణలు

12 మంది పోలీసులకు గాయాలు
40 మంది అరెస్టు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని మహేశ్తల పట్టణంలో బుధవారం అర్ధరాత్రి మత ఘర్షణలు చేలరేగాయి. బుధవారం మధ్యాహ్నం ఒక దుకాణం ఏర్పాటు విషయంలో స్థానికుల మధ్య ప్రారంభమైన స్వల్ప వివాదం చివరికి మత ఘర్షణలకు దారి తీసింది. ప్రార్ధనస్థలంపై ఒక గుంపు దాడి చేసిందనే వార్తలతో ఈ వివాదం మత ఘర్షణల మలుపు తిరిగిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. దుకాణాలతోపాటు రోడ్లపై నిలిపివున్న వాహనాలను ముఖ్యంగా మోటార్‌బైక్‌లను దుండగులు ధ్వంసం చేశారు. పరిస్థితిని నియంత్రించడానికి ప్రయత్నించిన పోలీసులపై అల్లరి మూకలు రాళ్లు రువ్వాయి. దీంతో డిప్యూటీ కమిషనర్‌తో సహా 12 మంది పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి 40 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. రవీంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డు నెంబరు 7లో ఈ ఘర్షణలు చెలరేగాయి. పోలీస్‌స్టేషన్‌కు కేవలం 100 మీటర్ల దూరంలోనే హింస జరిగిన ప్రదేశం ఉందని, వందలాది మందితో కూడిన అల్లరి మూకను అదుపు చేయడానికి సరైన సంఖ్యలో సిబ్బంది లేరని స్థానికులు ఆరోపించారు. ఈ మత ఘర్షణలకు సంబంధించి మొత్తం ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ఏడు నాడియాల్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. గురువారం ఈ ప్రాంతంలో దుకాణాలు, ఇతర వాణిజ్య సంస్థలను మూసివేశారు. పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించారు. దగ్ధమైన వాహనాలను పోలీసులు రోడ్లపై నుంచి పోలీసులు తొలగించారు. అలాగే ఈ ప్రాంతంలో ప్రజలు గుమిగూడకుండా పోలీసులు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు.

తేక్వాండోలో కడపకు ద్వితీయ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-కడప: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 10, 11,12వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో కడప జిల్లాకు ద్వితీయ చాంపియన్ షిప్ లభించినట్లు తేక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాయబ్ రసూల్ తెలిపారు. సబ్ జూనియర్, కేడెట్, జూనియర్, సీనియర్స్ విభాగంలో కడప జిల్లా నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొని 12 బంగారు, 14 రజత, 12 కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో ఈనెల 23, 24, 25వ తేదీలలో పాల్గొనవలసి ఉంటుందని నాయబ్ రసూల్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు.. తారక్, నదీష్, హుస్సేన్, కైసర్, చరణ్, ఫాతిమా, ఆఫ్రిన్, మాధవిలత, అలయంక, తస్లీమ్, అలకనంద మరియు త్రిలోక్షణా బంగారు పతకాలు సాధించారు. రజత పతకాలు సాధించిన క్రీడాకారులు..హుస్సేన్, తౌఫిక్, హవీష్ అబూబకర్, నయీమ్, సాజిద్, ఫర్మాన్, సయ్యద్, షణ్ముఖ, ఇస్మాయిల్, గురు జస్వంత్ , తశ్వీక , ఖాన్సా. జోష్నా రజత పతకాలు సాధించారు. కాంస్య పతకం సాధించిన క్రీడాకారులు.. అజీజ్, శ్రీనిజ్, ఫయుం, సాకీబ్, వెంకట శ్రీనివాస్, అక్బరుద్దీన్, గీతిక, అంజుమ్, పోషిత, సైఫ్ ఉన్నిసా కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ బి. శివశంకర్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ సలీం అభినందించారు.

కడప స్టీల్ ప్లాంట్‌పై మళ్లీ మాట తప్పిన బాబు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె (కడప జిల్లా)

కడప జిల్లాలో చేపట్టే స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ మాట తప్పారని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొ న్నారు. వేంపల్లెలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల కడపలో జరిగిన మహానాడులో కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై వాగ్దానం చేశార న్నారు. 2025 జూన్ 12లోగా జిందాల్ కంపెనీ పనులు ప్రారంభిస్తుందని మహానాడులో సిఎం చంద్రబాబు చెప్పారన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' నిధులపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-లేపాక్షి (శ్రీసత్యసాయి జిల్లా)

గత వైసిపి ప్రభుత్వంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం లో భాగంగా ఖర్చు చేసిన నిధులపై శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి ఎంపిడిఒ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేపట్టారు. సచివాలయాలకు మంజూరైన నిధులు, ఆటవస్తువుల కొనుగోలు, ప్రస్తుతం ఆ వస్తువులు ఎక్కడ ఉన్నాయి. తదితర వివరాలపై విజిలెన్స్ ఎస్ఐ గోపాల్ స్థానిక పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు ఎంపిడిఒ నరసింహమూర్తి, ఎఒ కుళ్లాయప్ప, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రమేష్‌బాబు, మల్లికార్జున, సాయి, దుర్గయ్య ఉన్నారు.



పెను విషాదం

అహ్మదాబాద్‌లో కూలిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ...

అహ్మదాబాద్ : గుజరాత్‌లో మాటలకందని పెను విషాదం చోటుచేసుకుంది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ విమానం గురువారం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయి పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపల గాలిలోనే పేలి మెడికల్ కళాశాల హాస్టల్‌పై కుప్పకూలింది. మధ్యాహ్నం 1.38 గంటలకు బయలుదేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ ట్విన్ జెట్‌ల తరువాత తొమ్మిది నిమిషాలకే మేఘానీనగర్ హోడాసర్ ప్రాంతంలోని బిజె వైద్య కళాశాల వసతిగృహంపై కుప్పకూలిపోయింది. దీంతో ఆ ప్రాంతమంతా నల్లటి పొగలతో గాఢాంధకారంగా మారింది. ఆ సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ వాసులు, ఏడుగురు పోర్చుగల్ పౌరులు, ఒక కెనడియన్ ఉన్నారు. వీరిలో ఇద్దరు శిశువులు సహా, 13 మంది చిన్నారులు! గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని కూడా ప్రయాణికుల్లో ఉన్నారు. విమానం ఒక్కసారిగా గాలిలో పేలి, మంటల్లో చిక్కుకుంది. వీరిలో ఒక వ్యక్తి బతికి బయటపడ్డట్లు గుర్తించారు. మిగిలిన 241 మందిలో ఎవరూ బతికి, బయటపడే అవకాశాలు లేవని భావిస్తున్నారు. మరోవైపు విమానం కూలిపడ్డ మెడికల్ కళాశాలలో ఆ సమయంలో 50 మందికిపైగా వైద్య విద్యార్థులు ఉన్నారు. విమానం కూలిన ధాటికి కళాశాల భవనం కుప్పగా మారింది. మంటల్లో కొందరు మెడికోలు చిక్కుకున్నారు. వీరిలో కూడా పలువురు మరణించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, మృతుల సంఖ్యను అధికారికంగా ప్రకటించలేదు. మృతదేహాలు మాంసపుముద్దలుగా మారి, గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉండటమే దీనికి కారణం. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అగ్నిమాపక, ఎమర్జెన్సీ సిబ్బంది కూడా సంఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు. విమాన ప్రయాణికుల సమాచారం కోసం హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఎప్పటికప్పుడు అధికారులు, మంత్రులను సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పైలెట్లు అనుభవజ్ఞులే...!

ప్రమాద సమయంలో పైలెట్ సుమిత్ సభర్వాల్, కో-పైలెట్ క్లైవ్ కుందర్ డ్యూటీలో ఉన్నారు. వీరిద్దరూ అనుభవజ్ఞులే. సభర్వాల్‌కు 8,200 గంటలు, కుందర్‌కు 1,100 గంటలు విమానాలను నడిపిన అనుభవం ఉంది. పోలీస్ కంట్రోల్ రూమ్ అందించిన సమాచారం ప్రకారం ఎయిర్ ఇండియాకు చెందిన ఏ1-171 విమానం లండన్‌లోని గట్విక్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. బయలు దేరిన కొద్దిసేపటికే తీవ్ర ప్రమాదంలో ఉన్న సంకేతాలు పైలట్ నుండి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి)కి అందాయి. ఆ వెంటనే విమాన సిబ్బందిని సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. '23 రన్‌వే నుంచి బయలుదేరిన విమానం కొద్దిసేపటికే ఎయిర్‌పోర్ట్ వెలుపల జనావాసాలపై కూలిపోయింది. సంఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి' అని డీజీసీఏ వర్గాలు తెలిపాయి. కూలడానికి ముందు విమానం ప్రమాద సంకేతంగా 'మేడే కాల్' జారీ చేసింది. ఆ తర్వాత ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. ప్రమాద కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ), ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విచారణ చేపట్టాయి. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హుటాహుటిన అహ్మదాబాద్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

మృత్యుంజయుడు

ఈ ప్రమాదం నుంచి ఒకే ఒక్కడు మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. 11 ఎ సీటులో ప్రయాణిస్తున్న రమేష్ విశ్వాస్ ప్రాణాలతో బయటపడినట్లు అహ్మదాబాద్ సిపి జిఎస్ మాలిక్ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గతంలో ప్రమాదాలు లేవు.,.

ప్రపంచంలో గతంలో బోయింగ్ 787 విమానాలు ప్రమాదానికి గురైన దాఖలాలేవీ లేవు. ఈ మోడల్ విమానాలకు భద్రతా పరంగా మంచి రికార్డు ఉంది. ఎయిర్ ఇండియా నడుపుతున్న 27 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైన్స్ జెట్లలో ఇది ఒకటి. ప్రమాదానికి గురవడానికి ముందు ఈ విమానం న్యూఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు వచ్చింది. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో ఎయిర్ ఇండియా విమానం భారీ ప్రమాదానికి గురవడం ఇదే మొదటిసారి. విమానం 174 నాట్స్ వేగంతో ప్రయాణిస్తూ 625 అడుగుల (190.5 మీటర్లు) ఎత్తులో సిగ్నల్స్ కోల్పోయి వేగంగా కిందికి పడిపోయింది. అన్ని విధాల సేఫ్ అని భావిస్తున్న బోయింగ్ విమానం ఈ స్థాయిలో భారీ ప్రమాదానికి గురికావడం చర్చనీయాంశంగా మారింది,

భయానకంగా మృతదేహాలు

తీవ్రంగా కాలిపోయిన మృతదేహాలను తీసుకొస్తున్నా రని, వాటిలో కొన్ని గుర్తు పట్టడానికి కూడా వీలులేకుండా ఉన్నాయని అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రి ట్రూమా సెంటర్ తెలిపింది. బతికి బయటపడిన వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నదని, తీవ్ర గాయాలతో స్పృహ లేకుండా ఉన్నారని ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కిడ్నీ డిసీజస్ అండ్ రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రంజల్ మోడీ చెప్పారు. 'రోగులలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని గుర్తించే పరిస్థితి కూడా లేదు. ముఖాలు మాడిపోయాయి. చర్మం చాలా వరకూ కాలిపోయింది. వారు స్పృహలో లేరు. వారిని బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం' అని ఆయన తెలిపాశారు. కొందరి శరీరాలపై ఇప్పటికీ సీట్‌బెల్టులు ఉన్నాయని అంటూ అలాంటప్పుడు వారి జేబులు ఎలా వెతకగలం అని అన్నారు. ఇదిలావుండగా ఆనంద్ వంటి సమీప జిల్లాలు, గుజరాత్‌లోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు ఆస్పత్రి వద్ద ఆత్రుతగా ఎదురు చూస్తూ తమ వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తన సోదరుడు స్వప్నిల్ సోనీ, అతని భార్య యోగా, వదిన ఆల్ఫా సోనీ కూడా విమానంలో ఉన్నారని అహ్మదాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త తృప్తి సోనీ చెప్పారు. ఆస్పత్రి వద్ద ఉన్నానని, ఇంకా ఏ సమాచారము తెలియలేదని ఆయన అన్నారు.



సిపిఎం దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై సిపిఎం తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసింది. సహాయ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. పార్టీ ఆలోచనలన్నీ బాధితులు, వారి కుటుంబాలతో ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు సిపిఎం తన ఫేస్‌బుక్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టింది.

చంద్రబాబు విచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 250 మందికిపైగా మృతిచెందడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాద నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా విచారం వ్యక్తం చేశారు.

ప్రయాణికులతోపాటు మెడికోల మృతి బాధాకరం : జగన్

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. మరణించిన వారిలో విదేశీయులు కూడా ఉన్నారని తెలిపారు. ఇదే ప్రమాదంలో మెడికోలు మృతిచెందడం మరింత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రమాదంతో మెడికల్ కాలేజీ హాస్టల్లో చెల్లాచెదురైన కంచాలు, టేబుళ్లు

మెడికల్ కాలేజీలో మృతులు ఎందరు?

అహ్మదాబాద్ : బిజె మెడికల్ కాలేజీ యుజి హాస్టల్ భవనాలపై విమానం కూలడంతో ఎంతమంది మరణించారన్న విషయంలో సందిగ్ధత నెలకొంది. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలతో దూసుకొచ్చిన విమానశకలాలపై పడి పెద్ద శబ్దంతో ఒక్క సారిగా పేలిందని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకూ ఐదుగురు వైద్య విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. మృతదేహాలు గుర్తించిన వారిలో నలుగురు అండర్ ఎంబిబిఎస్, ఒక పిజి విద్యార్థి ఉన్నారని గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధనంజయ్ ద్వివేది తెలిపారు. విమానం కూలిపోవడంతో విద్యార్థుల హాస్టల్, స్టాఫ్ క్వార్టర్స్, అనేక నివాస గృహాలు దెబ్బతిన్నాయని చెప్పారు. విద్యార్థులతోపాటు స్థానికులు కూడా గాయపడ్డారని తెలిపారు. గాయపడిన 50 మంది విద్యార్థులను, స్థానికులను అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. కొంతమందికి తీవ్ర గాయాలైనా వారి పరిస్థితి స్థిరంగానే ఉందని వైద్యులు తెలిపారు. గాయపడిన వారందరికీ ఉత్తమ వైద్య చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. బాధితుల్ని గుర్తించడంలో సహాయం కోసం బిజె మెడికల్ కాలేజ్ వద్ద డిఎన్‌ఎ పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన నిమిషాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, బిఎస్‌ఎఫ్, సిఐఎస్‌ఎఫ్, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకోవడంతో పలువురిని సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థులు భోజనాలు చేస్తున్నప్పుడు ఈ ఘటన చోటు చేసుకోవడంతో మెస్‌లో ప్లేట్లు, ఆహారం చిందరవందరగా పడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి.

విమానంలో సాంకేతిక సమస్యలు
ప్రమాదానికి ముందే ప్రయాణికుడి ట్వీట్

ప్రమాదానికి గురైన విమానంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని ఈ దుర్ఘటనకు ముందే ఒక ప్రయాణికుడు హెచ్చరించారు. ప్రమాదానికి గురైన విమానం ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ వచ్చింది. అక్కడి నుంచి లండన్ వెళ్లాల్సి ఉంది. ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ వరకూ ఈ విమానంలో వచ్చిన ఆకాశ్ వత్స విమానంలోని సాంకేతిక సమస్యలపై ట్వీట్ చేశారు. విమానంలో ఎసిలు పనిచేయడం లేదని, సీటికి ఉండే స్క్రీన్లు ఆన్ అవ్వడంలేదని, అసలు ఫ్లైట్ అంతా ఏదో తేడాగా ఉందని అనుమానం వ్యక్తం చేసిన ఆ ట్వీట్ ఇప్పుడు సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ట్వీట్‌కు అనేక మంది షేర్లు, కామెంట్లు పెడుతున్నారు. అహ్మదాబాద్‌లో ఈ ప్రయాణికుడు దిగిపోవడంతో ప్రమాదం నుంచి బయటపడగలిగాడు.

హైడ్రాలిక్, ఇంధన లీకేజీలు, బ్యాటరీల సమస్యలు !

- బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌తో ఎప్పుడూ చిక్కులే
- ఏడాదిలో ఐదు ఫిర్యాదులు
- వీటితో ఎయిర్ ఇండియాకు అదనపు ఖర్చే

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రమాదానికి గురైన బోయింగ్ 787 విమానం పనితీరు, సామర్థ్యంపై మరోసారి చర్చకు వచ్చింది. ఈ విమానంలోని సాంకేతిక లోపాలు, లొసుగులపై గత కొద్ది మాసాలుగా ప్రపంచవ్యాప్తంగా ఫిర్యాదులు అందుతునే వున్నాయి. ఇంజన్లు, గేర్లు, ఫ్లాప్‌లు, కేబిన్‌లో ఒక్కసారిగా పీడనం పడిపోవడం, ఎత్తుకు చేరేటప్పుడు వంటి సమస్యలు తలెత్తిన సంఘటనలు ఈ ఏడాది కాలంలో ఐదు జరిగాయి. ఎయిర్ ఇండియా గత దశాబ్ద కాలంగా అనేక సమస్యలను ఎదుర్కొంటూనే వుంది. గతేడాది డిసెంబరు 13న జరిగిన సంఘటన తాజాది. న్యూఢిల్లీ నుండి బర్మింగ్‌హామ్ ప్రయాణిస్తున్న ఎఐ-113 విమానం బర్మింగ్‌హామ్ రన్‌వేకు చేరువలో వుండగా ముందు భాగం నోస్ గేర్‌లో హైడ్రాలిక్ లీక్ అయినట్లు తెలిసింది. ల్యాండ్ అయిన తర్వాత దాన్ని పక్కకు తీసుకెళ్లి 28గంటల పాటు నిలిపివేశారు.

2011లో వీటిని తొలిసారిగా ఎయిర్ ఇండియాలో ప్రవేశపెట్టారు. రెండేళ్ల తర్వాత 2013 మార్చిలో జపాన్ ఎయిర్‌లైన్స్‌లో ఇంధన లీకేజీ సమస్య తలెత్తింది. వెంటనే కిందకు దింపేశారు. అమెరికా విమానంలో ప్రధాన బ్యాటరీల సమస్యలు తలెత్తాయి.

అదనపు ఖర్చు...

భారత్‌లో బాగా తుపానులు వచ్చే సమయంలో డ్రీమ్‌లైనర్‌లో ప్రయాణాలు నివారించాలని బోయింగ్, ఎయిర్ ఇండియాకు సూచించింది. ఇంజన్లపై ఐస్ పేరుకుపోయే ముప్పు పెరుగుతుందని తెలిపింది. దీనివల్లే ఢిల్లీ-టోక్యో రూట్‌లో విమానాన్ని నిలిపివేసింది. ఢిల్లీ-కోల్‌కతా విమానంలో విండ్‌షీల్డ్ బీటలు వారడంతో వెల్లడైంది.

ప్రారంభించిన 14 మాసాల కాలంలోనే ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ విమానాల్లో 136 స్వల్ప లోపాలు తలెత్తాయి. లోపాలు తలెత్తిన విమానాలను తక్షణమే నిలిపివేయడం వల్ల ఎయిర్‌ఇండియాకు అదనంగా రోజుకు 60లక్షల రూపాయలు ఖర్చు కూడా అయింది. ఆ రూట్‌లో వేరే విమానాన్ని ఏర్పాటు చేయడానికి, పైలట్, ఇతర సిబ్బంది నిర్వహణ ఖర్చులు కింద రోజుకు మరో 1.43కోట్లు ఖర్చయిందని కేంద్ర పౌర విమానయాన శాఖ రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించింది.

ఆరోపణలను తోసిపుచ్చిన బోయింగ్

బోయింగ్ ఇంజనీర్ సామ్ సలేపూర్ కొన్ని మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో వీటిపై పలు విమర్శలు చేశారు. బోయింగ్ 777, 787 విమానాల మోడల్ నిర్మాణంలోనే నాణ్యత సరిగా లేదని అన్నారు. వీటివల్ల దీర్ఘకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని హెచ్చరించారు. ఆ ఆరోపణలను, విమర్శలను అప్పట్లో బోయింగ్ తోసిపుచ్చింది.

విమాన ప్రమాదాల్లో అత్యంత కీలకం బ్లాక్ బాక్స్



న్యూఢిల్లీ : వియాన ప్రమాదాలు జరిగినప్పుడల్లా బ్లాక్ బాక్స్ గురించి పెద్ద చర్చే జరుగుతుంది.పదే పదే ఆ పదమే వినబడుతుంది.అసలు బ్లాక్ బాక్స్ అంటే ఏమిటి,అది ఎలా పని చేస్తుందో,దాని కథ ఏంటో తెలుసుకుందాం.....

బ్లాక్ బాక్స్ అంటే ఏంటి ?

బ్లాక్ బాక్స్ విమాన ప్రయాణ సమయాల్లో అన్నీ కార్యకలాపాలను రికార్డ్ చేసే ప్రత్యేక పరికరం.వాస్తవం గా ఇది నలుపు రంగులో

ఉండదు.సులభంగా గుర్తించడానికి వీలుగా నారింజ రంగులో ఉంటుంది.దీనిలో రెండు భాగాలుంటాయి.1.కాక్‌పిట్ వాయిస్ రికార్డర్(సివిఆర్) 2.ఫ్లైట్ డేటా రికార్డర్(ఎఫ్‌డీఆర్).సివిఆర్ అనేది పైలెట్,సిబ్బంది మధ్య జరిగే సంభాషణలతో పాటు ఇంజన్,అలారాల శబ్దాలతో సహా అన్నీరికార్డ్ చేస్తుంది.చివరి రెండు గంటల మాటలను సురక్షితంగా భద్రపరుస్తుంది.మరోది ఎఫ్‌డీఆర్ ఇది విమానం ఎత్తు,దిశ,వేగం వంటి సాంకేతిక వివరాలను రికార్డ్ చేస్తుంది.24 గంటల డేటాను నిల్వ చేస్తుంది.


ప్రత్యేకత ఏంటి?

బ్లాక్ బాక్స్ ను బలమైన పదార్థాలతో తయారు చేస్తారు.ఇది 100 డిగ్రీల వరకు వేడిని తట్టుకోగలదు.సముద్రంలో 6000 మీటర్ల లోతుకు మునిగిపోయినా పని చేస్తుంది.30 రోజుల పాటు నీటిలో ఉన్నా ఆపకుండా ఆల్ట్రా సోనిక్ సిగ్నల్స్ పంపిస్తుంది.దీని ద్వారానే ప్రమాద కారణాలను గుర్తిస్తారు.దీనితో చివరి క్షణాల్లో పైలెట్లు తీసుకున్న చర్యలు తెలుసుకోవచ్చు.విమానంలో తలెత్తిన సాకేతిక సమస్యను గుర్తించ వచ్చు.అయితే కొన్నిసార్లు బ్లాక్ బాక్స్ ను కనుగొనడం కష్టం.ముఖ్యంగా సముద్రంలో కూలిన విమానాల విషయంలో.ఉదాహరణకు మలేషియా ఎయిర్‌లైన్స్ ఎంహెచ్ 370 విమానం 2014 లో తప్పిపోయినప్పుడు బ్లాక్ బాక్స్ లభించ లేదు.అది ఇప్పటికీ రహస్యంగానే మిగిలిపోయింది. విమాన రంగంలో భద్రతా ప్రమాణాలు మెరుగుపరచడానికి,ప్రమాదాలు జరిగినప్పుడు కారణాలు విశ్లేషించుకుని విమాన ప్రయాణాలు మరింత సురక్షితం చేయడానికి బ్లాక్ బాక్స్ దోహదపడుతుంది.

ఈ ప్రమాదంలో..

సాధారణంగా బ్లాక్ బాక్స్‌ను విమానం తోక భాగంలో అమరుస్తారు.ఎందుకంటె ఇంధనానికి దూరంగా ఉండటంతో కాలిపోయె అవకావం తక్కువ,సముద్రాల్లో ప్రమాదం జరిగితే నీటిలో పడినా తేలుతుంది.అయితే అహ్మదాబాద్ దుర్ఘటనలో విమానం చివరి భాగం భవనం పై భాగంలో చిక్కుకుపోయింది.కాబట్టి బ్లాక్ బాక్స్ సురక్షితంగానే ఉంది.కొద్ది రోజుల్లోనే విమాన ప్రమాద కారణాలు ప్రభుత్వం వెల్లడిస్తుంది.

గతంలో భారత్‌లో జరిగిన భారీ ప్రమాదాలు



- 1990 ఫిబ్రవరిలో బెంగళూరు విమానాశ్రయంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 రన్‌వేను తాకడంతో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 146 మంది ప్రయాణికులు, 92 మంది సిబ్బంది చనిపోయారు.
- 1993 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన ఇండియన్ ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం టేకాఫ్ సమయంలో రన్‌వేపైకి వచ్చిన ట్రక్కును ఢీకొట్టింది. దీంతో విమానంలో మంటలు చెలరేగి 118 మంది ప్రయాణికులు, 55 మంది సిబ్బంది (గ్రౌండ్ సిబ్బందితో కలిపి) ప్రాణాలు కోల్పోయారు.
- 1996లో హరియాణాలో సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానం 763, కజికిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానం 1907 ఢీకొన్నాయి. సమాచారం లోపం కారణం జరిగిన ఈ ప్రమాదంలో రెండు విమానాల్లో 340 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది మరణించారు.
- 1998 జులైలో ఆలయన్స్ ఎయిర్ ఫ్లైట్ బోయింగ్ 737-2ూ8 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పి జనాలు ఉన్న ప్రాంతంలోకి దూసుకెళ్లింది. బీహార్‌లోని పాట్నా విమానాశ్రయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 55 మంది ప్రయాణికులు, ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు.
- 2010 మేలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్-812 కుప్పకూలింది. 166 మంది ప్రవాస భారతీయులు ఉన్న ఈ విమానం దుబాయ్ నుంచి మంగళూరుకు రాగా సకాలంలో రన్‌వేపై ఆగకుండా లోయలోకి దూసుకెళ్లింది. దీంతో మంటలు చెలరేగి 158 మంది మతి చెందారు. 8 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.
- 2020లో కరోనా మహమ్మారి సమయంలో విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా బోయింగ్ 737-800 విమానం దుబాయ్ నుంచి కేరళలోని కోజికోడ్‌కు బయలుదేరింది. అదే సమయంలో భారీ వర్షం కారణంగా అదుపుతప్పి 30 అడుగుల లోయలో పడి విమానం రెండుగా చీలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలెట్లు సహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

భయానకం ... చెల్లాచెదురుగా మృతదేహాలు, శకలాలు

- ప్రత్యక్షసాక్షుల కథనం

అహ్మదాబాద్ : విమానం కూలిన ప్రదేశం వద్ద పరిస్థితి భయానకంగా ఉన్నదని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. మృతదేహాలు, విమాన శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని వారు చెప్పారు. 'నేను ఇంటిలో ఉండగా పెద్ద శబ్దం వినిపించింది. ఏం జరిగిందో తెలుసుకునేందుకు బయటకు రాగానే దట్టమైన పొగ వ్యాపించి ఉంది' అని ఓ వ్యక్తి పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. ఎక్కడ చూసినా ప్రమాదంలో మరణించిన వారి శరీరాలు, విమాన శకలాలే కన్పించాయని ఆయన చెప్పారు. తన కుమారుడు ఉంటున్న ఓ హాస్టల్ భవనంపై విమానం కూలిపోయిందని మరో వ్యక్తి అన్నారు. 'భోజన విరామ సమయంలో నా కుమారుడు హాస్టల్‌కు వెళ్లాడు. అక్కడే విమానం కూలింది. అయితే నా కుమారుడు సురక్షితంగానే ఉన్నాడు.

రెండో అంతస్థు నుంచి కిందికి దూకడంతో కొన్ని గాయాలయ్యాయి' అని రమీలా తెలిపారు. కాగా ప్రమాద వార్త తెలియగానే హుటాహుటిన విజయవాడ నుండి అహ్మదాబాద్ చేరుకున్న పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ప్రధాని మోడీ మాట్లాడారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సూచిస్తూ అన్ని రకాలుగా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత విభాగాలన్నీ అప్రమత్తంగా ఉన్నాయని, సమన్వయంతో పనిచేస్తున్నాయని నాయుడు కార్యాలయం తెలిపింది.

బి.జె.మెడికల్స్ వద్ద డిఎన్ఎ పరీక్షలకు ఏర్పాట్లు

విమాన ప్రమాదంలో మృతి చెందినవారిని గుర్తించేందుకు వీలుగా బి.జె.మెడికల్స్ వద్ద డిఎన్ఎ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు గుజరాత్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ తెలిపారు. ప్రయాణికుల కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తల్లిదండ్రులు, పిల్లలు ఆ సెంటర్‌కు వచ్చి తమ శాంపుల్స్ ఇవ్వాలని ఆయన కోరారు. అప్పుడు బాధితులను గుర్తించడం తేలికవుతుందని అన్నారు.

దర్యాప్తులో సహకరించడానికి అమెరికా బృందం

అమెరికా దర్యాప్తు అధికారులతో కూడిన బృందం భారత్‌కు వస్తోందని, ఈ ప్రమాదంలో దర్యాప్తునకు సహకరిస్తారని జాతీయ రవాణా భద్రతా బోర్డు (ఎన్‌టిఎస్‌బి) ఎక్స్ పోస్టులో తెలిపింది.

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడిన అమిత్ షా

ప్రమాదంపై కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడారు. సహాయ చర్యలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అంతకుముందు అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం ఘటన తీవ్రంగా కలచివేస్తోందంటూ గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ విచారం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన తక్షణ చికిత్స కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ.49 కోట్ల సమీకరణలో ఐఎఫ్ఎల్ ఎంటర్‌ప్రైజెస్

ముంబయి : రైట్ ఇష్యూ ద్వారా రూ.40.14 కోట్లు నిధులు సమీకరించడానికి తమ కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని ఐఎఫ్ఎల్ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. ఈ ఇష్యూ జూన్ 19 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు కోసం తెరువబడి ఉంటుందని పేర్కొంది. ఇందులో రూ.1 ముఖ విలువ కలిగిన రూ.49,14,76,620 ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు తెలిపింది. ఈ నిధులను కంపెనీ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు ఉపయోగించనున్నామని పేర్కొంది.

సజ్జల రామకృష్ణారెడ్డిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)
వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

12 కోట్లు దాటిన నిర్వాసితులు !

- హింస, వేధింపులే కారణంగా సరిహద్దులు దాటుతున్న ప్రజలు
- ఏడాదిలోనే 20లక్షల మందికి పైగా పెంపు
- పదేళ్లలో రెట్టింపు
- యుఎన్‌హెచ్‌సిఆర్ నివేదిక వెల్లడి



జెనీవా : ప్రపంచవ్యాప్తంగా హింస, వేధింపుల కారణంగా నిర్వాసితులవుతున్న వారి సంఖ్య 12.2కోట్లు దాటిందని ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ (యుఎన్‌హెచ్‌సిఆర్) వెల్లడించింది. గతేడాది కాలంలోనే 20లక్షలమందికి పైగా నిర్వాసితులు పెరగగా, గత దశాబ్ద కాలంలో రెట్టింపు పెరిగారని పేర్కొంది. గత దశాబ్ద కాలానికి పైగా సాగిన అంతర్యుద్ధం నుండి కోలుకోవడానికి సిరియా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో దాదాపు 20లక్షల మంది సిరియన్లు స్వదేశానికి వెళుతున్నారని, ఇదొక మంచి సంకేతమేనని, గత ఆరు మాసాల్లో ఇటువంటి కొన్ని ఆశాకిరణాలు కనిపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) ఫిలిప్పో గ్రాండి తెలిపారు. శరణార్థుల సంస్థ గురువారం గ్లోబల్ ట్రెండ్స్ రిపోర్ట్‌ను విడుదల చేయడంతో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

యుద్ధాలు, హింస, వేధింపులు వంటి కారణాల వల్ల విదేశాలకు పారిపోయిన లేదా స్వదేశాల నుండి ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన వారి సంఖ్య ఏప్రిల్ నాటికి 122.1 మిలియన్లుగా వుందని ఆ నివేదిక పేర్కొంది. మళ్ళీ వీరిలో అంతర్గతంగా నిర్వాసితులైన వారి సంఖ్య 9శాతానికి పైగా పెరిగింది. గతేడాది చివరి నాటికి ఈ సంఖ్య 7.35కోట్లుగా వుందని తెలిపింది. దేశ సరిహద్దులు దాటిన వారిలో దాదాపు మూడింట రెండు వంతుల మంది పొరుగున గల దేశాల్లోనే తల దాచుకున్నారని యుఎన్‌హెచ్‌సిఆర్ తెలిపింది. ఇలాంటి వారిలో మెజారిటీ మంది యూరప్ దేశాలకు లేదా అమెరికాకు పారిపోతున్నారని సంపన్న దేశాల్లో నెలకొన్న భావనను అడ్డం కొడుతూ నివేదిక పై విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద నిర్వాసితుల సంక్షోభానికి సూడాన్ కేంద్రంగా వుంది. సిరియాను దాటి సూడాన్ అంతర్యుద్ధం వల్ల కోటీ 40లక్షల మంది నిర్వాసితులయ్యారు. ఆఫ్ఘనిస్తాన్‌లో కోటీకిపైగా, ఉక్రెయిన్‌లో 88లక్షలకు పైగా ప్రజలు నిర్వాసితులయ్యారని యుఎన్‌హెచ్‌సిఆర్ నివేదిక పేర్కొంది.

15న మస్కట్‌లో ఇరాన్, అమెరికా చర్చలు

దుబాయ్ : ఇరాన్, అమెరికా ఈ ఆదివారం (15వ తేదీన) మస్కట్‌లో ఆరవ దఫా చర్చలు జరపనున్నాయని ఒమన్ విదేశాంగ మంత్రి గురువారం తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమంపై జరగనున్న ఈ చర్చల్లో యురేనియం శుద్ధి విషయంలో తాము రాజీపడేది లేదని ఇరాన్ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఇటీవల కాలంలో మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను సాకుగా చూపుతూ యురేనియం శుద్ధిచేసేందుకు తమకు గల హక్కును వదులుకునేలా ఒత్తిడి తేవడానికి చూస్తున్నారని సీనియర్ ఇరాన్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. తమ వైఖరిని మార్చుకోవాలన్నది ఎదుటి పక్షం ఆలోచనగా వుందని పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో ఆపరేషన్లకు కీలకం కాని అమెరికా సిబ్బందిని మధ్యప్రాచ్యం నుండి తక్షణమే తరలిస్తున్నామని, ప్రాంతీయ అశాంతులతో ఇదొక ప్రమాదకరమైన ప్రాంతంగా మారుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగివుండడాన్ని అమెరికా ఎన్నటికీ అనుమతించబోదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికి ఐదు దఫాలుగా చర్చలు జరిగినా అనేక అడ్డంకులు, అభ్యంతరాలు పరిష్కారం కాకుండా అలాగే వున్నాయి. అందులో యురేనియం శుద్ధి అంశం ఒకటి. ఈ ఉద్రిక్తతల కారణంగా ఓడలను కూడా లక్ష్యంగా చేసుకుంటారని హెచ్చరికలు వెలువడుతున్నాయి. అణు కార్యక్రమంపై ఒప్పందం కుదిరితే ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయడానికి అవకాశం వుంటుంది. ఒకవేళ ఒప్పందం కుదరని పక్షంలో ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లే అవకాశం వుంది. ఇప్పటికే గాజాలో యుద్ధంతో పరిస్థితులు అత్యంత అనిశ్చితిగా వున్నాయి.

తల్లికి వందనం నిధులు వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తల్లికి వందనం నిధులను వెంటనే విడదల చేయాలని, అర్హులందరికీ పూర్తి స్థాయిలో నిధులు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.రామ్మోహన్ రావు, కె.ప్రసన్న కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాక ముందు విద్యార్థులకు అండగా నిలబడతామని ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు 15,000 చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి ఇప్పుడు మాటమార్చిందని పేర్కొన్నారు. బడుల తెరిచిన రోజునే ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి, తాజాగా జులై 5కి వాయిదా వేయడం ప్రభుత్వ ఆలోచనను తెలియజేస్తుందన్నారు. తల్లికి వందనం పథకంలో రూ.13 వేలు విద్యాలయాలకు జమ చేస్తామనడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు కార్పొరేట్ బడులను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిదా అని ప్రశ్నించారు. అసంబద్ధ నిబంధనలు పేరుతో విద్యార్థుల సంఖ్యను కుదింపు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. 54,94,703 మంది మాత్రమే ప్రస్తుతం అర్హులు అని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఇంకా 12,32,461 మంది నూతనంగా చేరేందుకు అవకాశం ఉందని కాబట్టి వారికి కూడా వర్తింపజేయాలని కోరారు. ఒక కుటుంబంలో పాఠశాల, డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే ఒక్కరికి మాత్రమే రెండింటిలో ఒక పథకం వర్తిస్తుందని పేర్కొనడాన్ని తప్పుబట్టారు. ఇంట్లో ఎంతమది ఉంటే అంతమందకి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు లింకు పెట్టడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా తల్లికి వందనం పథకంలో అందరికీ రూ.15,000 చొప్పున ఇవ్వాలని లేని పక్షంలో తల్లిదండ్రుల, విద్యార్థుల వ్యతిరేకతను చవిచూస్తారని హెచ్చరించారు.

బాధితులకు సిపిఎం నేతల ఓదార్పు

- కాశ్మీరీల్లో మనోధైర్యం నింపిన బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
పహల్గామ్ ఉగ్రవాద దాడి, తదనంతరం భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి నేతృత్వంలోని సిపిఎం ప్రతినిధి బృందం కాశ్మీర్‌లో రెండురోజులపాటు పర్యటించి, బాధితుల్లో మనోధైర్యాన్ని నింపింది. ఘర్షణ వల్ల జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూడటానికి, నియంత్రణ రేఖ వెంబడి నివసిస్తున్న వారిని ఓదార్చడానికి బృందం అక్కడ పర్యటించింది. జరిగిన నష్టాన్ని పరిశీలించింది. బాధిత ప్రజలను ఓదార్చడంతోపాటు, రాజకీయ నేతలను, మేధావులను కలిసి కాశ్మీర్‌కు అండగా దేశం నిలబడుతోందని భరోసా ఇచ్చింది. అనేక మందితో చర్చలు, ప్రజలను ఓదార్పు అనంతరం సిపిఎం నేతల రెండు రోజుల పర్యటన ముగిసింది. కాశ్మీర్ నుంచే సిపిఎం బృందం లౌకికవాదంతో కూడిన వైవిధ్యపూరితమైన సందేశాన్ని ఇచ్చింది. కాశ్మీర్‌కు అండగా దేశం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చింది.

బాధితుల కన్నీళ్లు తుడుస్తూ...

బాధితుల కన్నీళ్లను తుడుస్తూ సిపిఎం నేతలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'వారు ఆదిల్‌ను చంపగలిగారు. కానీ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే. ఒక ఆదిల్ పోయినప్పటికీ, వేలాది మంది ఆదిల్‌లు అతని స్థానంలోకి వస్తారు. అదే కాశ్మీరియత్. పర్యాటకులు మా అతిథులు. మా అతిథులను రక్షించే పోరాటంలో ఆదిల్ మరణించాడు. నేను, నా కుటుంబం దాని గురించి గర్వపడుతున్నాం. ఏది సరైనదో, ఏది తప్పో స్పష్టంగా తెలిసిన వ్యక్తి నా కొడుకు' అని కాశ్మీర్‌ను సందర్శించే సిపిఎం ప్రతినిధి బందంతో సయ్యద్ హైదర్ షా తడబడుతున్న స్వరంతో గర్వంగా చెప్పారు.



శ్రీనగర్ పర్యటనలో భాగంగా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

హైదర్ షా ఐదుగురు పిల్లలలో ఆదిల్ షా మూడో వాడు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిలో మరణించిన ఏకైక స్థానిక వ్యక్తి ఆయన. పహల్గామ్ నుండి కిలోమీటర్ల దూరంలో ఉన్న బైసరన్ లోయకు పర్యాటకులను గుర్రంపై తీసుకెళ్లడం ద్వారా జీవనోపాధి పొందే అనేక మందిలో ఆయన ఒకరు. తన గుర్రంపై లోయకు చేరుకున్న పర్యాటకుడిని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు, నిరాయుధుడైన ఆదిల్ షా జోక్యం చేసుకున్నాడు. ఉగ్రవాది ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడంతో, ఆదిల్ మెడ, ఛాతీపై మూడుసార్లు కాల్పులు జరిపాడు. ఆదిల్ రక్తం, 25 మంది అతిథులతో కలిసి, లోయలోని బురద నేల అంతటా వ్యాపించింది.

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ఆదిల్‌షా తండ్రి హైదర్ షా మాట్లాడుతూ, తాను చాలా మంది ప్రాణాలను కాపాడానని చెప్పాడు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఎంపిలకు హైదర్ షా కృతజ్ఞతలు తెలిపారు. దేశం మొత్తం తన కుటుంబంతో ఉందనే నమ్మకంతో ఉన్నానని అన్నారు. దేశం మొత్తం ఆదిల్ కుటుంబానికి అండగా ఉంటుందని ఎంఎ బేబి అన్నారు. 'హైదర్ మాటలు ఆదర్శప్రాయమైనవి. మానవత్వాన్ని నిలబెట్టే అటువంటి మనసుల ముందు ఉగ్రవాదం కూడా ఓడిపోయింది. సిపిఎం ఆదిల్ కుటుంబాన్ని హృదయానికి దగ్గరగా ఉంచుతుంది' అని బేబి అన్నారు. ఆదిల్ తల్లి బేబీ జాన్, అతని భార్య గుల్నాజ్‌లను సిపిఎం బృందం ఓదార్చింది.

గ్రీస్‌లో జర్నలిస్టుల సమ్మె

- వేతన ఒప్పందాల కై ఆందోళన
- టీవీ, వార్తాపత్రికలు నిలిపివేత

ఏథెన్స్ : వేతనాలు పెంపు కోసం గ్రీస్‌లో జర్నలిస్టులు గురువారం నాడు 24 గంటల పాటు సమ్మె నిర్వహించారు. దీంతో టీవీ, రేడియో ప్రసారాలు, వార్తాపత్రికలు అన్నీ నిలిచిపోయాయి. మీడియా కంపెనీల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రస్తుతం 880 యూరోలు మాత్రమే జీతం ఇస్తున్నారు.దీన్ని 1,250 యూరోలకు పెంచాలని,ఆదివారం,సెలవుదినాల్లో పని చేస్తే అధనంగా చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రీస్ జర్నలిస్టు సంఘాల సమాఖ్య (పాన్‌హెలెనిక్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ యూనియన్స్) ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునివ్వడం ఇది ఐదవసారి. ప్రైవేట్ మీడియా సంస్థలు గత 17 సంవత్సరాలుగా కార్మిక ఒప్పందాలపై సంతకం చేయలేదని యూనియన్స్ వెల్లడించాయి.పని విధానాలు మార్చాలని,ఉద్యోగ భద్రత, జర్నలిస్టుల పై కేసులను నిలిపేయాలని వారు కోరుతున్నారు. రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) తాజా నివేధిక ప్రకారం.పత్రికా స్వేచ్ఛలో గ్రీస్ వరుసగా 4వ సంవత్సరం యూరోపియన్ యూనియన్ దేశాలలో చివరి స్థానంలో నిలిచిందని,ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో 89వ స్థానంలో ఉందని యూనియన్ నేతలు వెల్లడించారు. కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో మీడియా కేంద్రీకృతం కాకుండా ప్రభుత్వం నియంత్రించాలని. పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాలను చేసుకోవడానికి యాజమాన్యాలు చర్చల జరపాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి..

హామీలు ఫుల్, అమలు నిల్

- ప్రభుత్వంపై రైతు సంఘాల మండిపాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై రైతు సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయ రంగానికి ఇచ్చిన హామీల అమలుకు పూనుకోలేదని సంఘాల నాయకులు విమర్శించారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతుకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి నేటికీ అందించలేదని తెలిపారు. రాష్ట్రంలో పత్తి, మిర్చి, పొగాకు, మామిడి, కోకో, కొబ్బరి, ధాన్యం, అపరాలు వంటి అన్ని పంటల ధరలు పతనమై, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదని పేర్కొన్నారు. పంటబీమా ఊసులేదన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెడితే పగులకొడతామని ప్రగల్భాలు పలికి, నేడు కేంద్రానికి తలొగ్గి అదే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు మాట్లాడుతూ ఏడాదిలో కూటమి పాలన విఫలమైందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే సుపరిపాలనని ఎలా అంటామని ప్రశ్నించారు. వ్యవసాయ అనుబంధ రంగాల సమస్యలూ పరిష్కారం కాలేదని అన్నారు. ఇరిగేషన్, పశుపోషణ, సహకార, ఉద్యానవన, వాణిజ్య, ఆక్వా రంగాలను కూడా ఆదుకోలేదని తెలిపారు. అధికవర్షాలు, వరదలకు లక్షలాది ఎకరాలు నీటమునిగితే రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో తాత్సారం చేశారని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు చుండూరు రంగారావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, సీనియర్ నాయకులు వై.కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఎఐకెఎఫ్ అధ్యక్షులు వెంకటరెడ్డి, విశ్రాంత ఐఎఎస్ బి.శ్రీనివాస్, కిసాన్ సంఘటన రాష్ట్ర కన్వీనర్ మరీదు ప్రసాదుబాబు, కౌలు రౌతు సంఘం కార్యదర్శి ఎం.హరిబాబు, రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, హేమలత పాల్గొని మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని అన్నారు.

కుప్పకూలిన విమానయాన షేర్లు

- ఎయిరిండియా దుర్ఘటనతో ఒత్తిడి
- సెన్సెక్స్ భారీ పతనం



ముంబయి : అహ్మదాబాద్‌లో ఎయిరిండియా ఘోర ప్రమాదంతో గురువారం విమానయాన రంగ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికాకు చెందిన విమానాల తయారీ కంపెనీ బోయింగ్ కో షేర్ ఇంట్రాడేలో ఏకంగా 8 శాతం పతనమయ్యింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్ విలువ 3.32 శాతం లేదా రూ.187 పతనమై రూ.5,444కు తగ్గింది. ఇంట్రాడేలో 5,418 కనిష్టాన్ని తాకింది. స్పైస్‌జెట్ షేరు విలువ 1.78 శాతం నష్టంతో రూ.44.68 వద్ద ముగిసింది. అమెరికా ప్రీ మార్కెట్‌లో బోయింగ్ షేర్ 5.83 శాతం క్షీణించి 214 డాలర్లుగా నమోదయ్యింది.

అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 823 పాయింట్లు లేదా 1 శాతం క్షీణించి 81,691.98కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 253 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టంతో 24,888 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 24,900 దిగువన ట్రేడింగ్ అయ్యింది.

సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్‌ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభ పడ్డాయి. టాటా మోటార్స్, టైటాన్, ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టి, ఎంఅండ్‌ఎం, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి, ఐటిసి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

పిన్నెల్లి సోదరుల బెయిల్ కేసు 16కి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి
టిడిపి నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో నిందితులు, వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ ఈ నెల 16కి వాయిదా పడింది. ఈలోగా పోలీసులు అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. టిడిపిలో ఆధిపత్య పోరు వల్లే హత్యలు జరిగాయని, హత్య జరిగినప్పుడు తాము వేరే చోట ఉన్నామని వారి తరఫు న్యాయవాది చెప్పారు. వీటిపై వివరాలు సమర్పించాలని పోలీసులను జస్టిస్ కుంచం మహేశ్వరరావు గురువారం ఆదేశించారు.

మిథున్‌రెడ్డి కేసు నుంచి తప్పుకున్న జడ్జి

మద్యం స్కాంపై నమోదైన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి వేసిన పిటిషన్ విచారణ చేపట్టేందుకు జస్టిస్ కుంచం మహేశ్వరరావు నిరాకరించారు. ఈ కేసును మరో జడ్జి విచారించేలా రిజిస్ట్రీ చర్యలు తీసుకోవాలని గరువారం ప్రకటించారు. ఫైలును సీజే ముందు ఉంచి వ్యాజ్యం సాధ్యమైనంత త్వరగా మరో బెంచ్ ముందు ఉండేలా చూడాలన్నారు. పిటిషనర్ తరఫు సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు.

సజ్జలపై తొందరపాటు చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి
రాజధాని అమరావతి ప్రాంతంలో ఆందోళన చేస్తున్న వారిని సంకరజాతి అంటూ వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో సజ్జలపై చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈనెల 18 వరకు సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు జస్టిస్ టిసిడి శేఖర్ గురువారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు. సంకరజాతి అనే వ్యాఖ్యలపై రఘురామ ఈనెల 10న డిజిపికి ఫిర్యాదు చేశారు. దీనిపై సజ్జల అత్యవసరంగా గురువారం హైకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదిస్తూ, పిటిషనర్ తన ఆవేదనను మాత్రమే వ్యక్తం చేశారని, కేసు నమోదు చేసి అరెస్టు చేసే అవకాశం ఉన్నందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై పోలీసుల తరఫున పిపి ఎం. లక్ష్మీనారాయణ అభ్యంతరం చెప్పారు. డిజిపికి ఫిర్యాదు అందిందని, దీనిపై ఎస్ఐఆర్ నమోదు కాకుండా కేవలం ఆందోళనతో బెయిల్ పిటిషన్ వేయడం చెల్లదన్నారు. ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న సెక్షన్లు అయితే సెక్షన్ 35(3) నోటీసు ఇచ్చి వివరణ కోరతామన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, అరెస్టుకు సంబంధించి సహేతకమైన కారణాలు ఉంటే రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయవచ్చునని చెప్పింది.

జర్నలిస్ట్ కృష్ణంరాజు పిటిషన్‌పై విచారణ మూసివేత

ప్రజాశక్తి-అమరావతి
అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ వీవీఆర్ కష్ణంరాజుపై గుంటూరుజిల్లా, తుళ్లూరు పోలీసులు పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణను మూసివేసింది. కష్ణంరాజు తరపు న్యాయవాది కల్పించుకుని పిటిషనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దీంతో పిటిషన్‌పై విచారణ అవసరం లేదని జస్టిస్ టీసీడీ శేఖర్ ప్రకటించి, సదరు వ్యాజ్యం పై విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.



విశాఖలోని అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

- టిఎంసికి ఐసిఐసిఐ బ్యాంక్ రూ.550 కోట్ల విరాళం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో
విశాఖపట్నంలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ఐసిఐసిఐ బ్యాంక్, టాటా మెమోరియల్ సెంటర్ (టిఎంసి) శంకుస్థాపన చేశాయి. ఇరు సంస్థలు సంయుక్తంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (హెచ్‌బిసిహెచ్‌ఆర్‌సి)లో కొత్త భవనాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం ఐసిఐసిఐ బ్యాంక్ రూ.550 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. ఐసిఐసిఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా, టాటా మెమోరియల్ సెంటర్ (ముంబయి) డైరెక్టర్ సుదీప్ గుప్తా సమక్షంలో ఐసిఐసిఐ బ్యాంక్ ఛైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా కొత్త భవనం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాదాపు 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. 2027 నాటికి పూర్తి కానున్న ఈ ఎనిమిది అంతస్తుల భవనం ఏడాదికి 3,000 మంది రోగులకు సేవలను అందించనుంది. ప్రస్తుత హెచ్‌బిసిహెచ్‌ఆర్‌సి ఏడాదికి 6,200 రోగులకు సేవలందిస్తోంది. కొత్త బ్లాక్‌లో 555 పడకలు ఉంటాయని సందీప్ బాత్రా తెలిపారు. విశాఖ, నవీ ముంబయి, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు టిఎంసి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు తొలుత రూ.1200 కోట్ల విరాళం ఇవ్వాలని యోచించామని.. ప్రస్తుతం పెరిగిన అవసరాల రీత్య రూ.1,800 కోట్లకు పెంచుతున్నందుకు సంతోషిస్తున్నామన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి 55వేల మందికిపైగా పాలస్తీనీయులు బలి

- 1.27 లక్షల మందికి పైగా గాయాలు

గాజా : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం అమాయకపు పాలస్తీనా ప్రజల ప్రాణాలను తీస్తున్నది. ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాన్ని వద్దని వాదిస్తున్నా.. ఇజ్రాయిల్ మాత్రం ససేమిరా అంటున్నది. డ్రోన్లు, మిసైల్స్, బాంబులతో పాలస్తీనాపై విరుచుకుపడుతున్నది. దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు.. ఇలా ప్రతి ఒక్కరూ ఇజ్రాయిల్ దుర్నీతికి బలవుతున్నారు. వీటికి సంబంధించిన పలు వీడియోలు, చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతూ.. నెటిజన్లను దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. దాదాపు 20 నెలలుగా ఈ యుద్ధ వాతావరణాన్ని కొనసాగిస్తున్నది. ఇప్పటి వరకు ఇజ్రాయిల్ నరమేధంతో 55,104 మంది చనిపోయారు. 1,27,394 మంది గాయాలపాలయ్యారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే సగం మంది కంటే ఎక్కువగా ఉన్నారని వివరించింది. చాలా మంది శిథిలాల కిందే చిక్కుకొని ఉన్నట్టు భావిస్తున్నారు. 2023, అక్టోబర్ నుంచి ఇజ్రాయిల్ దళాలు గాజాపై విరుచుకుపడుతున్నాయి. అనేక ప్రాంతాలను ధ్వంసం చేశాయి. 90 శాతం మంది ప్రజలు ఇజ్రాయిల్ దాడులకు భయపడి అక్కడి నుంచి తరలివెళ్లినట్టు తెలుస్తున్నది. గాజాలో ఆకలికేకలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా అండతో ఇజ్రాయిల్ నరమేధాన్ని కొనసాగిస్తోంది.

ఇజ్రాయిల్ పార్లమెంట్ రద్దుపై వీగిన ఓటు

- నిర్బంధ సైనిక శిక్షణపై నెతన్యాహు సంకీర్ణంలో వివాదం

జెరూసలెం : ఇజ్రాయిల్ పార్లమెంట్ (నెసెట్) తనకు తానుగా రద్దయ్యేందుకు ఉద్దేశించిన ఓటు గురువారం తిరస్కరణకు గురైంది. నిర్బంధ సైనిక శిక్షణపై రేగిన వివాదానికి సంబంధించి ఒప్పందం కుదరడంతో పార్లమెంట్ రద్దు చేయాలన్న ఆలోచన వీగిపోయింది. పార్లమెంట్‌ను రద్దు చేస్తే సత్వర ఎన్నికలకు వెళ్లేందుకు అవకాశం వుండేది. ఒకవేళ ఎన్నికలు నిర్వహించినా ప్రధాని నెతన్యాహు ఓడిపోతారని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌ను రద్దు కానివ్వకుండా ఒప్పందం కుదుర్చుకుని అడ్డుకున్నారు. గత కొన్నాళ్ళుగా ఈ అంశంపై నెతన్యాహు సంకీర్ణంలో రాజకీయ ప్రతిష్టంభన నెలకొంది. పార్లమెంట్ రద్దుకి 53మంది మద్దతు ప్రకటించగా, 61మంది తిరస్కరించారు. 123 సీట్లు కలిగిన నెసెట్‌లో ఓటు ఆమోదం పొందడానికి 61 మంది సభ్యుల మద్దతు కావాల్సి వుంది. దీంతో పార్లమెంట్ రద్దు ఓటు వీగిపోయినట్లు ఇజ్రాయిల్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

గాజాలో హమాస్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇజ్రాయిల్ పార్లమెంటు రద్దు కోరుతూ ఓటింగ్ నిర్వహించడం ఇదే మొదటిసారి. ప్రస్తుత సంక్షోభానికి దారితీసిన కొత్త సైనిక నిర్బంధ శిక్షణ బిల్లుపై సంకీర్ణంలో నెలకొన్న అసంతృప్తిని పరిష్కరించేందుకు నెతన్యాహు యత్నిస్తున్నారు.

నెతన్యాహు సంకీర్ణంలోని కొన్ని మతపరమైన పార్టీలు ఇజ్రాయిల్‌లోని నిర్బంధ సైనిక శిక్షణ నుండి యూదు సెమినరీ (అల్ట్రా అర్థడాక్స్) విద్యార్థులకు మినహాయింపులు కోరుతున్నాయి. ఇతర చట్టసభ సభ్యులు అలాంటి మినహాయింపులను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ ప్రతిష్టంభనతో అసహనం పెరుగుతున్నందున, అల్ట్రా అర్థడాక్స్ సంకీర్ణ వర్గాలు పార్లమెంట్‌ను రద్దు చేసి, ముందస్తు ఎన్నికలు జరిపేందుకు ఈ ఓటింగ్‌ను తెరపైకి తీసుకువచ్చాయి.

ఆ 8మందీ ఇంకా ఇజ్రాయిల్ అదుపులోనే !

- జులై 8న కస్టడీ రివ్యూ విచారణ

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ బలగాల దాడుల్లో చిక్కి ఛిద్రమవుతున్న గాజాకు మానవతా సాయం అందించేందుకు, అక్కడి ప్రజలకు సంఘీభావం తెలియచేసేందుకు మాడ్‌లీన్ ఓడలో బయలుదేరిన 12మంది కార్యకర్తల బృందాన్ని అంతర్జాతీయ జలాల్లోనే ఇజ్రాయిల్ అడ్డగించింది. వారిలో పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌తో సహా నలుగురిని విడిచిపెట్టి, దేశం నుండి పంపివేయగా, మిగిలిన 8మందిని జైల్లో వుంచింది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు, గ్రూపులు విమర్శిస్తున్నాయి.

ఇజ్రాయిల్ సముద్ర జలాల నిబంధనలను వారు ఉల్లంఘించారని, అందుకే తాము అదుపులోకి తీసుకున్నామని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడెన్ సార్ తెలిపారు. అడాలా లీగల్ సెంటర్ ద్వారా వారు చేసుకున్న అప్పీళ్ళను రమ్లాలోని కోర్టు తిరస్కరించింది. తమ ఆంక్షలను అమలు చేసే హక్కు ఇజ్రాయిల్‌కు వుందని పేర్కొంది. అయితే వారు ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించాలనుకోలేదని, వారిని అంతర్జాతీయ జలాల నుండి బలవంతంగా తీసుకువచ్చారని అడాలా లాయర్లు వాదించారు.ఇది మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. అక్రమంగా ప్రవేశం అన్న క్లాజు ఇక్కడు వీరికి వర్తించదని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ చట్టాల ప్రకారం నిర్బంధంలోకి తీసుకున్న వారిని 72గంటల పాటు అదుపులో వుంచవచ్చు, కొన్ని కేసుల్లో 96గంటలు లేదా అంతకుమించి కూడా వుండొచ్చు. ఆ తర్వాత వారు స్వచ్ఛంగా వెళ్లిపోవడానికి ఆమోదం తెలియచేయకపోతే వారిని బలవంతంగానైనా పంపివేయవచ్చు. జులై 8నాటికి కూడా వీరిని పంపకపోతే అప్పుడు కస్టడీ రివ్యూ విచారణ వుంటుంది.

ప్రస్తుతానికి ఫ్రెంచి ఎంపి రిమా హసన్‌ను నెవె టిర్జా జైల్లో ఏకాంత కారాగారవాసంలో వుంచారు. తన మొబైల్ వాల్‌పై ఫ్రీ పాలస్తీనా అని రాసినందుకు ఆమెను ఇలా విడిగా నిర్బంధించారు. అనంతరం మిగిలిన వారితో కలిపి గివన్ జైలుకు తరలించారు. తన పట్ల అమానుషంగా వ్యవహరించినందుకు నిరసనగా నిరాహార దీక్ష చేసిన బ్రెజిల్ కార్యకర్త టియాగో అవిలాను ఆయలాన్ జైలుకు పంపారు.

మహిళా సాధికారతలో వెనకడుగే!

- లింగ అసమానతల్లో మరో రెండు స్థానాలు పతనం
- డబ్ల్యూఇఎఫ్ నివేదిక వెల్లడి
- పార్లమెంటులో తగ్గుతున్న ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ : ప్రపంచ లింగ అసమానతల నివేదికలో భారత్ ర్యాంక్ మరో రెండు స్థానాలు పడిపోయింది. ప్రపంచ ఆర్థిక ఫోరం రూపొందించిన ఈ నివేదిక ప్రకారం మొత్తం 148 దేశాలలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గురువారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం 64.1 శాతం సమానత్వ స్కోరుతో భారత్ దక్షిణాసియాలో అతి తక్కువ ర్యాంక్ పొందిన దేశాల జాబితాలో నిలిచింది. గత సంవత్సరం మన దేశం 129వ ర్యాంక్ పొందింది. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ పురుషుల మధ్య ఉన్న అసమానతలను కొలిచే ఈ సూచికలో నాలుగు కీలక కోణాలను...ఆర్థిక అవకాశాలు, విద్య, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారతను పరిగణనలోకి తీసుకుంటారు.

ఆర్థిక పనితీరులో...

అంతర్జాతీయ లింగ అసమానతల సూచీ ప్రకారం మొత్తంగా భారత్ ఆర్థిక పనితీరు +0.3 పాయింట్లు మెరుగుపడింది. 'ఆర్థిక వ్యవహారాలలో మహిళల భాగస్వామ్యం, అవకాశాల కోణంలో చూస్తే భారత్ పనితీరు +0.9 శాతం మెరుగుపడి 40.7 శాతానికి చేరింది. అనేక సమానత్వ విలువలు అలాగే ఉన్నప్పటికీ అంచనా వేసిన ఆదాయంలో సమానత్వం 28.6 శాతం నుండి 29.9 శాతానికి పెరిగింది' అని నివేదిక తెలిపింది. లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (ఎల్ఎఫ్పిఆర్) గత సంవత్సరం ఉన్నట్లుగానే ఈ ఏడాది కూడా 45.9 శాతంగా ఉంది. ఇప్పటి వరకూ భారత్ సాధించిన అత్యధిక రేటు ఇదే. విద్యాభ్యాసం విషయానికి వస్తే భారత్ 97.1 శాతం స్కోరు సాధించింది. స్త్రీ పురుషుల ఆయుర్దాయం తగ్గినప్పటికీ వారు ఆరోగ్యంగానే గడుపుతున్నారని నివేదిక చెబుతోంది. 'మహిళా సాధికారత విషయంలో భారత్ స్థానం స్వల్పంగా (-0.6 పాయింట్లు) తగ్గింది. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం 2025లో 14.7 శాతం నుండి 13.8 శాతానికి పడిపోయింది. ఇది వరుసగా రెండో సంవత్సరం కూడా 2023 స్థాయిల కంటే తక్కువగా ఉంది' అని తెలిపింది. మంత్రి పదవులు నిర్వహించిన మహిళల సంఖ్య కూడా 6.5 శాతం నుండి 5.6 శాతానికి తగ్గిపోయింది. 2019లో అత్యధికంగా 30 శాతంగా ఉన్న సూచిక స్కోరు ఈ ఏడాది 5.9 శాతానికి తగ్గింది.

మరో 123 ఏళ్ల తర్వాతే పూర్తి సమానత్వం

రాజకీయ సాధికారత, ఆర్థిక వ్యవహారాలలో భాగస్వామ్యం విషయాలలో దక్షిణాసియాలో బంగ్లాదేశ్ గణనీయమైన ఫలితాలు సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 75 స్థానాలు ఎగబాకి 24వ స్థానంలో నిలిచింది. నేపాల్ 125, శ్రీలంక 130, భూటాన్ 119, మాల్దీవులు 138, పాకిస్తాన్ 148వ స్థానాలలో ఉన్నాయి. ప్రపంచ లింగ అసమానతలు 68.8 శాతానికి చేరుకున్నాయని, కోవిడ్-19 మహమ్మారి తర్వాత బలమైన వార్షిక మెరుగుదల కన్పిస్తోందని నివేదిక తెలియజేసింది. అయితే ప్రస్తుత రేట్ల ప్రకారం చూస్తుంటే స్త్రీ పురుషుల మధ్య పూర్తి సమానత్వం సిద్ధించడానికి మరో 123 సంవత్సరాలు పట్టవచ్చునని చెప్పింది. కాగా వరుసగా 16వ సంవత్సరం కూడా ఐస్‌లాండ్ మొదటి స్థానంలో నిలవగా ఫిన్లాండ్, నార్వే, యూకే, న్యూజిలాండ్ దేశాలు తర్వాతి స్థానాలు పొందాయి. నివేదికకు సంబంధించిన 19వ ఎడిషన్ మొత్తం 148 దేశాలను గమనంలోకి తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సాధించిన విజయాలతో పాటు ఎదుర్కొంటున్న అవరోధాలను కూడా అది సవివరంగా తెలిపింది.

నాయకత్వ స్థానాలలో ప్రాతినిధ్యం తక్కువే

రాజకీయ సాధికారత, ఆర్థిక భాగస్వామ్యం విషయాలలో మహిళలు ప్రపంచవ్యాప్తంగా ముందడుగు వేస్తున్నారు. విద్యను సముపార్జించడం, ఆరోగ్యం-మనుగడ సాధించడం వంటి విషయాలలో సమానత్వ స్థాయి 95 శాతం కంటే ఎక్కువగానే ఉంది. ప్రపంచ కార్మిక శక్తిలో మహిళల వాటా 41.2 శాతంగా ఉన్నప్పటికీ నాయకత్వ అసమానతలు ఎక్కువగా ఉన్నాయని నివేదిక గుర్తించింది. ఉన్నత నాయకత్వ స్థానాలలో మహిళల వాటా కేవలం 28.8 శాతం మాత్రమేనని తెలిపింది. ప్రపంచ ఆర్థిక అస్థిరత, వృద్ధి రేటుపై నిరాశాజనకమైన సూచనలు, సాంకేతిక-భౌగోళిక మార్పులు వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ లింగ సమానత్వంలో కన్పిస్తున్న మెరుగుదల ఆర్థిక పునరుద్ధరణకు కీలకమవుతోందని ప్రపంచ ఆర్థిక ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిది చెప్పారు. సమానత్వం దిశగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు నిర్ణయాత్మక పురోగతి సాధిస్తున్నాయన్నది సుస్పష్టమని, అవి ఆర్థికాభివృద్ధిలో తమను తాము బలంగా, మరింత ఆధునికంగా, స్థితిస్థాపకంగా నిలుపుకుంటున్నాయని ఆయన తెలిపారు.

21న విశాఖలో యోగాకు భారీ ఏర్పాట్లు



కేంద్ర మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర ఆయూష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ అన్నారు. గురువారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉదయం 5:30 గంటల నుంచి ప్రజలకు యోగా వేదిక వద్దకు చేరుకోవడానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉదయం 6:30 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రధాని మోడీ ప్రసంగం తరువాత కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పాల్గొంటారని అన్నారు. ఐదు లక్షల మంది ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఎపి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయంగా పలు దేశాల్లో యోగా దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నంలో జరిగే యోగా కార్యక్రమంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. 45 నిమిషాల పాటు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు పాల్గొంటారని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో లైవ్ ప్రసారం జరుగుతుందని కేంద్రమంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ తెలిపారు.

ఆర్‌టిజిఎస్‌ను సందర్శించిన ఇథియోపియా బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)ను ఇథియోపియా దేశానికి చెందిన ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఆ దేశ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ ఫైనాన్స్ ప్రోగామ్ డైరెక్టర్ గిరుమ్ కెటెమా టెక్లెమారియం నేతృత్వంలోని 10 మంది ప్రతినిధుల బృందం అమరావతి పర్యటనలో భాగంగా గురువారం ఆర్‌టిజిఎస్‌ను సందర్శించింది. ఆర్‌టిజిఎస్ పనితీరును సిఇఒ ఎం.మాధురి ఇథియోపియా బృందానికి వివరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల డేటాను అనుసంధానిస్తూ ఒక పెద్ద డేటా లేక్‌ను రూపొందిస్తున్నామని, దీనితో పాలన మరింత సరళీకృతం చేయడానికి వీలవుతుందన్నారు. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి మొబైల్ ఫోన్లోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయ మన్నారు. ఈ క్రమంలో 'మన మిత్ర' పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిందన్నారు. ఇప్పటి వరకూ 455 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌తో అందజేస్తున్నామని తెలిపారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు బహిరంగ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి **21 జూన్, 2025**న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోస్ చేయాలని నిర్ణయించింది. ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్ 1872 యొక్క సెక్షన్ 176 మొత్తంలో అమ్మకం నోటీసుగా పరిగణించమని రుణగ్రహీలకు ఇక్కడ తెలియజేయడమైనది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

జోరీగల సాయం



సుందరవనమనే అడవిలో టక్కరి నక్క ఉంది. అది పెద్దపులి, చిరుత పులి, సింహం మొదలైన క్రూర జంతువులకు చిన్న చిన్న జంతువులను అప్పగించి అవి చంపి తినగా మిగిలిన ఆహారాన్ని తినేది.

ఒకసారి నక్క, ఒక జింకల గుంపును చూసింది. అందులో ఒక అమాయకపు జింకపిల్ల ఉంది. ఈ నక్క దాని వద్దకు వెళ్లి 'ఓ జింకా! ఈ దగ్గర్లో పచ్చని పచ్చిక ఉంది. నీకు దాన్ని చూపిస్తాను. నా వెంబడి వస్తావా!' అని అడిగింది. అప్పటికే ఆకలితో ఉన్న జింక పిల్ల, 'సరే వస్తా' అని చెప్పి దాని వెంట బయల్దేరింది.

అప్పుడు తోటి జింకలు 'ఓ బుజ్జీ... దాని మాటలు నమ్మకు. అది నిన్ను క్రూర మృగాలకు అప్పగించాలని చూస్తున్నది' అని హెచ్చరించాయి. ఆ మాటలు జింకపిల్ల పెడచెవిన పెట్టి ముందుకు కదిలింది.

నక్కతో పాటు జింకపిల్ల కొద్ది దూరం వెళ్లింది. అక్కడ చెట్టు పైన ఉన్న ఒక చిలుక దూరాన ఉన్న పెద్దపులిని గమనించి 'ఓ జింకా! దూరంగా ఒక పెద్ద పులి ఉంది. నీవు వెనుకకు తిరిగి వెళ్లు' అని చెప్పింది. జింకపిల్ల చిలుక మాటలు కూడా పట్టించుకోలేదు.

చిలుక వెంటనే ఎగురుకుంటూ వెళ్లి మిగతా జింకలకు అక్కడ పెద్ద పులి ఉన్న సంగతి చెప్పింది. వెంటనే జింకల గుంపు దగ్గర్లోని జోరీగల గుంపు దగ్గరికి వెళ్లాయి. 'సాయం చేయమ'ని వాటిని అడిగాయి.

ఆ జోరీగలు మూకుమ్మడిగా ముందుకు పరుగెత్తి వెళ్లి జింకపిల్ల ముందుకు వెళ్లకుండా అడ్డగించి దాని చెవులలో రొదను ప్రారంభించాయి. ఆ శబ్దానికి నక్క ఎటో పారిపోయింది. వాటి రొదను భరించలేక జింకపిల్ల వెనుతిరిగింది. అది జింకల గుంపును చేరేంతవరకు జోరీగలు దాని వెంట పడ్డాయి.

అప్పుడు తోటి జింకలు ఆ పులిని చూసిన చిలుక ఆవేదనను, అవి పంపించిన జోరీగల గురించి దానికి చెప్పాయి. ఈలోపు నక్క తిరిగి అక్కడికి చేరి జింకపిల్లను తిరిగి రమ్మంది. అప్పటికే విషయం అర్థమైన జింకపిల్ల 'రాన'ని తెగేసి చెప్పింది. ఎలాగైనా దాన్ని అక్కడి నుండి తీసుకుపోవాలని చూస్తున్న నక్కపై జింకలన్నీ దాడికి సిద్ధమయ్యాయి. దెబ్బకి నక్క అక్కడి నుండి పారిపోయింది .

అప్పుడు ఆ జింకలు 'ఓ బుజ్జీ! పెద్దలు చెప్పిన మాటను వినాలి. ఎవరైనా మోసకారులు రమ్మంటే ఒంటరిగా వారితో వెళ్లకూడదు. వారు మనకు హాని తలపెడతారు. మనం అన్నింటితో పాటు కలిసి ఐకమత్యంగా ఉంటేనే మనకు ఏ ఆపద రాదు. మరోసారి నక్కలాంటి కపటుల మాటలను నమ్మకు' అని హితవు పలికాయి.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి. 99085 54535.

సరైన అక్షరం రాయండి


పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటిని ఇంగ్లీషులో ఏమంటారో పక్కన కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిల్లో సరైన అక్షరం రాసి ఆ పదాన్ని కనిపెట్టండి చూద్దాం..



నేను గీసిన బొమ్మ



గణపురం శ్రావణి,
8వ తరగతి,
జెడ్‌పిజిహెచ్‌ఎస్,
కొండపాక.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



సంగీత గంగా ప్రవాహం!



శ్రద్ధ పెడితే ఏదేని విద్యపై పట్టు సాధించడం పిల్లలకు త్వరగానే అబ్బుతుంది. అయితే సంగీతంపై ప్రావీణ్యం మాత్రం అంత తేలికగా రాదు. ఏళ్ల తరబడి సాధన చేయాలి. కానీ గంగ నాలుగన్నరేళ్లప్పటి నుండి సాధన చేసి, ఆరో ఏడు వచ్చేసరికి ప్రదర్శనలిచ్చే స్థాయికి వెళ్లింది. సంగీతంపై ఇంత మక్కువ ఎందుకు ఏర్పడిందో గంగ స్వయంగా ఇలా చెప్పింది. 'చాలా చిన్న వయసులోనే అమ్మ కృష్ణవేణి వయోలిన్ వాయించడం వినేదాన్ని. నాకు ఆ శబ్దం చాలా బాగా అనిపించేది. నేను కొంచెం పెద్దయ్యాక వయోలిన్ విద్వాంసుడు బాల భాస్కర్ స్వరపర్చిన వయొలిన్ శ్రుతులు వినేలా అమ్మ ఏర్పాటుచేసింది. అప్పటి నుండి వయొలిన్‌పై నా ఇష్టం ఇంకాస్త పెరిగింది. ఆ శబ్దంలో ఒక ప్రత్యేకత దాగుంది. ఎప్పటికైనా అమ్మలా నేను కూడా వాయించాలని అనుకునేదాన్ని. ఈ ప్రయాణంలో ఇప్పటి వరకు వెనక్కి తిరిగి చూడలేదు' అని చెబుతున్న గంగలో ఎంత పరిణితి కనిపిస్తుంది.

వయొలిన్ ప్రాడిజి..

12 ఏళ్లకే 'వయొలిన్ ప్రాడిజి' (వయొలిన్ విన్యాసి)గా గంగ ఎంతోమంది హృదయాలను గెలుచుకుంది. తన భుజాలపై వయొలిన్‌ని అటూ ఇటూ సర్దుకుంటూ, రాగాలు పలికిస్తున్న గంగ ఆ సమయంలో ఏ కదలిక చేసినా అది చూసేవారికి సంగీతంలో భాగంగా అనిపిస్తుంది. అంతలా పాట లయపై తన పట్టు ఉంటుంది. ప్రతి నోట్‌ని ఎంజాయ్ చేస్తూ, కళ్లు అటూ ఇటూ తిప్పుతూ, మధ్యమధ్యలో చిరునవ్వులు చిందిస్తూ వాయిస్తున్న గంగని చూస్తుంటే తను ఆ పరికరంతో సంగీతం పలికిస్తుందా! లేదా మాట్లాడుతుందా అనిపిస్తుంది.

ఫెలోషిప్ ఓ రికార్డు

ఆలయాలు, ప్రైవేటు కార్యక్రమాల్లో పాటలు పాడే గంగ తన చుట్టూ ఉన్న వారిని మంత్రముగ్ధులని చేయకుండా ఉండదు. ఆ ప్రేమతోనే ఇప్పటివరకు తను 30 కీర్తనలను, 50 సినిమా పాటలను వయొలిన్‌పై రాగయుక్తంగా పలికించింది. ఇటీవల వచ్చిన ఫెలోషిప్ సంగీతంలో 2024-26కి సంబంధించింది. ముంబయిలో దాన్ని అందుకుంది. కేరళ నుండి ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తి తను. అదీ ఇంత చిన్నవయసులో అందుకోవడం ఓ రికార్డు.

నటించే సమయం లేదు..

కేరళకి బయట మంగుళూరు, ఉడిపి, నాగర్‌కోయిల్, తంజావూర్, కుంభకోణం, వీరలిమాల, దేవకొట్టాయ్, మైసూరు, బెంగుళూరు, హైద్రాబాద్ వంటి అనేక చోట్ల గంగ ప్రదర్శనలిచ్చింది. శాస్త్రీయ సంగీతం, సినిమా పాటలు ఏవైనా వయొలిన్‌పై అలవోకగా పలికిస్తుంది. సోషల్‌మీడియాలో వైరల్ అయిన గంగ వీడియోలు చూసి తనకి సినిమా అవకాశాలు కూడా వచ్చాయి. వాటి గురించి గంగ నాన్న శశిధరణ్ ఇలా చెబుతున్నారు. సినిమాల్లో నటించే వెసులుబాటు మాకు లేదు. ప్రస్తుతం గంగతో కచేరీలు ఇప్పించాలనే అనుకుంటున్నాం. తను బాగా చిన్న పిల్ల. 6వ తరగతి చదువుతోంది. ఒక పక్క చదువు, మరో పక్క కచేరీలతోనే తన సమయం గడిచిపోతోంది' అంటున్నారు.

లక్ష్యం వేరే ఉంది..

ఇంత ప్రతిభ ఉన్న గంగ కచేరీలు ప్రారంభించినప్పటి నుండీ పాపులర్ అవ్వలేదు. గతేడాది గురువాయూర్ ఆలయంలో జుగల్‌బందీ చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ చేశారు. అప్పటి నుండి గంగ ఎక్కడ కచేరీ చేసినా అది వైరల్ అవుతోంది. దీనిపై గంగ తన ఆనందాన్ని ఇలా వ్యక్తపరిచింది. 'వాళ్ల మద్దతుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఇప్పటివరకు 200 కచేరీలు చేశాను. ఉదయం 5:30కి నిద్ర లేస్తాను. రెండు గంటలు వయొలిన్ సాధన చేస్తాను. సంగీతం వింటూ ఎంతో ఎంజాయ్ చేస్తా. సినిమా పాటలు అంటే మరీ మరీ ఇష్టం. ప్రస్తుతం కర్నాటక సంగీతం నేర్చుకుంటున్నాను' అంటున్న గంగ సంగీత సాధన చేస్తూ అలా కూర్చొని వయొలిన్ వాయించడానికే పరిమితమై పోవాలనుకోవట్లేదు. తను రెక్కలు కట్టుకోకుండా పక్షిలా ఎగరాలనుకుంటోంది. 'పెద్ద చదువులు చదివి పైలట్ అవుతా. అదే నా జీవితంలో పెద్ద కల' అంటోంది. ఈ బాల వాయిద్యకారిణి తన అభిరుచులను ఆస్వాదిస్తూ భవిష్యత్ లక్ష్యం చేరుకోవాలని కోరుకుందాం.

'పిట్ట కొంచెం కూత ఘనం' అన్న నానుడి ఈ 12 ఏళ్ల గంగా శశిధరన్‌కి సరిగ్గా సరిపోతుంది. కేరళకి చెందిన గంగ అందరి పిల్లల్లాగే తెగ అల్లరి చేస్తుంది. పాటలు పాడుతుంది. బాగా చదువుతుంది. అయితే గంగకి ఉన్న ప్రత్యేకత ఏంటంటే తను వయొలిన్ బాగా వాయిస్తుంది. సోషల్ మీడియాలో తనకి లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆ వీడియోల్లో వయొలిన్ వాయిస్తున్న గంగ స్వరాలకు అనుగుణంగా తన ముఖంలో భావాలు మారుస్తుంటే తనపై నుండి ఎవరూ చూపు తిప్పుకోలేరు. అంతలా ఆ భావాలు పలుకుతాయి. తన పెద్ద కళ్లు, చెవులు, నోరు, ముక్కు ఇలా ముఖంలో కనిపించే అవయవాలన్నీ వయొలిన్ వాయిస్తున్నాయా! అన్నంతగా ఆ దృశ్యం వుంటుంది. చెప్పడం కంటే చూస్తేనే అది అర్థమవుతుంది. ఇంత చిన్న వయసులోనే గంగ వందల్లో కచేరీలు ఇస్తోంది. మొన్నీమధ్యే తన విదేశీ ప్రదర్శన దుబాయ్‌లో ఇచ్చి వచ్చింది. అంతేకాదు, గంగ ఇటీవలె షణ్ముకానంద భారతరత్న డా ఎం ఎస్ సుబ్బులక్ష్మి ఫెలోషిప్‌ని కూడా గెలుచుకుంది. ప్రముఖ ఫ్లూటిస్ట్ పద్మ విభూషణ్ హరిప్రసాద్ చౌరసియా చేతుల మీదుగా ఆ అవార్డు అందుకుంది.










'కుబేరా'లో నటులు కాదు, క్యారెక్టర్స్ కనిపిస్తాయి..



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న నటిస్తున్న 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలకు సిద్ధంగా ఉంది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. 'శేఖర్ కమ్ముల 'లవ్ స్టోరీ' తర్వాత ఈ ఐడియాని మాకు చెప్పారు. ఈ కథకు ధనుష్ అయితే బాగుంటుందని ఆయన భావించారు. ఆయనకి ఈ కథని చెప్పారు. ధనుష్ 20 నిమిషాలు విని వెంటనే సైన్ చేశారు. శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన లీడర్ సినిమా ఎప్పుడు చూసినా సరే చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. శేఖర్ కమ్ముల గారు స్టార్స్‌ని క్యారెక్టర్స్ గానే చూస్తూ సినిమా తీసే ఫిలిం మేకర్. ఈ సినిమాలో కూడా క్యారెక్టర్స్ కనిపిస్తాయి. 'మోస్ట్ రిచెస్ట్ మాన్ ఇన్ ద వరల్డ్, ది పూరెస్ట్ మ్యాన్ ఇన్ ది స్ట్రీట్స్' ఇది సినిమా కథాంశం. ఈ సినిమా కోసం అన్ని రియల్ లొకేషన్స్ లోనే షూట్ చేశాం. రియల్ స్లమ్స్, గార్బేజ్, డంపింగ్ యార్డ్స్‌లో తీసాము. బొంబాయిలో సినిమాని సూట్ చేయడం మరో ఛాలెంజ్. దాదాపు 1600 స్క్రీన్స్‌లో సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రంలో నాగార్జున గారి పాత్ర కోసం ఆయన తప్పితే మరెవరూ శేఖర్ గారికి కనిపించలేదు. దేవిశ్రీ ఈ సినిమా కోసం చాలా డిఫరెంట్ సాంగ్స్ ఇచ్చారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది. ధనుష్ రెండు పాటలు పాడారు. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేయనున్నాం. అయితే ఇంకా హీరో ఎవరనేది ఫైనల్ కాలేదు'.

గోపీచంద్ కొత్త సినిమా గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ కథానాయకుడు గోపిచంద్, దర్శకుడు సంకల్ప్‌రెడ్డి కొత్త సినిమా గ్లింప్స్ విడుదలయ్యాయి. గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా నిర్మాతలు విడుదల చేశారు. గోపీచంద్ 33 పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్‌ను ఇంకా ప్రకటించలేదు. చిట్టూరి శ్రీనివాస ఈ మూవీని నిర్మిస్తున్నారు. త్వరలో మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. భారతీయ చరిత్రలో అనేక కీలకఘట్టాల ఆధారంగా ఈ సినిమాను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. సంకల్ప్‌రెడ్డి గతంలో ఘాజీ, అంతరిక్షం చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. చాలా గ్యాప్ తర్వాత ఆయన నుంచి ఈ సినిమా రానుంది.



కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా



మంచు విష్ణు హీరోగా ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కన్నప్ప' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. జూన్ 27న ఈ సినిమా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన విష్ణు జూన్ 13న ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఇండోర్‌లో నిర్వహించాలని అనుకున్నారు. ఈ వేడుకలోనే కన్నప్ప ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. గురువారం అహ్మదాబాద్ వద్ద ఘోర విమాన ప్రమాదం జరిగిన నేపథ్యంలో– ఈ విషాద సమయంలో తమ కన్నప్ప ట్రైలర్‌ను రిలీజ్ చేయలేమని మంచు విష్ణు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను క్యాన్సిల్ చేసుకున్నట్లు తెలిపారు. విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటిస్తూ పోస్ట్ పెట్టారు.

తెలుగు సినీ నిర్మాత మహేంద్ర మృతి



తెలుగు సినీ పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. టాలీవుడ్ సీనియర్ నిర్మాత, ఏ.ఏ ఆర్ట్స్ అధినేత మహేంద్ర (75) జూన్ 11 (బుధవారం) అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహేంద్ర, చికిత్స పొందుతూ మరణించారు. గురువారం (జూన్ 12)న ఆయన స్వస్థలమైన గుంటూరులో కుటుంబ సభ్యులు అంత్యక్రియలను నిర్వహించారు. సినీ పరిశ్రమలో ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రేమించి పెళ్ళి చేసుకో' మూవీతో నిర్మాతగా మారిన మహేంద్ర ఆ తర్వాత 'ఆరని మంటలు', 'బందిపోటు రుద్రమ్మ', 'తోడు దొంగలు', 'ఎదురులేని మొనగాడు', 'ఢాకూ రాణి', 'ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహాత్మ్యం' వంటి చిత్రాలతో నిర్మాతగా విజయాన్ని అందుకున్నారు. శ్రీహరి హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' చిత్రాన్ని నిర్మించింది కూడా ఆయనే. మహేంద్ర కేవలం వ్యాపార దృష్టితో కాకుండా, ప్రేక్షకులకు మంచి కంటెంట్ అందించాలనే సంకల్పంతో చిత్రాలను నిర్మించారనే అభిప్రాయం పరిశ్రమలో ఉంది.

ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు : నిఖిల్

రామ్‌చరణ్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా 'ది ఇండియా హౌస్' చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో కీలకమైన సముద్రం సీన్ చిత్రీకరణ కోసం శంషాబాద్ సమీపంలో అతి పెద్ద వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయగా ప్రమాదవశాత్తు అది పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా సెట్‌లోకి నీళ్లు ముంచెత్తాయి. ఈ ఘటనలో కొంతమందికి గాయాలయ్యాయి. దీనిపై ఈ చిత్ర కథానాయకుడు నిఖిల్ వివరణ ఇచ్చారు. 'మేము అందరం క్షేమంగానే ఉన్నాం. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇవ్వాలని ప్రయత్నాలు చేసే క్రమంలో కొన్నిసార్లు ఇలాంటి రిస్క్‌లు తీసుకోవాల్సిందే. చిత్ర యూనిట్ ముందుగా తీసుకున్న జాగ్రత్తల వల్ల మేము పెద్ద ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాం. అయితే, అత్యంత ఖరీదైన పరికరాలను కోల్పోయాం.' అని తెలిపారు. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్, సయీ మంజ్రేకర్ జంటగా నటిస్తున్నారు. రామ్ వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమ్ ఖేర్ ఒక కీలకమైన పాత్రలో నటిస్తున్నారు.



రసపట్టులో లార్డ్స్ టెస్ట్

- కమిన్స్‌కు ఆరు వికెట్లు
- దక్షిణాఫ్రికా 132ఆలౌట్
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 144/8



కమిన్స్
18-6-28-6

లండన్: లార్డ్స్ వేదికగా జరుగుతున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ రసవత్తరంగా సాగుతోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (6/28) సంచలన బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138పరుగులకే ఆలౌట్ కాగా.. అనంతరం దక్షిణాఫ్రికా పేసర్లు ఎన్గిడి, రబడా దెబ్బకు ఆసీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 144పరుగులకే 8వికెట్లు కోల్పోయింది. దీంతో ఆసీస్ జట్టు ఇప్పటికే 218పరుగుల ఆధిక్యతలో ఉండగా.. ఆ జట్టు చేతిలో మరో రెండు వికెట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో మూడోరోజు ఈ టెస్ట్ ఫలితం తేలడం ఖాయంగా కనబడుతోంది. అంతకుముందు 4వికెట్ల నష్టానికి 43పరుగులతో దక్షిణాఫ్రికా గురువారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించి 138పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆసీస్ జట్టుకు 74పరుగుల ఆధిక్యత లభించింది. 5వికెట్ల నష్టానికి 126పరుగులతో పటిష్టంగా ఉన్న దశలో సఫారీ జట్టును కమిన్స్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో కట్టడి చేశాడు. 121 పరుగుల వద్ద లంచ్‌కు వెళ్లిన సఫారీ జట్టు ఆ తర్వాత వరుసగా మిగిలిన వికెట్లను కోల్పోయింది. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన కమిన్స్.. రబడ(1) గాల్లోకి లేపిన బంతిన బౌండరీ వద్ద వెబ్‌స్టర్ అందుకోవడంతో సఫారీ జట్టు ఇన్నింగ్ ముగిసింది.

మూడో కెప్టెన్‌గా రికార్డు

లంచ్ తర్వాత తన పేస్ పవర్ చూపించిన కమిన్స్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. కైలీ వెర్రినే(13)ను ఎల్బీగా వెనక్కి పంపిన అతడు.. ఆ తర్వాత మార్కో యాన్సెన్(0)ను బౌల్డ్ చేసి దక్షిణాఫ్రికాను ఆలౌట్ అంచున నిలిపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా క్రీజులో పాతుకుపోయిన డేవిగ్ బెడింగ్హామ్(45) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. నిన్నటి నుంచి విసిగిస్తున్న అతడిని ఔట్ చేయడం ద్వారా కమిన్స్ ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా లార్డ్స్ మైదానంలో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మూడో కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు కమిన్స్. అలాగే రబడను ఔట్ చేయడం ద్వారా కమిన్స్ టెస్టుల్లో 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. ఈ ఘనత సాధించిన 8వ ఆసీస్ బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 212 ఆలౌట్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : మార్‌క్రమ్ (బి)స్టార్క్ 0, రికెల్టన్ (సి)ఖవాజా (బి)స్టార్క్ 16, ముల్డర్ (బి)కమిన్స్ 6, బవుమా (సి)లబూషేన్ (బి)కమిన్స్ 36, స్టబ్స్ (బి)హేజిల్‌వుడ్ 2, బెడింగ్హామ్ (సి)క్యారీ (బి)కమిన్స్ 45, వెర్రెయానే (ఎల్‌బి)కమిన్స్ 13, యాన్సెన్ (సి అండ్ బి)కమిన్స్ 0, మహరాజ్ (రనౌట్) హెడ్/క్యారీ 7, రబడా (సి)వెబ్‌స్టర్ (బి)కమిన్స్ 1, ఎన్గిడి (నాటౌట్) 0, అదనం 12. (57.1ఓవర్లలో ఆలౌట్) 138పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/19, 3/25, 4/30, 5/94, 6/126, 7/126, 8/135, 9/138, 10/138 **బౌలింగ్:** స్టార్క్ 13-3-41-2, హేజిల్‌వుడ్ 15-5-27-1, కమిన్స్ 18-6-28-6, లియాన్ 8-3-12-0, వెబ్‌స్టర్ 3-0-20-0

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : లబూషేన్ (సి)వెర్రెయానే (బి)యాన్సెన్ 22, ఖవాజా (సి)వెర్రెయానే (బి)రబడా 6, గ్రీన్ (సి)ముల్డర్ (బి)రబడా 0, స్మిత్ (ఎల్‌బి) ఎన్గిడి 13, హెడ్ (బి) ముల్డర్ 9, వెబ్‌స్టర్ (ఎల్‌బి)ఎన్గిడి 9, క్యారీ (ఎల్‌బి) రబడా 43, కమిన్స్ (బి)ఎన్గిడి 6, స్టార్క్ (బ్యాటింగ్) 16, లియాన్ (బ్యాటింగ్) 1, అదనం 19. (40ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 144పరుగులు. **వికెట్ల పతనం:** 1/28, 2/28, 3/44, 4/48, 5/64, 6/66, 7/73, 8/134 **బౌలింగ్:** రబడా 11-0-44-3, యాన్సెన్ 12-3-31-1, ముల్డర్ 6-0-14-1. ఎన్గిడి 9-0-35-3, మహరాజ్ 2-0-10-0

2025 వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్

సింగిల్స్ విజేతకు రూ.34కోట్లు

ప్రైజ్‌మనీని భారీగా పెంపు

లండన్: 2025 వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని పెంపుదల చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఆల్ ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ క్లబ్(ఎఇఎల్‌టిసి) గురువారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2024 ఏడాదితో పోల్చి చూస్తే సుమారు 7శాతం నగదును అదనంగా ఆటగాళ్లకు అందజేయనున్నారు. దీంతో సింగిల్స్ టైటిల్ విజేతలు భారత కరెన్సీలో సుమారు రూ.35కోట్లు చొప్పున అందకోనున్నారు. ఇది మిగిలిన గ్రాండ్‌స్లామ్ టోర్నీ విజేతలకు అందజేసే నగదుతో పోల్చిచూస్తే అత్యధికం. గత ఏడాది టైటిల్‌ను కైవసం చేసుకున్న కార్లోస్ అల్కరాజ్ అందుకున్న నగదు కంటే 11.1శాతం ఈసారి టైటిల్ విజేత అందుకోనున్నాడు. తొలిరౌండ్‌లో ఓడిన ఆటగాడు రూ.56లక్షలు అందుకోనున్నాడు. ఇది గత ఏడాదితో పోల్చిచూస్తే 10శాతం ఎక్కువ. ఇక డబుల్స్‌లో తొలిరౌండ్‌లో ఓడిన ఆటగాళ్లు కూడా గత ఏడాదితో పోల్చిచూస్తే 4.4శాతం, మిక్స్‌డ్ డబుల్స్ తొలిరౌండ్‌లో ఓడిన ఆటగాళ్లు 4.3శాతం, వీల్‌చైర్, క్వాడ్ వీల్ చైర్‌లో తొలిరౌండ్‌లో ఓడిన ఆటగాళ్లు 5.6శాతం చొప్పున ఎక్కువ మొత్తం అందుకోనున్నారు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడే ఆటగాళ్లకు ప్రైజ్ మనీని పెంపుదల చేయాలని అగ్రశ్రేణి ఆటగాళ్లు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పెంపుదల చేసినట్లు సమాచారం.

శుచి స్థానంలో రాధా



ముంబయి: భారత మహిళల జట్టు ఈనెలలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు వెళ్లే భారత జట్టును బిసిసిఐ ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా గాయపడ్డ శుచి ఉపాధ్యాయ స్థానంలో రాధా యాదవ్‌ను ఎంపిక చేసింది. శ్రీలంక వేదికగా జరిగిన ట్రయాంగులర్ సిరీస్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన 20ఏళ్ల ఎడమ చేతి వాటం స్పిన్నర్ అయిన శుచి ఉపాధ్యాయ కాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎడమచేతి వాటం స్పిన్నర్ అయిన రాధా యాదవ్‌ను పిలిచినట్లు బిసిసిఐ గురువారం ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌తో ఐదు టి20ల సిరీస్‌తోపాటు మరో మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది.

జట్టు: టి20: హర్మన్(కెప్టెన్), మంధాన(వైస్ కెప్టెన్), షెఫాలీ, రోడ్రిగ్స్, రీచా, యాస్తికా(వికెట్ కీపర్లు), హర్లీన్, దీప్తి, స్నేహ్ రాణా, శ్రీచరాని, అమన్‌జ్యోత్, అరుంధతి, క్రాంతి గాడ్, సయాలి, రాధా.

వన్డేలకు: హర్మన్(కెప్టెన్), మంధాన(వైస్ కెప్టెన్), ప్రతిక, హర్లీన్, రోడ్రిగ్స్, రీచా, యాస్తికా(వికెట్ కీపర్లు), తేజల్, దీప్తి, స్నేహ్ రాణా, శ్రీచరాణి, అమన్‌జ్యోత్, అరుంధతి, క్రాంతి గాడ్, సయాలి, రాధా.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68